ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
10-1-2026 శనివారం సంపుటి: 31 సంచిక: 340 పేజీలు: 10+4 వెల: 6.50

ఇరాన్‌లో ఖమేనీ వ్యతిరేక నిరసనలు ఉధృతం
అమిత్‌షా ఆఫీసు ముందు టిఎంసి ధర్నా
5

## గ్రౌండ్ ఆపరేషన్ మొదలు పెడుతు న్నామన్న ట్రంప్

# ఇక మెక్సికోపై సైనిక చర్య!



**వాషింగ్టన్, జనవరి 9:** వెనిజులాపై సైనిక చర్యకు పాల్పడి వారం రోజులు గడవకముందే అమెరికా తన సామ్రాజ్యవాద వైఖరిని మరోసారి బయటపెట్టింది. ఈసారి మెక్సికోపై సైనిక దాడి చేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. మెక్సికోలో గ్రౌండ్ ఆపరేషన్ ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. 'మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై గ్రౌండ్ ఆపరేషన్ ప్రారంభిస్తున్నాం. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాదారులు మెక్సికోను పరిపాలిస్తున్నారు. ఆ దేశ స్థితిని చూస్తుంటే చాలా బాధాకరంగా ఉంది. ఏం చేస్తాం. మాదక ద్రవ్యాల రవాణాదారులు పాలిస్తున్నారు. వారి కారణంగా అమెరికాలో 3 లక్షల మంది చనిపోతున్నారు' అని సోషల్ మీడియాలో రాసుకొచ్చారు. అంతకుముందు ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, 'సముద్ర మార్గాల్లో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై అమెరికా పెద్ద విజయం సాధించింది. ఇప్పుడు భూ మార్గాలపై దృష్టి పెట్టాం. సముద్రం ద్వారా వచ్చే మాదక ద్రవ్యాలను దాదాపు 97శాతం అడ్డుకున్నాం. ఇప్పుడు డ్రగ్స్ కార్టెలపై భూ దాడులు ప్రారంభించబోతున్నాం. మెక్సికోను మాదక ద్రవ్యాల అక్రమ రవాణాదారులే పాలిస్తున్నారు. ఇది చాలా విచారకరం. ఆ దేశంలో ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు' అని వ్యాఖ్యానించారు. కాగా వెనెజువెలా ప్రతిపక్ష నాయకురాలు మరియా కోరినా మచాడో వచ్చే వారం వాషింగ్టన్ డిసిలో పర్యటించే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఈ పర్యటనలో తాను మరియా మచాడోను కలుస్తానని వెల్లడించారు. మచాడోతో జరగబోయే ఈ సమావేశం తమ మధ్య జరిగే మొదటి సంభాషణ అవుతుందన్నారు. గతేడాది అక్టోబర్‌లో మచాడో నోబెల్ శాంతి బహుమతి పొందిన తర్వాత ఆమె నాతో మాట్లాడలేదు. ఈ విషయాన్ని ఆమే స్వయంగా చెప్పారు అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

## సర్కారీ ఉద్యోగులకు 1.02 కోట్ల ప్రమాద బీమా



### 5.14 లక్షల మందికి ప్రయోజనం
### డి. సిఎం భట్టి విక్రమార్క ప్రకటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.జనవరి9:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ 1.02 కోట్ల రూపాయల ప్రమాద బీమాను అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి చేర్చే ప్రభుత్వ ఉద్యోగులు మా కుటుంబ సభ్యులుగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం భావిస్తుందని వివరించారు. రూ.1.02 కోట్ల ప్రమాద బీమాకు సంబంధించిన ప్రక్రియను అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్రంలోని ప్రముఖ బ్యాంకర్లతో సంప్రదింపులు ముగిసినట్టు వివరించారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ గత ప్రభుత్వంలో ఉన్న బకాయిలను సైతం ప్రతి నెల క్రమం తప్పకుండా దశలవారీగా విడుదల చేస్తూ వస్తున్నామని ఆ ప్రకటనలో వివరించారు. ఉద్యోగులకు ప్రమాద బీమాకు సంబంధించి ఇప్పటికే సింగరేణి, ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్, జెన్కో పరిధిలోని ఉద్యోగులందరికీ కోటికి పైగా ప్రమాద బీమాను అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రభుత్వం చొరవతో చేపట్టిన కోటి రూపాయలకు పైగా ప్రమాద బీమా కార్యక్రమంతో ఇప్పటికే సింగరేణిలో 38,000 మంది రెగ్యులర్ ఉద్యోగులు వీరితోపాటు విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 71,387 మంది ఉద్యోగులకు ప్రమాద బీమా అందుబాటులోకి తీసుకొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇదే తరహాలో ప్రభుత్వ ఉద్యోగులకు సైతం 1.02 కోట్ల ప్రమాద బీమాను అమల్లోకి తీసుకువస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 5.14లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని డిప్యూటీ సిఎం తెలిపారు.

# 'నీటి'పై చర్చలతో పరిష్కరిద్దాం

### జల వివాదాలపై ఏపి సిఎం చంద్రబాబుకు సూచించిన సిఎం
### ఎపి ఒకడుగు ముందుకు వేస్తే.. మేం 10 వేస్తాం
### తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ ఉండాలంటే పక్క రాష్ట్ర సహకారం అవసరం
### రావిర్యాల ఇ-సిటీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



శుక్రవారం ఇ-సిటీలో సుజెన్ మెడికేర్ ఫ్లూయిడ్స్ తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి9:** రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా నీళ్ల సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కోర్టుల్లో కాకుండా మన సమస్యలను మనమే చర్చల ద్వారా సామరస్యంగా పరిష్కరించుకుందామని సీఎం విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాల ఈ-సిటీలో సుజెన్ మెడికేర్ ఫ్లూయిడ్స్ తయారీ యూనిట్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో రేవంత్ మాట్లాడుతూ నీళ్ల సమస్యపై స్పందించారు. జల వివాదం విషయంలో రాజకీయ ప్రయోజనం పొందాలని తమ ప్రభుత్వం ప్రయత్నించడం లేదని ఆయన స్పష్టం చేశారు. పంచాయితీ కావాలా? నీళ్ల కావాలా? అని తనను అడిగితే తెలంగాణకు నీళ్లే కావాలని చెబుతానని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వివాదాలు కావాలా పరిష్కారం కావాలా అని అడిగితే పరిష్కారం కావాలని చెబుతానన్నారు. మన సమస్యలను మనమే సామరస్యంగా పరిష్కరించుకుందామన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ వేదికగా కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు పెట్టకండి అని విజ్ఞప్తి చేస్తున్నానని తెలిపారు. కృష్ణానదిలో ఉన్న పాలమూరు-రంగారెడ్డి, డిండి,ఎస్ఎల్‌బీసీ, నెట్టెంపాడు ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకి పెట్టవద్దు. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టుల అనుమతులకు సహకరించండి. అడ్డంకి పెట్టడం వల్ల పర్యావరణ, సీడబ్ల్యూసీ అనుమతులకు ఇబ్బందిగా మారింది. రుణాలు మంజూరు కాకపోవడం, కేంద్ర సహకారం లేకపోవడం వల్ల రాష్ట్రంపై ఆర్థికభారం

>>2



-ఎపి సిఎం చంద్రబాబు
వృధానీటిపై తగవులేల?
2

## ఉర్దూ వర్సిటీభూములపై కాంగ్రెస్ కుట్ర

### హెచ్‌సియులో 10 వేల కోట్ల కుంభకోణం జరిగినా స్పందించని కేంద్రం
### ఢిల్లీ వెళ్లి మనూ విద్యార్థులతో కలిసి పోరాడుతాం: కెటిఆర్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.జనవరి9:** యూనివర్సిటీ భూములపై కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహారాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం నందినగర్ నివాసంలో కేటీఆర్‌తో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మనూ) విద్యార్థులు సమావేశమయ్యారు. యూనివర్సిటీకి చెందిన 50 ఎకరాల భూమిపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందంటూ ఆరోపించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఉర్దూ యూనివర్సిటీని నిర్వీర్యం చేసే కుట్రలను విద్యార్థులు వివరించారని తెలిపారు. ఓఆర్ఆర్ కోసం మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ గతంలో 32 ఎకరాలు ఇచ్చిందని కేటీఆర్ తెలిపారు. ఖాజాగూడ లింక్ రోడ్డు కోసం మరో 7ఎకరాల భూమి ఇచ్చారని పేర్కొన్నారు. ఇప్పుడు మళ్లీ 50 ఎకరాల భూమిపై రేవంత్ సర్కార్ కుట్రలు చేస్తుందని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రం రియల్ ఎస్టేట్ బ్రోకర్ చేతిలో ఉందని అన్నారు. అగ్రికల్చర్ యూనివర్సిటీ, హెచ్‌సీయూ భూములపై రేవంత్ కుట్రలు చేశారని మండిపడ్డారు. హెచ్‌సీయూలో రూ.10వేల కోట్ల కుంభకోణం జరిగితే కేంద్రం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. యూనివర్సిటీ భూములపై రేవంత్ సర్కార్ విరుచుకుపడుతుందని కేటీఆర్ విమర్శించారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని రాహుల్ గాంధీ చేస్తున్నది ఇదేనా అని ప్రశ్నించారు. మైనార్టీలపై ప్రేమ అంటే

>>2



## నేటి నుంచి స్కూళ్లు, కాలేజీలకు సంక్రాంతి సెలవులు

**హైదరాబాద్, ప్రభాతవార్త, జనవరి 9:** తెలంగాణలోని పాఠశాలలకు, డిగ్రీ కాలే జీ లకు నేటి(శనివారం) నుంచి సంక్రాంతి సెలవులు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్‌తోపాటు, ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు నేటి నుంచే సంక్రాంతి సెలవులు ప్రారంభం కానున్నాయి. అయితే పాఠశాలలకు నేటి నుంచి ఈ నెల 16 వరకు సంక్రాంతి సెలవులు కొనసాగనున్నాయి. అలాగే వివిధ సంక్షేమ శాఖ అధ్వర్యంలో కొనసాగుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలకు కూడా ఇవే సెలవులు కొనసాగనున్నాయి. సంక్రాంతి సెలవుల అనంతరం ఈ

>>2



'సీతారామ'పై సమీక్ష జరుపుతున్న మంత్రులు ఉత్తమ్, తుమ్మల

## జూన్‌లోగా 'సీతారామ' నీళ్లు

### భూ సేకరణకు రూ. 5 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం
### నీటిహక్కుల కోసం చిత్తశుద్ధితో పోరాటం: మంత్రులు ఉత్తమ్, తుమ్మల

**దమ్మపేట /దమ్మపేట రూరల్ జనవరి 9 ప్రభాతవార్త:** సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా జూన్ నాటికల్లా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వ్యవసాయనికి నీళ్లు అందిస్తామని నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి, ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నలమద ఉత్తమ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం వ్యవసాయ శాఖ ,మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వరావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే రాగమయి దయానంద్ లతో కలిసి దమ్మపేట మండలం గండుగులపల్లి సీతారామ ఎత్తిపోతల పథకం పంపుహౌస్ వద్ద సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం 8500 కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరాకు సాగునీరు అందించలేదన్నారు. మూడు పంప్ హౌస్ లు పూర్తిచేసి రెండు జిల్లాలకు ఎత్తిపోతల ద్వారా నీళ్ల అందిస్తామన్నారు. సీతారామ కాలువలకు 19 వేల 324 కోట్లు ఖర్చు చేశామని, ఆరు లక్షల 75 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. గత ప్రభుత్వంలో సీతారామ ఎత్తిపోతల పథకం నిర్లక్ష్యానికి గురైందని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి సీతారామకు నిధులు మంజూరు చేశామన్నారు. ప్రస్తుతం పెండింగ్ లో ఉన్న బిల్లులను విడుదల చేసి పనులను త్వరగా పూర్తి చేస్తామన్నారు. గోదావరి ,కృష్ణ నది జలాలపై బిఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులకు 38 వేల కోట్లు ఖర్చుపెట్టి 16 లక్షల ఆయకట్టుకు సాగునీరు అందించామన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని కాంట్రాక్టర్లకు తెలిపారు. జూన్ నాటికి పనులు పూర్తి చేసి నీరు అందించాలని అధికారులు ఆదేశించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక ప్రాజెక్టు కట్టిందని అది కూలిపోయిందని అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల మాట్లాడుతూ రెండు జిల్లాల్లోని పినపాక, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వరావుపేట కొంత ఇబ్బందులు ఉన్న పనులు పూర్తి చేసుకుంటే ఈ ప్రాంతాలకు ఎత్తిపోతల ద్వారా ఈ సంవత్సరం నీళ్లు ఇచ్చే అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మనం అడిగిన రూ 4 వేల కోట్లు మంజూరు చేస్తానన్నారు. మెయిన్ కెనాల్ మాత్రమే పర్మిషన్ ఇవ్వడం జరిగిందని రాజీవ్ కెనాల్ ద్వారా లంక సాగర్, వైరా చెరువుకు నీళ్లు తీసుకొచ్చమని దీనివల్ల లక్ష ఇరవై వేల వరకు సాగుకు నీరందిస్తున్నామన్నారు. నాలుగో పంపు హౌస్ పూర్తయితే అశ్వరావుపేట, దమ్మపేటకు నీళ్లు ఇవ్వచ్చు అన్నారు. సీతారామ కాలవ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అశ్వరావుపేట, సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, రాగమయిదయానందులు, కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## భర్త వేధింపులు భరించలేక గృహిణి ఆత్మహత్య
11 నెలల కుమారుడికి విషం ఇచ్చి బలవన్మరణం!
వారి మృతి తట్టుకోలేక తల్లి ఆత్మహత్యాయత్నం
3

## ఇద్దరు 'పెద్దలు' త్వరలో రిటైర్
తెలంగాణ నుంచి సురేష్‌రెడ్డి, అభిషేక్ సింఘ్వీ
ఎపి నుంచి రామిరెడ్డి, సత్వానీ, పిల్లి సుభాష్, సానా సతీశ్
ఈ యేడాది ఖర్గే సహా రిటైర్ కానున్న 73 మంది రాజ్యసభ ఎంపీలు
2



## 28 నుంచి పార్లమెంటు
### ఫిబ్రవరి ఒకటినే బడ్జెట్

**న్యూఢిల్లీ, జనవరి 9:** పార్లమెంటుబడ్జెట్ సమావేశాలు ఈనెల 28వ తేదీనుంచి ఫిబ్రవరి 13వ తేదీవరకూ జరుగుతాయి. రెండో విడత సమావేశాలో మార్చి 9 నుంచి ఏప్రిల్ రెండోతేదీవరకూ జరుగుతాయి. ఫిబ్రవరి ఒకటవ తేదీ ఆదివారం వచ్చినప్పటికీ సాంప్రదాయం ప్రకారం అదేరోజు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కొత్తసంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన జరిగిన పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్‌కమిటీ బడ్జెట్‌ను ఒకటవ తేదీనే ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఇక సమావేశాల్లో

>>2

# మహాయజ్ఞంలా మేడారం అభివృద్ధి





### ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, గొట్టుగోత్రాలు ప్రతిబింబించేలా పునరుద్ధరణ
### వనదేవతల ఘనకీర్తి చాటేలా ఏర్పాట్లు: మంత్రి సీతక్క

**ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో, ప్రభాతవార్త:** దక్షిణ కుంభమేళా మేడారం మహా జాతరకు ఇంకా 19 రోజులే మిగిలి ఉంది. ప్రకృతే ఆరాధనగా జరిగేవన దేవతల దర్శనానికి పోటెత్తితే జన జాతరన ఘనకీర్తి ప్రపంచానికి చాటి చెప్పాలని, ఆదివాసి సంస్కృతి సంప్రదాయాలు,గొట్టు గోత్రాలు ఆచారాలు ప్రతిబింబించేలా ఆలయ ప్రాంగణ పునరుద్ధరణ తుదిదశలో ఉంది. ప్రపంచానికి మూల పురుషులుగా ఆదివాసులు ఉన్నారనే చరిత్రకు ప్రతిబింబంలా మేడారం ముస్తాబయింది. 251 కోట్ల రూపాయలతో నాటి ఆదివాసీల చరిత్రకు సజీవరూపం కల్పించిన చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించాల్సిన ఈ అభివృద్ధి పై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. మేడారం హరిత హోటల్ లో శుక్రవారం మంత్రి సీతక్క,జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.,ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ లతో కలిసి మీడియా ఆత్మీయ సమ్మేళన సమావేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం 251 కోట్ల రూపాయల నిధులతో చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో మేడారం జాతర నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. మేడారం జాతరలో శాశ్వత ప్రతిపాదికన జరుగుతున్నా అభివృద్ధి పనులు, జాతర నిర్వహణ అంశాలు ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మీడియా ప్రతినిధులను కోరారు. గద్దెల పునరుద్ధరణ చేయనున్న సీఎం రేవంత్ రెడ్డి. భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా, ఇంటి ఇలావేల్పులుగా సమ్మక్క సారలమ్మ దేవతలు ప్రసిద్ధి చెందారని, ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మాఘశుద్ధ పౌర్ణమి వెన్నెల వెలుగులలో గిరిజన సంస్కృతి, సంప్రదాయాల డోలు వాయిద్యాల నడుమ జిల్లా అధికారుల గౌరవ

>>2



## ఎందుకు పెంచారు?
### సినిమా టికెట్ల రేట్లు పెంపుపై హైకోర్టు ఆగ్రహం

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:** ప్రభాస్-మారుతి కాంబినేషన్ సినిమా రాజాసాబ్ శుక్రవారం విడుదలైంది. అయితే సినిమా టికెట్ ధరల పెంపు విషయమై తెలంగాణ సర్కార్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సినిమా టికెట్ల రేట్లను పదే పదే ఎందుకు పెంచుతున్నారని మండిపడింది. ఎన్నిసార్లు చెప్పినా మీ ఆలోచన మారడం లేదు ఎందుకు అని ప్రశ్నల వర్షం కురిపించింది. ఈ అంశంలో ఇప్పటికే పలుమార్లు హెచ్చరించినా ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారంటూ అధికారుల తీరును తప్పుపట్టింది. న్యాయస్థానం చెప్పినా సరే పట్టించుకోరా అంటూ వ్యాఖ్యానించింది. మెమో ఇచ్చే అధికారికి నిబంధనలు తెలియదా? అని సీరియస్

>>2



శుక్రవారం న్యూఢిల్లీలో వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఎన్ఎస్‌జి యొక్క జాతీయ ఐఇడి డేటా మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

# వృథానీటిపై తగవులేల?

## -ఎపి సిఎం చంద్రబాబు

**మండపేట(తూర్పు గోదావరి జిల్లా), జనవరి 9 ప్రభాతవార్త బ్యూరో):** "యేటా 3 వేల టీఎంసీల నీళ్లు సముద్రం పాలవుతున్నాయి. ఇందులో 200 టీఎంసీలు వాడుకుంటే వచ్చే నష్టం ఏమీ లేదు. సముద్రంలోకి వెళ్లే నీళ్ల విషయంలో రెండు రాష్ట్రాల మధ్య గొడవలు ఎందుకు? నీళ్లు వద్దు గొడవలే కావాలని కొందరు బయల్దేరారు. కొందరు రాయలసీమ ఎత్తిపోతల అంటూ వివాదాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. నాకు గొడవలు కాదు తెలుగు జాతి ప్రయోజనాలు కావాలి. పోలవరం పూర్తి అయితే నీళ్లు తెలంగాణా రాష్ట్రం కూడా వాడుకునే అవకాశం ఉంటుంది. వివాదాల వల్ల ఎలాంటి ఉపయోగం లేదని అందరికీ చెబుతున్నాను. పట్టిసీమ కట్టి కృష్ణా డెల్టాలో వినియోగించుకుందామంటే వ్యతిరేకించారు. కృష్ణా డెల్టాలో ఇచ్చే నీళ్లను పొదుపు చేసి శ్రీశైలం నుంచి రాయలసీమ ప్రాంతానికి తరలించాం. ఈ ఏడాది రాయలసీమలోని రిజర్వాయర్లలో నీళ్లు నింపాం. గతంలో ఆ ప్రాంతంలో వేసిన వేరు శనగ పంట ఎండిపోయిన పరిస్థితి. ప్రస్తుతం రాయలసీమ నీటి కొరత తీర్చి ఉద్యాన హబ్ గా తీర్చిదిద్దున్నాం. కొందరు నీళ్లు వద్దు వివాదాలే కావాలని నానాయాగీ చేస్తున్నారు." అనిరాయవరంలో జరిగిన పట్టా దారు పాసు పుస్తకాల పంపిణీ సభలో సిఎం చంద్రబాబు అన్నారు.

# ఎందుకు పెంచారు?

>> అయింది. కొద్ది రోజుల క్రితం టికెట్ ధరలు పెంచబోమని మంత్రి చెప్పినా కూడా మళ్లీ ఎందుకు పెంచారంటూ నిలదీసింది. కాగా, రెబల్ స్టార్ ప్రభాస్ ప్రధాన పాత్రలో నటించిన ది రాజాసాబ్ సినిమా టికెట్ ధరలు పెంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతించింది. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత దీనికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం నుంచి ఈ నెల 11 వరకు సింగిల్ స్క్రీన్లలో రూ.105, మల్టీప్లెక్స్‌లో రూ.132 పెంపునకు అనుమతి ఇచ్చింది. అలాగే 12 నుంచి 18వ తేదీ వరకు సింగిల్ స్క్రీన్లలో రూ.62, మల్టీప్లెక్స్ రూ.89 పెంపునకు అనుమతి ఇచ్చింది. టికెట్ లాభాల్లో 20 శాతం ఫిలిం ఫెడరేషన్‌కు ఇవ్వాలని ఆదేశాలిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. గతంలోనే ఓజీ, అఖండ2, పుష్ప2 వంటి సినిమాల విషయంలో మొట్టికాయలు వేశామని, అయినా మారడం లేదని ప్రభుత్వంపై సీరియస్ అయింది.

## రోడ్డుప్రమాదాల కట్టడికి

# 'వి2వి' టెక్నాలజీ

### కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ

**న్యూఢిల్లీ, జనవరి 9:** దేశంలో పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాలు, మరణాల సంఖ్యకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం వాహనాల మధ్య కమ్యూనికేషన్ వెహికల్ టు వెహికల్ టెక్నాలజీని తప్పనిసరి చేయనున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. ఈ వి2వి వ్యవస్థ వల్ల వాహనాలు ఒకదానికొకటి వైర్‌లెస్‌గా సమాచారం పంపుకుంటూ డ్రైవర్లను అప్రమత్తం చేస్తాయని ఆయన తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన 43వ ట్రాన్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ టెక్నాలజీ కోసం టెలికాం శాఖ (డాట్) సూత్రప్రాయంగా అంగీకరించి, ఉచితంగా స్పెక్ట్రమ్ కేటాయించనుందని గడ్కరీ వెల్లడించారు. వి2వి కమ్యూనికేషన్ కోసం 5.875-5.905 జిహెచ్‌జడ్ బ్యాండ్‌లో 30 ఎంహెచ్‌జడ్ స్పెక్ట్రమ్‌ను కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ వ్యవస్థ ద్వారా వాహనాల్లోని ఆన్‌బోర్డ్ యూనిట్ (ఓబియు) ద్వారా సమీపంలోని ఇతర వాహనాల వేగం, లొకేషన్, ఆకస్మిక బ్రేకింగ్ వంటి సమాచారం డ్రైవర్‌కు అందుతుంది. దీనివల్ల బ్లైండ్ స్పాట్స్‌లో ఉన్న వాహనాల గురించి కూడా ముందుగానే తెలుస్తుందని అధికారులు వివరించారు. ఈ పరికరం ఖరీదు సుమారు రూ. 5,000 నుంచి రూ. 7,000 వరకు ఉండొచ్చని అంచనా. ఈ ఏడాదిలోనే ఈ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తామని రవాణా శాఖ కార్యదర్శి వి. ఉమాశంకర్ తెలిపారు. ఇదే సమావేశంలో, స్లీపర్ బస్సుల నిర్మాణంలో జరుగుతున్న అక్రమాలపై నితిన్ గడ్కరీ తీవ్రంగా స్పందించారు. "గత కొన్ని నెలల్లో జరిగిన ఆరు బస్సు అగ్నిప్రమాదాల్లో 145 మంది ప్రాణాలు కోల్పోయారు. బస్సుల నిర్మాణంలో నిబంధనలు పాటించడం లేదని, వివిధ స్థాయిల్లో అవినీతి జరుగుతోందని మా దృష్టికి వచ్చింది. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాజస్థాన్ సహా ఇతర రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాశానని గడ్కరీ అన్నారు. ఇకపై స్లీపర్ కోచ్ బస్సులను ఆటోమొబైల్ కంపెనీలు లేదా కేంద్ర ప్రభుత్వం గుర్తించిన సంస్థలు మాత్రమే తయారు చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ఉన్న బస్సుల్లో ఫైర్ డిటెక్షన్ సిస్టమ్స్, ఎమర్జెన్సీ లైటింగ్, ఎగ్జిట్స్ వంటి భద్రతా ఫీచర్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దేశంలో ఏటా సుమారు 1.8 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని, వీరిలో 66 శాతం మంది 18 నుంచి34 ఏళ్లలోపు వారేనని గడ్కరీ ఆవేదన వ్యక్తం చేశారు. 2030 నాటికి రోడ్డు ప్రమాద మరణాలను 50 శాతం తగ్గించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఇందుకోసం మోటారు వాహన చట్టానికి 61 సవరణలు తీసుకురానున్నట్లు తెలిపారు. దీంతో పాటు, రోడ్డు ప్రమాద బాధితులకు రూ. 1.5 లక్షల వరకు ఏడు రోజుల పాటు ఉచితంగా క్యాష్‌లెస్ చికిత్స అందించే పథకాన్ని కూడా దేశవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు ప్రకటించారు.

# వర్సిటీభూములపై కాంగ్రెస్ కుట్ర

>> ఇదేనా అని ప్రశ్నించారు. రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రశ్నించారు. చేతగాని సన్యాసి రాహుల్ గాంధీ అని విమర్శించారు. యూనివర్సిటీల్లోని భూములంటే వినియోగంలో లేని భూములా అని ప్రశ్నించారు. మనూ భూముల కోసం విద్యార్థుల పోరాటానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక మనూను మరింత అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. ఢిల్లీ వరకు వచ్చి మనూ విద్యార్థులతో కలిసి పోరాడుతామని స్పష్టం చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వచ్చి చదువుకుంటున్న మైనార్టీ విద్యార్థుల యూనివర్సిటీని నిర్వీర్యం చేయడమే మీ సంరక్షణనా అని ప్రశ్నించారు.

## నేటి నుంచి స్కూళ్లు, కాలేజీలకు సంక్రాంతి

# సెలవులు

>> నెల 17న పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఇక డిగ్రీ కాలేజీలకు నేటి నుంచి ఈ నెల 18 వరకు సంక్రాంతి సెలవులు కొనసాగనున్నాయి. ఈ నెల 19న డిగ్రీ కాలేజీలు పునః ప్రారంభమవుతాయి.
రాష్ట్రంలో ఉన్న జూనియర్ కాలేజీలకు ఈనెల 13 నుంచి 16 వరకు సంక్రాంతిసెలవులు కొనసాగనున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీలు సంక్రాంతి సెలవుల అనంతరం ఈ నెల 17న పునః ప్రారంభం కానున్నాయి.

# 28 నుంచి పార్లమెంటు

>> 29వ తేదీ ఆర్థికసర్వేను సభలోప్రవేశ పెడతారు. ఈ ఏడాది కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ తొమ్మిదోసారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు. అంతకుముందు ప్రధాని మొరార్జీదేశాయి పదిసార్లు బడ్జెట్‌నుప్రవేశ పెట్టారు. 1959నుంచి 1964వరకూ ఆ తర్వాత 1967 నుంచి 1969వరకూ మొరార్జీ బడ్జెట్‌ప్రవేశపెట్టారు. ఆర్థికమంత్రిగా పనిచేసిన పి.చిదంబరం కూడా బడ్జెట్‌ను తొమ్మిదిసార్లు ప్రవేశపెడితే ఆనాటి ఆర్థికమంత్రి ప్రణబ్ ముఖర్జీ ఎనిమిదిసార్లుప్రవేశపెట్టారు. 2017 నుంచి బడ్జెట్‌ను ఫిబ్రవరి ఒకటవ తేదీ ఉదయం 11 గంటలకే ప్రవేశపెడుతున్నారు. ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ హయాంనుంచే ఈ విధానం అమలులుకు వచ్చింది. కొత్తబడ్జెట్ ఏప్రిల్ ఒకటవ తేదీనుంచే అమలులోకి వచ్చేవిధంగా ఆయన నిర్ణయం తీసుకున్నారు. అప్పటినుంచి ఫిబ్రవరి 28వ తేదీనే బడ్జెట్‌ప్రవేశ పెట్టడంజర ుగుతోంది. ఇదే సమయంలో ఎఐ ఇంపాక్ట్ సదస్సును కూడా నిర్వహిస్తున్నారు. వివిధ శాఖల గ్రాంట్లడిమాండ్లను కూడా పార్లమెంటరీ స్థాయీ సంఘాలు ఈలోపు పరిశీలనచేస్తాయి. ఈ బడ్జెట్‌సమావేశం లోనే కేంద్రం మరికొన్ని కీలక బిల్లులను ప్రవేశపెడుతుందని సమాచారం.

## వారం - వర్జ్యం

10-01-2026, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం,పూర్వాషాఢ కార్తె
సప్తమి ఉ.8.25
హస్త మ.3.42
వర్జ్యం : రా.12.33-2.19
దు.ఉ.6.39-8.12
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** ముఖ్యమైన పనిన సమస్యలు ఒక్కొక్కటిగా ముందుకువస్తాయి. ఋణ బాధలు తొలగుతాయి.

**వృషభం :** మీ ప్రతిభాపాటవాలను కనబరచి పరిష్కారమార్గాలను వెనువెంటనే అవలంభించగలుగుతారు.

**మిథునం:** కీలకమైన వ్యవహారాలలో తీసుకునే నిర్ణయాలు, మదుపులు వంటి అంశాలను తాత్కాలికంగా వాయిదా వేయండి.

**కర్కాటకం:** ప్రముఖులను కలుసుకుని ముఖ్యమైన విషయాలపై సంప్రదింపులు జరుపుతారు. వస్తువు కొనుగోలు.

**సింహం:** శత్రువర్గం మరింత విజృంభించకుండా జాగ్రత్తలు తీసుకో గలుగుతారు. పనులు పూర్తిచేస్తారు.

**కన్య :** విద్యార్థులు అధిక శ్రద్ధను కనబరచవలసి ఉంటుంది. సరఘోష అధికంగా ఉంటుంది.

**తుల :** చిన్ననాటి మిత్రుల నుండి శుభవార్తలను అందుకుంటారు. సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృశ్చికం:** ఉద్యోగాలలో ఎదురైన ఒడిదుడుకులు తొలగి ఊరటచెందుతారు. వివాహయత్నాలు ముమ్మరం చేస్తారు.

**ధనుస్సు:** ప్రభుత్వపరమైన పనులు సానుకూల పడతాయి. అధిక ధనార్జనకు విదేశీయానమే మేలని భావిస్తారు.

**మకరం:** అనుకున్న పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తి చేస్తారు. సెల్ఫ్ డ్రైవింగ్ విషయంలో జాగ్రత్తలు అవసరం.

**కుంభం:** కష్టానికి తగ్గ ఫలితం దక్కుతుంది. కొన్ని మొండిబాకీలు వసూలవుతాయి. శుభవార్తలు అందుకుంటారు.

**మీనం :** ఉద్యోగులకు కొంత వరకు అను కూలంగా ఉంటుంది. పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ పనులు సానుకూల పడతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'నీటి'పై చర్చలతో పరిష్కరిద్దాం

>> పడుతోంది. మాకు సహకరిస్తే మేము కూడా సహకరిస్తాం.మేము వివాదాలు కోరుకోవట్లేదు, శాశ్వత పరిష్కారం కోరుతున్నాం అని చెప్పారు. తాము వివాదాలు కోరుకోవడం లేదని పరిష్కారం కోరుకుంటున్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాలు కాదు ప్రజల ప్రయోజనాలు కోసం ఆలోచిస్తున్నామన్నారు. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలంటే పొరుగు రాష్ట్రం సహకారం ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నం పోర్టు వరకు విస్తృత రోడ్డు,రైలు మార్గాన్ని నిర్మించేందుకు కేంద్రం కూడా సూచన ప్రాయంగా అంగీకరించిందన్నారు.సముద్ర తీరం లేని తెలంగాణకు మచిలీపట్నం పోర్టుతో అనుసంధానం కల్పించేలా 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి మద్దతు అడిగారు. రెండు రాష్ట్రాలు(ఏపీ, తెలంగాణ) పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు ఇలా ఏ రాష్ట్రమైనా సరే మేం వివాదాలు కోరుకోవడం లేదన్నారు.ఈ విషయంలో ఏపీ ప్రభుత్వం ఒక్క అడుగు ముందుకు వేస్తే తెలంగాణ 10 అడుగులు ముందుకు వేస్తుంది అని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. హైదరాబాద్ ప్రపంచ నగరాలతో పోటీపడుతోందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సుజెన్ మెడికేర్ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తోందని కొనియాడారు. పెట్టుబడులకు లాభం వచ్చేవిధంగా ప్రభుత్వం ప్రణాళికలు ఉన్నాయని ఆయన వివరించారు. ప్రపంచ స్థాయి దేశాలతో పోటీపడేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని పేర్కొన్నారు. పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం తెలంగాణలో ఉందన్నారు. పెద్ద కంపెనీలకు సీఈవోలుగా ఉన్నది మన హైదరాబాద్ వారేనని ఆయన గుర్తుచేశారు. 1995 నుంచి 2025 వరకు 30 ఏళ్ల నిరంతర శ్రమ వల్లే హైదరాబాద్ ప్రపంచ నగరాలతో పోటీ పడగలుగుతోందని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.జర్మన్ టెక్నాలజీతో దక్షిణ భారత దేశంలోనే ఐవీ ఫ్లూయిడ్స్ తయారీలో గొప్ప సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ లో భావనగా సుజెన్ మెడికేర్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయడం సంతోషకరం అన్నారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా తెలంగాణ పాలసీ డాక్యుమెంట్ ను విడుదల చేశాం క్యూర్, ప్యూర్,రేర్ మూడు భాగాలుగా తెలంగాణ అభివృద్ధి ఉంటుందని, 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ ఎకానమిగా, 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమిగా తెలంగాణను తీర్చి దిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం అని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ క్యూర్, ప్యూర్ పై ఆధారపడి ఉంటుందన్నారు. ప్రపంచంలోని గొప్ప నగరాలతో హైదరాబాద్, తెలంగాణ పోటీ పడుతోందని, జర్మనీ, జపాన్, సౌత్ కొరియా, న్యూయార్క్ లతో తెలంగాణ పోటీ పడుతోంది అందులో భాగంగా యువ పారిశ్రామిక వేత్తలు ప్రారంభించే పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నాం అని చెప్పారు. దేశంలో ఉత్పత్తి చేసే బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం తెలంగాణ నుంచి ఉత్పత్తి అవుతున్నాయి ప్రపంచమే మనవైపు చూసేలా ఫార్మా రంగంలో రాణిస్తున్నాం అని చెప్పారు. మనదగ్గర చదువుకుని వెళ్లిన వారు గ్లోబల్ కంపెనీలకు సీఈవోలుగా ఉన్నారు ఇది మనకు ఎంతో గర్వకారణం చెప్పారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలంటే ప్రైవేట్ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.రాబోయే పదేళ్లల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో ఉంటున్నామని గర్వంగా చెప్పుకునేలా అభివృద్ధి చేస్తామని చెప్పారు.

**పరిశ్రమల ద్వారా ఉపాధి కల్పనే లక్ష్యం: మంత్రి శ్రీధర్‌బాబు**

అంతకు ముందు ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ జీసీసీలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.తెలంగాణ రాష్ట్రానికి చాలా పెద్ద లైఫ్‌సైన్స్ కంపెనీలు వస్తున్నాయన్న ఆయన 2034 నాటికి వన్ ట్రిలియన్ ఎకానమీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించుకుందని వెల్లడించారు. చాలా పెద్దఎత్తున ప్రభుత్వ ఉద్యోగాలను కల్పిస్తున్నామని శ్రీధర్ బాబు తెలిపారు. పరిశ్రమల ద్వారా చాలా ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కంపెనీలకు పెద్దఎత్తున ప్రోత్సాహకాలు కల్పిస్తున్నామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పాలసీ తీసుకువచ్చిందన్నారు.ఈ కార్యక్రమానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాష్‌గౌడ్,మల్‌రెడ్డి రంగారెడ్డి,కాలే యాదయ్య, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఇద్దరు 'పెద్దలు' త్వరలో రిటైర్

## తెలంగాణ నుంచి సురేష్‌రెడ్డి, అభిషేక్ సింఘ్వీ

## ఎపి నుంచి రామిరెడ్డి, సత్వానీ, పిల్లి సుభాష్, సానా సతీశ్

### ఈ యేడాది ఖర్గే సహా రిటైర్ కానున్న 73 మంది రాజ్యసభ ఎంపీలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.జనవరి9:** తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దల సభకు వెళ్లిన పలువురు ఎంపీలు ఈ ఏడాది రిటైర్ కానున్నారు.ఈ ఏడాది తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇద్దరు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నలుగురు ఎంపీలు పదవీ విరమణ చేయనున్నారు. ఈ మేరకు రాజ్యసభ సచివాలయం ఈ సంవత్సరం రిటైర్ కాబోయే రాజ్యసభ సభ్యుల జాబితాను విడుదల చేసింది. ఇందులో తెలంగాణకు చెందిన బీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ ఏప్రిల్ 9న రిటైర్ కానున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వైసీపీ ఎంపీలు అయోధ్య రామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, పిల్లి సుభాష్ చంద్రబోస్, టీడీపీ సభ్యుడు సానా సతీశ్‌కు జూన్‌లో రాజ్యసభ సభ్యత్వం ముగుస్తుంది. శుక్రవారం దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సభ్యుల రిటైర్‌మెంట్ జాబితా బులెటిన్‌ను రాజ్యసభ సెక్రటరీ జనరల్ కార్యాలయం విడుదల చేసింది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఏపీలో వైసీపీ అత్యధిక స్థానాలు గెలుచుకుంది.అనంతరం ఆ పార్టీ నేతలు పిల్లి సుభాష్ చంద్రబోస్, మోపిదేవి వెంకటరమణ,ఆళ్ల ఆయోధ్యరామిరెడ్డి లతోపాటు రియలయన్స్ సంస్థకు చెందిన పరిమిళ నత్వానీలను వైసీపీ కోటాలో రాజ్యసభకు పంపింది. అలాగే బీద మస్తాన్ రావును కూడా పంపింది.అయితే 2024లో జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. దీంతో మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావు వైసీపీకి రాజీనామా చేశారు. అనంతరం వారు టీడీపీలో చేరారు. దాంతో బీద మస్తాన్ రావుతోపాటు సానా సతీష్ ను రాజ్యసభకు టీడీపీ పంపింది. కానీ సానా సతీష్ పదవి కాలం కొద్ది రోజుల్లోనే ముగియనుంది. మరోవైపు తెలంగాణలో బీఆర్ఎస్ నుంచి మరోకరిని రాజ్యసభకు పంపే అవకాశం ఉంది. అలాగే అభిషేక్ మను సింఘ్వీకి మరోసారి రాజ్యసభకు పంపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే.. సుప్రీంకోర్టులో ప్రముఖ న్యాయవాదిగా ఆయన ఉన్నారు. తెలంగాణలో నీటి ప్రాజెక్టులు, వివిధ సమస్యలపై ఆయన సుప్రీంకోర్టులో వాదిస్తున్న సంగతి తెలిసిందే. అందుకే ఏపీలో నిర్మిస్తున్న ప్రాజెక్టులపై మను సంఘ్వీతో సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముంబై వెళ్లి మరీ చర్చించిన విషయం విదితమే. రాజ్యసభ నుంచి 2026లో మొత్తం 73 మంది రిటైర్ కానున్నారు. ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, కేంద్రమంత్రులు హార్దీప్ సింగ్ పూరీ, కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ్ సింగ్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగొయ్‌ల పదవీ కాలం ముగుస్తుంది. పెద్దల సభలో ఖర్గే ప్రతిపక్ష నేత కావడంతో ఆయనకు మరోసారి అవకాశం దక్కవచ్చు.
మహారాష్ట్ర నుంచి నలుగురు, తమిళనాడు నుంచి ఆరుగురు, ఒడిశా నుంచి నలుగురు, పశ్చిమ బెంగాల్ నుంచి ఐదుగురు, అసోం నుంచి ముగ్గురు, బీహార్ నుంచి ఐదుగురు, ఛత్తీస్‌గఢ్ నుంచి ఇద్దరు, హర్యానా నుంచి ఇద్దరు, హిమాచల్ ప్రదేశ్ నుంచి ఒకరు, గుజరాత్ నుంచి నలుగురు, ఝార్ఖండ్ నుంచి ఇద్దరు, మధ్యప్రదేశ్ నుంచి ముగ్గురు, రాజస్థాన్ నుంచి ముగ్గురు, ఉత్తర ప్రదేశ్ నుంచి పదిమంది, కర్ణాటక నుంచి నలుగురు, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, ఉత్తరాఖండ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఒక్కరు చొప్పున రిటైర్ కానున్నారు



న్యూఢిల్లీలో శుక్రవారం భారత్ క్లైమేట్ ఫోరమ్26లో బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

# మహాయజ్ఞంలా మేడారం అభివృద్ధి

>> వందనంతో గిరిజన నృత్యాల తో వన దేవతలు గద్దెల పైకి రావడం తో భక్త జనం భక్తి పారవశ్యం తో పులకరిస్తారని పేర్కొన్నారు.ఈ మహద్భుత ఘట్టం ఆవిష్కృతం కోసం కోట్లాది మంది భక్తులు ఎదురు చూస్తున్నారని తెలిపారు.గద్దెల పునరుద్ధరణ ముఖ్యమంత్రి చేతుల మీదుగా 19వ తేదీ ఉదయం 7 గంటలకు ప్రారంభించడం జరుగుతుందని ,18వ తేదీ సాయంత్రం ముఖ్యమంత్రి మేడారం చేరుకుంటారని, గద్దెల పునరుద్ధరణ ప్రారంభ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఆలయ పునరుద్ధన విషయంలో గిరిజన పెద్దలతో, పూజారులతో, ఆదివాసి సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామని,అందరి సమ్మతి,సంతకాలతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు.జాతరలో మహిళా సంఘాల సభ్యులకు ప్రాధాన్యత ఇస్తూ వారికి బొంగు చికెన్, ఇప్ప పువ్వు లడ్డు ప్రత్యేక దుకాణాలు పెట్టించడం జరిగిందని తెలిపారు.ప్రతిష్టాత్మకంగా జాతర నిర్వహణకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్,ఐఏఎస్.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా జాతర నిర్వహించడం జరుగుతుందని,జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు.జాతరలో ప్రస్తుతం 5 వేల మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని,జాతర సమయం లో 30వేల మంది సిబ్బంది,జాతర అనంతరం 5 వేల మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు.జాతర ప్రాంతాన్ని 8 జోన్స్ గా, 42 సెక్టార్లుగా విభజించి ప్రతి జోన్ లో 8 మంది అధికారులు ఉంటారని అన్నారు.భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత. జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్,ఐపిఎస్.ఈ ఏడు మేడారం మహా జాతరకు సుమారు రెండు కోట్ల పైగా భక్తులు తరలిరానున్నారని జిల్లా ఎస్పీ రామ్‌నాథ్ కేకన్ అన్నారు. మేడారం జాతర సమయంలో భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమగ్ర ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తాడ్వాయి మేడారం ,పసర మేడారం రహదారుల వెంట ప్రతి 2 కిలోమీటర్లకు ఒక చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జాతర నిర్వహణ కోసం సుమారు 20 మంది ఐపీఎస్ అధికారుల సేవలను వినియోగించుకుంటామని, భక్తులకు సేవలు అందించడానికి స్థానిక యువత సిద్ధంగా ఉన్నారని, వాహనాల పార్కింగ్ లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని అన్నారు.జాతర పరిసరాలను 450 సీసీ టీవీ, 20 ప్రత్యేక డ్రోన్స్ నిఘా తో పర్యవేక్షణ చేస్తున్నామని, ప్రత్యేకంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్ ద్వారా గద్దెల ప్రాంగణం లో భక్తుల రద్దీని పర్యవేక్షి ంచడం జరుగుతుందని పేర్కొన్నారు. క్రౌడ్ మేనేజ్‌మెంట్ కోసం 20కి పైగా డ్రోన్‌లను ఉపయోగిస్తూ, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షి స్తున్నామని వివరించారు.అధునాతన సాంకేతికతను వినియోగిస్తూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత హీట్ మ్యాప్ టెక్నాలజీ ద్వారా అధిక జనసాంద్రత ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.దీంతో జన సమూహ నియంత్రణ మరింత సమర్థవంతంగా సాగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క,జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్,జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్,ఆర్డీవో వెంకటేష్, వరంగల్,ములుగు జిల్లాల మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 31 నుంచి ప్రైవేట్ భవనాలకు అద్దె చెల్లింపులు బంద్

## 28లోగా ప్రభుత్వ భవనాలకు శాఖలు తరలించాలని ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి9:** హైదరాబాద్‌లో ప్రస్తుతం 60కి పైగా ప్రభుత్వ శాఖలు ప్రైవేటు అద్దె భవనాల్లో పనిచేస్తున్నాయిప్రైవేటు భవనాల అద్దెలకు ఏటా సుమారు రూ.800 కోట్లు వ్యయం అవుతోంది. ప్రభుత్వ శాఖలు: రూ.450 కోట్లు, కార్పొరేషన్లు/ఇతర సంస్థలు: రూ. 350 కోట్లు. గత 12 ఏళ్లలో అద్దె వ్యయం మొత్తం ..9,600 కోట్లకు చేరింది. ఈ భారం తగ్గించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని ప్రభుత్వానికి చెందిన భవనాల్లో సుమారు 4 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని గుర్తించింది. హిమాయత్‌నగర్, నాంపల్లి, అమీర్‌పేట్, హైటెక్స్, టి-హబ్ తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ భవనాలకు జనవరి 28లోగా శాఖలు తరలివెళ్లాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మార్చి 31 తర్వాత ప్రైవేటు భవనాలకు ఇక అద్దె చెల్లింపులు ఉండవుఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాకు వేల కోట్ల రూపాయలు ఆదా కానుంది.

# ఛత్తీస్‌గఢ్‌లో 63 మంది మావోయిస్టుల లొంగుబాటు

**నయారాయ్‌పూర్, జనవరి 9:** ఛత్తీస్‌గఢ్‌లో జనజీవన స్రవంతిలో కలిసేందుకు 63 మంది మావోయిస్టులు లొంగిపోయారు. జిల్లా ఎస్‌పి గౌరవ్‌రాయ్ ఎదుట లొంగిపోయిన వారిలో 36 మంది మావోయిస్టులపై ఒక కోటి 19 లక్షల 50 వేల రూపాయలు రివార్డులు కూడా కొనసాగుతున్నాయి. లొంగిపోయిన వారిలో 18 మంది మహిళా కేడర్ కూడా ఉన్నారు దర్బా డివిజన్‌లో వీరంతా క్రియాశీలకంగా ఉన్నారని, పశ్చిమబస్తర్, దక్షిణ బస్తర్, మాద్ ప్రాంతాల్లో లొంగిపోయిన మావోయిస్టులుచురుకుగా పనిచేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. పొరుగుననే ఉనన ఒడిశాలో కూడా మావోయిస్టులు లొంగిపోతున్నారని, ప్రస్తుతం లొంగిపోయిన వారిలో ఏడుగురు మావోయిస్టులు 8 లక్షలు చొప్పునరివార్డులు ఉన్నాయన్నారు. మరో ఏడుగురిపై ఐదు లక్షల రూపాయలుచొప్పున రివార్డులున్నాయి. ఎనిమిది మందిపై రెండులక్షలుచొప్పున రివార్డులుంటే 11 మంది మావోయిష్టులపై లక్షరూపాయలు చొప్పున రివార్డులు కొనసాగుతున్నట్లు ఎస్పీ రాయ్ తెలిపారు. తీవ్రస్థాయి మావోయిస్టు సంఘటనల్లోనే వీరంతా పాల్గొన్నారు. పోలీసులతో ఎదురుకాల్పులు, ఐఇడిపేలుళ్ళ, అరాచకం, హత్య,కాల్పులుజరిపిన సంఘటనల్లో పాల్గొన్నారన్నారు. లొంగిపోయిన అందరికీ రూ.50 వేలు వంతున ప్రోత్సాహకాలు అందచేస్తున్నామని రాష్ట్రప్రభుత్వ పునరావాస విధానంకింద వీరికిఈ మొత్తం అందుతుందని ఎస్పీ తెలిపారు.

## లోయలో పడిపోయిన బస్సు

# 12 మందిమృతి

## 33 మందికి గాయాలు

**సిమ్లా, జనవరి 9:** హిమాచల్ ప్రదేశ్‌లో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సిర్మౌర్ జిల్లాలో ప్రయాణికులతో వెళుతున్న ఓ ప్రైవేట్ బస్సు అదుపుతప్పి సుమారు 200 మీటర్ల లోతైన లోయలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 33 మంది గాయపడ్డారు. సిమ్లా నుంచి కుప్వీకి వెళుతున్న ఈ బస్సులో మొత్తం 45 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరంతా పోష్ పండుగ సందర్భంగా తమ స్వగ్రామాలకు తిరిగి వెళుతున్నారు. హరిపుర్‌ధార్ మార్కెట్‌కు సమీపంలో మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో బస్సు ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దట్టమైన పొగమంచు కారణంగా బస్సు రోడ్డుపై నుంచి జారిపోయి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాద తీవ్రతకు బస్సు నుజ్జునుజ్జయింది. ప్రమాద సమాచారం అందిన వెంటనే స్థానికులు, పోలీసులు, ఆరోగ్య సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీపంలోని నాహన్, రాజ్‌గఢ్ ఆసుపత్రులకు తరలించారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని మెరుగైన చికిత్స కోసం సిమ్లాలోని ఐజీఎంసీ ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా నిలవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రమాదంపై మెజిస్టీరియల్ విచారణకు కూడా ప్రభుత్వం ఆదేశించింది.

# టెట్ ఆరోరోజు పరీక్షకు 84 శాతం హాజరు

## ఆదివారం ఉదయం 47 కేంద్రాలు, మధ్యాహ్నం 54 కేంద్రాల్లో పరీక్షలు

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 3 నుంచి ప్రారంభమైన ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) జనవరి-2026 పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఆరో రోజు పరీ క్షలకు 84.23 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్టు పాఠశాల విద్య డైరక్టర్, టెట్ ఛైర్మన్ నవీన్ నికోలస్ తెలిపారు. ఆరో రోజైన శుక్రవారం జరిగిన పేపర్-1 పరీక్ష 51 కేంద్రాల్లో జరిగింది. పరీక్షకు 16,010 మందిని కేటాయించగా వారిలో 13,486 మంది పరీక్షకు హాజరయ్యారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 84.23 శాతం మంది పరీక్షకు హాజరయ్యారు. ఈ నెల 3, 4 తేదీల్లో పేపర్-2 మ్యాథ్స్ అండ్ సైన్స్ పరీక్షలు జరగగా, 5, 6 తేదిల్లో పేపర్-2 సోషల్ స్టడీస్ పరీక్షలు జరిగాయి. ఈ నెల 8, 9 తేదీల్లో పేపర్-1 పరీక్షలు జరిగాయి. ఆదివారం ఉదయం పేపర్-1 పరీక్ష 47 పరీక్షా కేంద్రాల్లో జరగ నుండగా.. మధ్యాహ్నం 54 కేంద్రాల్లో పరీక్ష జరగనుంది.

# కళాశాల విద్యార్థిని ఆకస్మిక మృతి

## లెక్చరర్ల వేధింపులే కారణం!

**హైదరాబాద్ (కంటోన్మెంట్), జనవరి 9, ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన జి. వర్షిని ఎంపిసి చదువుతున్నది. ఈ నెల 8న కళాశాలకు అలస్యంగా రావడంతో ఫిజిక్స్, ఇంగ్లీషు లెక్చరర్లు శ్రీలక్ష్మి, మాధురి తోటివిద్యార్థినుల ముందు ఆ విద్యార్థినిని అసభ్యపదజాలంతో దూషించారు. దీంతో మానసిక వేదనతో వర్షిని ఇంటికి వెళ్లిన తరువాత కళాశాలలో జరిగిన విషయాన్ని తల్లి దండ్రులకు చెప్పింది. అంతలోనే వర్షినికి తలనొప్పి రావడంతో స్పృహతప్పి కింద పడిపోయింది. మల్కాజిగిరిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో గాంధీ ఆసుపత్రికి తరలించారు. మెదడులో రక్తం గడ్డకట్టడంతో ఆ విద్యార్థిని మృతి చెందింది. దళిత విద్యార్థిని అయిన వర్షినిని తోటి విద్యార్థినుల ముందు అవమానపర్చినందుకే మనోవేదనకు గురై మృతి చెందిందని, అందుకు కళాశాల లెక్చరర్లే బాధ్యత వహించాలని, వారిని కఠినంగా శిక్షించాలని కళాశాల ముందు ఎమ్మార్పీఎస్ నేతలు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు టివి నర్సింహ మాదిగ, కంటోన్మెంట్ ఇన్‌ఛార్జి ఇటుక శ్రీకిషన్ మాదిగ, మల్లికార్జున్ మాదిగలతోపాటు వందలాది మంది ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు. విషయం తెలుసుకున్న ఏసీపీలు గోపాలకృష్ణ, రమేశ్, మారేడ్‌పల్లి, కార్ఖాన ఇన్‌స్పెక్టర్లు నోముల వెంకటేశ్, అనురాధలు సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. మృతురాలు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కళాశాల లెక్చరర్లపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్, డిఐ శ్రీశైలం నాయక్‌లు తెలిపారు.



వర్షిని (ఫైల్)

# గ్రేహౌండ్స్ టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన డిజిపి శివధర్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:** రాష్ట్ర గ్రేహౌండ్స్ విభాగం-2026కు సంబంధించిన టేబుల్ క్యాలెండర్‌ను డిజిపి శివధర్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. తన కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమం లో దీనిని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రేహౌండ్స్ అదనపు డిజి అనిల్ కుమార్, సిఐ సెల్ డిఐజి భాస్కరన్, గ్రేహౌండ్స్ శిక్షణకు సంబం ధించిన కన్సల్టెంట్ కల్నల్ సోమేశ్వర్‌సింగ్ సిన్‌సిన్‌వార్, గ్రూప్ కమాండర్లు రాఘవేందర్‌రెడ్డి (ఆపరేషన్), సత్య శ్రీనివాసరావు (శిక్షణ), వెంకటేశ్వర్లు (హెడ్ క్వార్టర్స్), ఓఎస్‌డి దయానంద్, స్క్వాడ్రన్ కమాండర్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

# నైజీరియన్ డ్రగ్స్ స్మగ్లర్ల అరెస్టు

## రూ.20 లక్షల విలువైన ఎండిఎంఎ జప్తు

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:** భారత్‌లో అక్రమంగా వుంటూ డ్రగ్స్ దందాలు చేస్తున్న ఇద్దరు నైజీరియన్లను హైదరాబాద్ నార్కోటిక్ ఎన్ఫోర్స్‌మెంట్ వింగ్ అధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి 20 లక్షల రూపాయల విలువచేసే ఎండిఎంఎ డ్రగ్‌ను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ డిసిపి వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ శుక్రవారం మీడియాకు వెల్లడించారు. నైజీరియాకు చెందిన చిడి ఎజె (42), ఒబాసి జేమ్స్ విక్టర్ (38)లు భారత్‌లో 10 ఏళ్లకు పైగా అక్రమంగా వుంటున్నారు. ఇందులో చిడి మెడికల్ అటెండంట్ వీసాపై 2014 మా ర్చి నెలలో భారత్‌కు రాగా అతని వీసా గడువు అదే ఏడాది మే నెలలో ముగిసింది.

అయితే ఇతను నైజీరియాకు వెళ్లకుండా తన దేశానికే చెందిన డ్రగ్స్ స్మగ్లర్లతో కలిసి మాదకద్రవ్యాల స్మగ్లింగ్ చేయసాగాడు. దీంతో రెండేళ్ల క్రితం ఇతన్ని గోల్కొండ అ బ్కారీ పోలీసులు అరెస్టు చేయగా బెయిలు పై విడుదలై మళ్లీ అదే దందాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో అతను తాను భారత్‌కు చెందిన వాడుగా తప్పుడు పత్రాలు తయారు చేసుకుని నాగేశ్వ రన్ పేరిట ఏకంగా డ్రైవింగ్ లైసెన్స్‌ను పొందాడు. ఇదే సమయంలో భారత్‌లో అక్రమంగా వుంటున్న మరో నైజీరియన్ ఒబాసి జేమ్స్ విక్టర్ (ఇత ను ఢిల్లీలో వుంటూ బట్టల వ్యాపారంతోపాటు రెస్టారెంట్ కూడా నిర్వహిస్తున్నాడు)తో దోస్తీ చేసి ఇద్దరు కలిసి డ్రగ్స్ స్మగ్లింగ్ చేయసాగారు. నైజీరి యా కు చెందిన బడా స్మగర్ల నుంచి కొకైన్‌తో పాటు ఎండిఎంఎ సహా పలు రకాల డ్రగ్స్‌ను తక్కువ ధరకు కొని వాటిని దేశ వ్యాప్తంగా పలు నగరాలలో తమకు తెలిసిన వారికి ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. విక్టర్ కూడా భారత్‌లో వుండేందుకు తప్పుడు పత్రాలను పొందాడు. వీరి కదలికల పై నిఘా వుంచిన హైదరాబాద్ నార్కోటిక్ ఎన్ఫోర్స్‌మెంట్ వింగ్ అధికారులు గురువారం రాత్రి టోలిచౌక వద్ద దాడిచేయగా ఇద్దరు 150 ఎండిఎం ఎ డ్రగ్‌తో దొరికిపోయారు.

వీరి వద్ద నుంచి ఒక సెల్‌ఫోన్ కూడా జప్తు చేశారు. వీరిద్దరిని వారి దేశానికి గెంటి వేసేందుకు సంబంధించిన ప్రక్రియ ను చేబట్టినట్లు టాస్క్‌ఫోర్స్ డిసిపి తెలిపారు. ఈ సమావేశంలో హైదరాబాద్ నార్కోటిక్ ఎన్ఫోర్స్‌మెంట్ వింగ్ ఇన్‌స్పెక్టర్ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ కేసులో హీరో నవదీప్‌కు ఊరట

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:** యేడాది క్రితం గుడిమల్కాపూర్ పోలీసు స్టేషన్‌లో నమోదైన డ్రగ్స్ కే సులో హీరో నవదీప్‌కు హైకోర్టులో ఊ రట లభించింది. అప్పట్లో ఈ కేసు టాలీవుడ్‌లో సంచలనం రేపింది. కొందరు డ్రగ్స్ స్మగ్లర్లు ఈ కేసులో అరెస్టు కాగా వారు వెల్లడించిన వివరాల ఆధారంగా నవదీప్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో హైకోర్టును ఆశ్రయించిన నవదీప్ పోలీసులు తనను అరెస్టు చేయకుండా స్టే తెచ్చు కున్నారు. అనంతరం తనపై నమోదైన కేసును కొట్టి వేయాలని కోరారు. దీనిపై పోలీసులతో పాటు నవదీప్ తరపు న్యాయవాదుల మధ్య వాదనలు జరిగాయి. నవదీప్ తరపున వాదించిన న్యాయవాది ఈ కేసులో ఎవరో చెబితే తన క్లయింట్‌ను దోషిగా చూపారని, ఆయన వద్ద ఎలాంటి డ్రగ్స్ ల భించలేదని పేర్కొన్నారు. ఘటనా స్థలంలో లభించిన వస్తువులేవి నవదీప్‌కు సంబంధించినవి కావని ఆయన తెలిపారు. పోలీసుల తరపు న్యాయవా ది వాదనలు వినిపిస్తూ నవదీప్ ముద్దాయేనని తెలిపారు. ఇరు వర్గాల వాదనలు విన్న ధర్మాసనం నవదీప్ వద్ద ఎలాంటి డ్రగ్స్ వున్నట్లు ఆధారాలు లేనప్పుడు కేసు ఎలా నమోదు చేస్తారని పోలీసులను ప్రశ్నించడంతో పాటు నవదీప్‌పై నమోదైన డ్రగ్స్ కేసును కొట్టి వేసింది.



## నేడు, రేపు గుజరాత్‌లో పర్యటన

# ప్రధాని మోడీ సోమ్‌నాథ్ బాట

**న్యూఢిల్లీ, జనవరి 9:** సోమ్‌నాథ్‌లో జరిగే స్వాభిమాన్‌పర్వ్ వేడుకల్లో పాల్గొనేందుకుగాను ప్రధాన మంత్రి నరేంద్రమోడీ రెండురోజులపాటు గుజరాత్‌లోనే బసచేయనున్నారు. ప్రధాని సోమ్‌నాథ్ పర్యటనలో ఓంకార్ మంత్ర పఠనంలో కూడా పాల్గొంటారు. ఆ తర్వాత సోమ్‌నాథ్ దేవాలయంలోజరిగే డ్రోన్‌షోను కూడా వీక్షిస్తారు. 11వ తేదీ ఉదయం 9.45 గంటలక ప్రధాని శౌర్యయాత్రలో భాగస్వాములవుతారు. సోమ్‌నాథ్ దేవాలయాన్ని రక్షించుకునేందుకు ఆనాడు ముస్లిం ముగల్‌రాజుల దండయాత్రలను ప్రతిఘటించి అమురులైన యోధులకు గౌరవ సూచకంగా శౌర్యయాత్రను నిర్వహిస్తారు. ఈ యాత్రలో 108 గుర్రాలు కూడా ఉంటాయి. సాహసాలు, త్యాగాలకు ప్రతిబింబంగా ఈ యాత్ర జరుగుతోంది. ఆ తర్వాత 10.15 గంటలకు ప్రధానమంత్రి సోమ్‌నాథ్ దేవాలయంలో దైవదర్శనం పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారు. 11 గంటలకు ప్రధాని సోమ్‌నాథ్‌లోనే జరిగే సభలో పాల్గొని ప్రసంగిస్తారు. జనవరి 11వ తేదీవరకూ సోమ్‌నాథ్ స్వాభిమాన్ పర్వ్ నిర్వహిస్తారు. ఈ కార్యయక్రమం మహమ్మద్ గజిని సోమ్‌నాథ్ దేవాలయంపై దండయాత్ర జరిపి వెయ్యి సంవత్సరాలు అయిన సందర్భాన్ని గుర్తుచేస్తుంది. 1026లో గజిని మహ్మాద్ ఈ దేవాలయంపై దండయాత్రచేస్తే ఆనాటి యోధులు, వీరులు తీవ్రస్థాయిలోప్రతిఘటించారు. స్వాతంత్ర్యం తర్వాత ఈ దేవాలయం సర్దార్‌పటేల్ అధీనంలోకి వచ్చింది. 1951లో దేవాలయం పూర్తిగా పునరుద్ధరణ జరిగింది. పూర్తిగా ఆధునీకరించిన సోమ్‌నాథ్ దేవాలయాన్ని ఆనాటి దేశాధ్యక్షుడు డా.రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. 2026 నాటికి ఈ దేవాలయం పునరుద్ధరణ జరిగి 75 ఏళ్ల అవుతుంది. అందుకే 11వరకూ సోమనాథ్‌స్వాభిమాన్‌పర్వ్‌ను నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా వందలాదిమంది సాధువులు ఈ శౌర్యయాత్రలో పాల్గొంటారు. అలాగే 72 గంటలపాటు నిరంతరాయంగా ఓం మంత్రి పఠన ఉంటుంది.



# జననాయగన్ విడుదలకు హైకోర్టు క్లియరెన్స్

## 'యు ఎ' సర్టిఫికేట్ జారీ చేయాలని ఆదేశం

**చెన్నై, జనవరి 9:** దళపతి విజయ్ నటించిన తాజా చిత్రం "జననాయగన్"కు సంబంధించిన సెన్సార్ వివాదానికి ఇవాళ తెరపడింది. ఈ చిత్రానికి "యూఏ" సర్టిఫికెట్ జారీ చేయాలని కేంద్ర సెన్సార్ బోర్డును మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. దీంతో రాజకీయాల్లోకి పూర్తిస్థాయిలో ప్రవేశించే ముందు విజయ్ నటించిన చివరి చిత్రంగా భావిస్తున్న ఈ సినిమా విడుదలకు కీలకమైన అడ్డంకి తొలగిపోయింది. నెల రోజుల క్రితం సెన్సార్ కోసం ఉంచినా సర్టిఫికెట్ రాకపోవడంతో చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ హైకోర్టును ఆశ్రయించింది. సినిమాలో హింస ఎక్కువగా ఉందని, కొన్ని డైలాగులను మ్యూట్ చేయాలని డిసెంబర్ 19న సెన్సార్ బోర్డు సూచించింది. నిర్మాతలు అందుకు అంగీకరించినా, చివరి నిమిషంలో బోర్డు సభ్యులు మరికొన్ని అభ్యంతరాలు లేవనెత్తారు. కొన్ని సన్నివేశాల్లో రక్షణ శాఖకు చెందిన చిహ్నాన్ని వాడారని, దీనిపై నిపుణుల అభిప్రాయం అవసరమని పేర్కొన్నారు. అలాగే మతపరమైన సున్నితమైన అంశాలు ఉన్నాయని కూడా అభ్యంతరం తెలిపారు. ఈ కారణాలతో సర్టిఫికెట్ జారీలో జాప్యం జరిగింది. దీంతో ఈరోజు విడుదల కావాల్సిన సినిమా విడుదలను అనివార్య కారణాలవల్ల వాయిదా వేస్తున్నట్లు చిత్ర బృందం బుధవారం రాత్రి ప్రకటించింది. ఈ ప్రకటన తర్వాత, టికెట్లు బుక్ చేసుకున్న ప్రేక్షకులకు డబ్బు వాపసు ఇచ్చే ప్రక్రియను థియేటర్ల యాజమాన్యాలు ప్రారం భించాయి. తాజాగా హైకోర్టు తీర్పుతో చిత్ర బృందానికి పెద్ద ఊరట లభించింది. హెచ్. వినోద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పూజా హెగ్డే, బాబీ డియోల్, మమితా బైజుస్, గౌతమ్ వాసుదేవ్ మీనన్, ప్రియమణి కీలక పాత్రలు పోషించారు. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు.




# భర్త వేధింపులు భరించలేక గృహిణి ఆత్మహత్య!

## 11 నెలల కుమారుడికి విషం ఇచ్చి బలవన్మరణం!

## వారి మృతిని తట్టుకోలేక తల్లి ఆత్మహత్యాయత్నం!

**హైదరాబాద్ (సరూర్‌నగర్), జనవరి 9, ప్రభాతవార్త:** కట్టుకున్న భర్త పెడుతున్న ఇబ్బందులు భరించలేక ఓ గృహిణి తన 11 నెలల కుమారునికి విషం ఇచ్చి తాను ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అదే ఇంట్లో ఉంటున్న గృహిణి తల్లి సైతం విషం సేవించి ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నది. కలకలం సృష్టించిన ఈ సంఘటన హైదరాబాద్ సమీపంలోని మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నల్గొండ జిల్లా గుర్రంపోడు ప్రాంతానికి చెందిన యశ్వంత్ రెడ్డి, సుష్మిత (27)లకు 2023 ఆగస్టులో వివాహం జరిగింది. వీరికి 11 నెలల అశ్వంత్ నందన్‌రెడ్డి అనే కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం మీర్‌పేట్ పిఎస్ పరిధిలోని హస్తినాపురం జయకృష్ణ ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న వీరితో పాటు సుష్మిత తల్లి లలిత (50) కూడా నివసిస్తున్నది. ఇదిలా ఉండగా గురువారం సుష్మిత ఇంట్లో ఫ్యాన్‌కు వేలాడుతూ విగతజీవురాలిగా ఉండడం, చిన్నారి అశ్వంత్‌నందన్‌రెడ్డి మృతి చెంది ఉండడం.. అదే ఇంట్లో విషం సేవించి అచేతనంగా లలిత ఉండడం జరిగింది. బయటకు వెళ్ళి ఇంటికి తిరిగి వచ్చిన యశ్వంత్‌రెడ్డి తలుపు తట్టినా స్పందన లేకపోవడంతో తలుపులు బలవంతంగా తెరిచి లోనికి వెళ్ళి చూడగా వారి దృశ్యాలు కనిపించాయి. దీంతో ఆ ప్రాంతంలో తీవ్ర కలకలం రేగింది.

సమాచారం అందుకున్న బంధువులతో పాటు విషయం తెలిసిన స్థానికులు వారి ఇంటికి చేరుకున్నారు. సంఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ప్రస్తుతం వెంటిలేటర్‌పై లలిత ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నది. అయితే కుటుంబ కలహాల నేపథ్యంలోనే సుష్మిత జీవతంపై విరక్తి చెందిన ఉరేసుకొని ఆత్మహత్య చేసుకునే ముందు తన కుమారునికి విషం ఇచ్చి నట్లు భావిస్తున్నారు. వీరి మరణాలను గమనించిన లలిత సైతం విషం సేవించి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఇదిలా ఉండగా మృతురాలి బంధువులు మాత్రం ఆత్మహత్యలు కావని కచ్చితంగా హత్యలేనని ఆరోపిస్తున్నారు. యశ్వంత్‌రెడ్డి తరచుగా సుష్మను వేధించేవాడనీ దీంతో ఇంట్లో గొడవలు ఉన్నాయనీ ఇంటికి ఎవ్వరినీ రానిచ్చే వాడు కాదనీ, కనీసం ఫంక్షన్లకు కూడా ఎవ్వరినీ రానివ్వడని పేర్కొంటున్నారు.

కోపిష్టి అయిన యశ్వంతే వారిని అంతం చేసి ఉంటాడని వారు ఆరోపిస్తున్నారు. వారు ఉంటున్న ఆపార్ట్‌మెంట్‌కు సంబంధించిన సిసి కెమెరాల ఫుటేజీలు పరిశీలించాలని వారు కోరుతున్నారు. ఆపార్ట్‌మెంట్ అసోసియేషన్‌కు అధ్యక్షుడైన యశ్వంత్‌రెడ్డి వాటిని తారుమారు చేశాడని వారు పేర్కొంటున్నారు. కాగా మృతురాలి పెదనాన్న సంజీవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ శంకర్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న తల్లి లలిత, ఇన్‌సెట్- ఆత్మహత్య చేసుకున్న కూతురు సుష్మిత (ఫైల్)


# 'పిఎం కుసుం' ప్రారంభ గడువును సెప్టెంబరు వరకు పొడిగించాలి

## సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి డా.చిన్నారెడ్డికి వినతి

**హైదరాబాద్ (బేగంపేట) జనవరి 9, ప్రభాతవార్త:** పిఎం కుసుం పథకం ప్రారంభ గడువును సెప్టెంబరు వరకు పొడిగించాలని కోరుతూ శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో సీఎం ప్రజావాణి ఇన్‌చార్జ్ డా.జి.చిన్నారెడ్డికి రైతు సంఘం రాష్ట్ర వైస్‌ప్రసిడెంట్ ఆదినారాయణరాజు నేతృత్వంలోని బృందం సభ్యులు వినతిపత్రం అందించారు. పిఎం కుసుం పథకం కింద రాష్ట్రంలో సోలార్ ప్రాజెక్టులను ప్రారంభించే గడువును మార్చి నుంచి సెప్టెంబరు నెలాఖరు వరకు పొడిగించాలని కోరారు. వారి విజ్ఞప్తిని పరిశీలించిన డా.చిన్నారెడ్డి రెడ్కో అధికారులకు చిన్నారెడ్డి ఎండార్స్‌మెంట్ చేసారు. గిరిజన, గిరిజనేతర ప్రాం తాల్లో ఏర్పాటు చేసే సోలార్ ప్రాజెక్టులకు బ్యాంకులు రుణాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, రైతుల దరఖాస్తులను అభివృద్ధి దారుగా కాకుండా వ్యక్తిగతంగా పరిగణించాలని ఆదినారాయణ చిన్నా రెడ్డిని కోరారు.

### సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 472

ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 472 దరఖాస్తులు అందాయి. వాటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 120 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 29 దరఖాస్తులు, విద్యుత్‌శాఖకు సంబంధించి 26 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 219 దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణికి 1దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబం ధించి 77 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా.జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవ రాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.



సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి డా.చిన్నారెడ్డిని కలిసిన రైతు సంఘం రాష్ట్ర వైస్‌ప్రెసిడెంట్ ఆదినారాయణరాజు నేతృత్వంలోని బృందం సభ్యులు

# అగ్రికల్చర్ వర్సిటీ ప్రశ్నపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

## అక్రమార్జనకు అడ్డాగా మారిన ఎగ్జామినేషన్ బ్రాంచ్

## ఎబివిపి రాష్ట్ర కార్యదర్శి రాంబాబు

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో జరిగిన ప్రశ్నాపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబివిపి) తెలంగాణ రాష్ట్ర శాఖ డిమాండ్ చేసింది. అక్రమార్జనకు యూనివర్సిటీ ఎగ్జామినేషన్ బ్రాంచ్ అడ్డాగా మారిందని రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు విమర్శించారు. రాష్ట్రంలో వ్యవసాయ విద్యను అందించే ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రశ్నాపత్రాల లీకేజి వ్యవహారానికి కారణం యూనివర్సిటీ పాలనాధికారుల నిరక్ష్యమే కారణమన్నారు. ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ఏడాది నవంబర్‌లో జరిగిన సంఘటనను కప్పిపుచ్చి నామమాత్రపు దిద్దుబాటు చర్యలు చేపట్టడం చూస్తే అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. నలుగురు అధికారులను సస్పెండ్ చేసి, 35 మంది ఇన్ సర్వీస్ ఉద్యోగుల అడ్మిషన్స్ రద్దు చేసి చేతులు దులుపుకుంటే సరిపోదని.. అసలు నిజానిజాలు నిగ్గుతెల్చేందుకు నిష్పాక్షికంగా విచారణ జరగాలని డిమాండ్ చేశారు. గత కొన్నేళ్లుగా ఉన్నతాధికారులు లేక అనేక అవకతవకలు జరిగాయని చెప్తున్న యూనివర్సిటీ పాలకులు .. ఎందుకు ప్రభుత్వానికి ఫిర్యాదు చేయలేదని నిలదీశారు. ఈ ఘటన యూనివర్సిటీకి మాయని మచ్చలాంటిదని, కాసులకు కక్కుర్తిపడి ప్రశ్నపత్రాలను అమ్ముకోవడం అంటే ప్రతిభ గల విద్యార్థులకు ద్రోహం చేయడమే నన్నారు. ఈ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణకు ఆదేశించేవరకు, కారకులను శిక్షించే వరకు ఏబివిపి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని రాంబాబు ప్రభుత్వాన్ని హెచ్చరిం చారు.



# మధుమేహ వ్యాధిగ్రస్తులకు సహజకాంతి ఎంతోమేలు!

## సెల్ మెటబాలిజం జర్నల్‌లో సర్వేల నివేదిక

**జెనీవా, జనవరి 9:** టైప్ 2 డయాబెటిస్‌తో బాధపడేవారికి పగటిపూట సహజ కాంతి ఎంతో మేలు చేస్తుందని ఓ కొత్త అధ్యయనం తేల్చింది. సహజ కాంతిలో ఎక్కువ సేపు గడిపేవారిలో రక్తంలో చక్కెర స్థాయిలు మెరుగ్గా అదుపులో ఉంటున్నాయని, జీవక్రియ కూడా మెరుగుపడుతుందని స్విట్జర్లాండ్‌లోని జెనీవా విశ్వవిద్యాలయం, నెదర్లాండ్స్‌లోని మాస్ట్రిక్ట్ విశ్వవిద్యాలయం పరిశోధకులు గుర్తించారు. ఈ అంశంపై సహజకాంతి చూపే సానుకూల ప్రభావాన్ని నిరూపించిన మొదటి అధ్యయనం ఇదేనని పరిశోధకులు చెపుతున్నారు. వారి సర్వే ప్రకారం, సహజ కాంతిలో సమయం గడిపిన వారిలో రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు ఎక్కువ గంటల పాటు సాధారణ పరిధిలోనే ఉన్నాయి. సాయంత్రం వేళ నిద్రకు సహకరించే మెలటోనిన్ హార్మోన్ స్థాయిలు పెరిగినట్లు, కొవ్వుల జీవక్రియ కూడా మెరుగుపడినట్లు వెల్లడించారు. శరీరంలోని అంతర్గత గడియారం (సర్కేడియన్ రిథమ్) దెబ్బతినడం వల్లే జీవక్రియ సంబంధిత వ్యాధులు పెరుగుతాయని నిపుణులు ఎప్పటినుంచో చెబుతున్నారు. ఈ అధ్యయనం కోసం, టైప్ 2 డయాబెటిస్ ఉన్న 65 ఏళ్లు పైబడిన 13 మందిని ఎంపిక చేశారు. వారిని రెండు సెషన్లలో భాగంగా 4.5 రోజుల పాటు ప్రత్యేక గదుల్లో ఉంచారు. ఒక సెషన్‌లో సహజ కాంతి వచ్చేలా, మరో సెషన్‌లో కృత్రిమ లైట్ల వెలుతురులో ఉంచి వారి ఆరోగ్యాన్ని విశ్లేషించారు. సహజ కాంతి వల్ల మెదడులోని కేంద్ర గడియారానికి, ఇతర అవయవాల్లోని గడియారాలకు మధ్య సమన్వయం మెరుగుపడుతుందని, దీనివల్లే రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటున్నాయని పరిశోధకులు వివరించారు. ఈ అధ్యయన వివరాలు "సెల్ మెటబాలిజం" అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

# ఇండిగో విమానంలో సాంకేతిక లోపం

## శంషాబాద్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండింగ్

**మహేశ్వరం, జనవరి 9, ప్రభాతవార్త:** రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం సాయంత్రం ఇండిగో విమానాన్ని అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. చెన్నై నుంచి రాంచి వెళ్ళవలసిన ఇండిగో విమానంలో 134 మంది ప్రయాణికులు ఉన్నారు. చెన్నై నుంచి రాంచి వెళ్తుండగా ప్రయాణంలో ఇండిగో విమానంలో సాంకేతిక లోపం కారణంగా పైలెట్ ముందు జాగ్రత్త చర్యగా విమానాన్ని హైదరాబాదు శంషాబాద్ రాజీవ్ గాంధీ విమానాశ్రయంలో విమానాన్ని ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. దీంతో 134 మంది ప్రయాణికులు క్షేమంగా ఏయిర్‌పోర్టులోకి దిగడంతో ఊపిరి పీల్చుకున్నారు.



# కారును ఢీ కొట్టిన టోయింగ్ వాహనం

## వ్యక్తి మృతి, పలువురికి తీవ్రగాయాలు

**ప్రభాతవార్త, ఏటూర్‌నాగారం జనవరి 9:** జాతీయ రహదారి 163 పై ఘోర రోడ్డు ప్రమాదం లో వ్యక్తి మృతి చెంద గా, పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది . స్థానిక ఎస్సై రాజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం .వాజేడు గ్రామానికి చెందిన కాకర్లపూడి వీరభద్ర రాజు వయసు 49 సంవత్సరాలు అతను తన కారులో తన ఇద్దరు కూతుర్లు మేఘన 21 సం లు, మాధురి 18సం లు మరియు అతని తమ్ముడు సీతారామరాజు, బాబాయ్ బుచ్చి గోపాల రాజులతో కలిసి ఉదయం 10 గంటల సమయంలో ఏటూరు నాగారం వైపు వస్తుండగా , జాతీయ రహదారి 163 రొయ్యూరు సమీపం లోని భారత్ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే ఎదురుగా తిశ12లి 2715 గల రికవరీ వాహనము (టోయింగ్ వెహికిల్ )ని నడుపుతున్న వ్యక్తి జాకీర్ హుస్సేన్ అజాగ్రత్తగా అతివేగంగా నడిపి కారును ఎదురుగా ఢీకొట్టగా కారు ముందు భాగం నుజ్జు నుజ్జై ,రోడ్డు క్రిందకు దూసుకొని వెళ్ళగా వీరభద్ర రాజు తలకు చేతులకు కాళ్లకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మరణించాడని తెలిపారు .మిగతా వారికి తీవ్ర గాయాలు కాగా వారిని 108 లో ఏటూరు నాగారం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, మెరుగైన చికిత్స కోసం వరంగల్ కు పంపించినట్లుమృతిని తమ్ముడు కాకర్లపూడి వెంకట సత్య నరసింహారాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు . వీరభద్ర రాజు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

pnb Housing Finance Limited
Ghar Ki Baat
అనుబంధం-IV-A
B.O: హైదరాబాద్: MCH No. 15-24-173, ఫ్లోర్ నం.1, KPHB కాలనీ, 2వ అంతస్తు, కూకట్‌పల్లి, హైదరాబాద్ - 500072
www.pnbhousing.com

| రుణం నెం./రుణగ్రహీత పేరు/సహ-రుణగ్రహీత/హామీదారు/చట్టబద్ధ వారసులు (A) | డిమాండ్ మొత్తం & తేదీ (B) | స్వాధీనతా స్వభావం (C) | తనఖా పెట్టబడిన ఆస్తుల వివరణ (D) | రిజర్వు ధర (RP) (E) | బయానా (RP లో 10%) (F) | బిడ్ సమర్పించు చివరి తేదీ (G) | బిడ్ ఇంక్రిమెంటల్ రేట్ (H) | తనిఖీ తేదీ మరియు సమయం (I) | వేలం తేదీ మరియు సమయం (J) | తెలిసిన బాధ్యతలు/కోర్టు కేసులు (K) |
| --- | --- | --- | --- | --- | --- | --- | --- | --- | --- | --- |
| NHL/HYDK/1219/764980, శ్రీకృష్ణ ఎంటర్‌ప్రైజెస్ / P వెంకటేశ్వర రెడ్డి / అనంత రామయ్య శ్రీనివాసుల B.O: కూకట్‌పల్లి | రూ. 5,59,34,318.94 & 13.05.2024 | భౌతికంగా స్వాధీనం | యూనిట్ నం.103, 1వ అంతస్తు, మునిసిపల్ నం.6/1090/B/1, ... హైదరాబాద్, తెలంగాణ-500082, ఇండియా | రూ. 2,86,88,000 | రూ. 28,68,800 | 28.01.2026 | రూ. 2 లక్షలు | 16.01.2026 ఉ.11.00 గం. నుండి సా.5.00 గం. | 29.01.2026 మ.02.00 గం. నుండి సా.3.00 గం. | తెలియదు |

ప్రదేశము: హైదరాబాద్, తేది: 10.01.2026

వార్త

మధ్యవర్తి మాట, అడవిలోని బాట ఎంత వరకు తీసుకెళ్తాయో ఎవరికీ తెలియదు.

-రాఛెల్

# మాదన్నమాకీ.. రాజన్న దేవుడా!

**నూతనంగా ఎన్నికైన సర్పంచులు ఇటీవలనే కొలువుతీరారు. వారి ముందు అనేక సమస్యలున్నాయి. ఏళ్లతరబడి పేరుకుపోయాయి. ఫలితంగా ప్రగతికి మూలం కావాల్సిన పల్లెలు సమస్యల నిలయాలుగా ఉన్నాయి. గ్రామాభివృద్ధికి చేపడుతున్న పనులు పంచాయతీల పరిధిలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఏదిఏమైనా రాజ్యాంగపరంగా పంచాయతీలకు ఇవ్వాల్సిన అధికారాలు వాటికి ఇవ్వడంలో జాప్యం చేయడం ఏమాత్రం సమంజసం కాదు. రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కావాలనికేంద్రం ముందుగావుకేకలు పెడుతున్న రాష్ట్ర ప్రభుత్వాలు సర్పంచులకు రాజ్యాంగం కల్పించిన అధికారాలు ఇవ్వకపోవడం ఏమాత్రం సమంజసంకాదు.**

దామెర్ల సాయిబాబ

మొక్కులు, కానుకలు, దక్షిణతాంబూలాలు అన్ని సమర్పించుకున్న తర్వాత కూడా దైవం కోరిన వరాలు ఇవ్వకపోతే కోర్కెలు తీర్చకపోతేపోయావు, తాము సమర్పించుకున్న కానుకలు, దక్షిణలు తిరిగి ఇవ్వాలంటూ 'మాదన్న మాకీ రాజన్నదేవుడా' అంటూ భక్తులు వేములవాడలోని రాజరాజేశ్వర స్వామిని వేడుకోవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. భక్తులు సమర్పించుకున్న కానుకలు చెల్లించడానికి ఆయన దగ్గర లక్ష్మీ ఉండదు కనుక ఏదో ఒక వరం ఇచ్చి పంపుతారనేది భక్తుల విశ్వాసం. ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలైన స్థానిక సంస్థల ప్రతినిధుల పరిస్థితి అందుకు అద్దంపడుతున్నదేమోననిపిస్తున్నది. పంచాయతీలకు విధులు, నిధులు ఇస్తాం, చట్టాలు తెచ్చాం, తెస్తున్నాం, గ్రామ సమస్యలను గుర్తించి స్థానికంగా పరిష్కరించేందుకు అవసరమైన నిధులు, అధికారాలు ఇస్తున్నామని ఎంతో కాలంగా పాలకులు ప్రకటనల మీద ప్రకటనలు గుప్పిస్తూనే ఉన్నారు. కానీ అయ్యా మాకేమి కొత్త చట్టాలు చేసి అదనంగా నిధులు ఇవ్వాల్సిన అవసరం లేదు. రాజ్యాంగ సవరణ ద్వారా కల్పించిన 39 ప్రభుత్వ శాఖలను గ్రామస్థాయిలో తమకు అప్పగిస్తే అదే చాలు అని వారు ఎంతోకాలంగా వేడుకుంటూనే ఉన్నారు. దశాబ్దాలు గడచిపోతున్నా ఆవైపు అడుగులు వేయడానికి పాలకులు మనసు ఒప్పడం లేదు. పాలకుల మాటలు నమ్మి కొందరు ప్రజాప్రతినిధులు చివరకు తలతాకట్టుపెట్టి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి తమ తమ గ్రామాల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది రూపాయలు ఇలా అప్పుతెచ్చిన డబ్బుతోపాటు సొంత సొమ్మును కూడా వెచ్చించారు. అయితే ఆ డబ్బు తిరిగి రాబట్టుకోవడం కోసం వారుపడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. తెలంగాణ రాష్ట్రంలో వారి పదవీకాలం పూర్తయి దాదాపు రెండేళ్లు దాటిపోయింది. మాజీలు అయిపోయారు. ఇప్పుడు మళ్లీ కొత్తగా ఎన్నికలు కూడా పూర్తి చేశారు. కొత్త సర్పంచులు పదవీబాధ్యతలు కూడా స్వీకరించారు. ఇక తాము పెట్టిన డబ్బు కోసం మాజీ సర్పంచులు పడుతున్న పడరాని పాట్లు పరిశీలిస్తే ఆవేదన కలగకతప్పదు. ఇప్పటికే కొందరు మాజీ సర్పంచులు అప్పుల వాళ్ల ముందు తలవంచుకోలేక మరొకపక్క ఆత్మగౌరవం చంపుకోలేక తలవంచుకొని బతకలేక వారిలో వారు కుమిలి కుమిలి చివరకు కొందరు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. మొన్న తెలంగాణ అసెంబ్లీని మాజీ సర్పంచులు ముట్టడికి ప్రయత్నించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామాభివృద్ధికి తాము అప్పు తెచ్చి వ్యయం చేసిన డబ్బును తిరిగి ఇవ్వమని, ఇప్పటికే ఏళ్లు జరిగిపోయాయని, వడ్డీలకు వడ్డీలు కట్టలేకనే సతమతమైపోతున్నామనేదే వారి ఆవేదన. నూతనంగా ఎన్నికైన సర్పంచులలో సందిగ్ధత కన్పిస్తున్నది. నిధులు లేవు. పోని ఎక్కడైనా సొంత పలుకుబడితో అప్పులు తెచ్చిపెడితే మాజీ సర్పంచుల పరిస్థితులు ప్రత్యక్షంగా చూస్తున్నారు. అలాని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకపోతే ప్రజలకు తాము చేసిన వాగ్దానాల పరిస్థితి ఏమిటి? ఎంతో ఉత్సాహంగా గ్రామాభివృద్ధికి అహర్నిశలు కృషి చేయాలని తపనతో ఎన్నికైన ఈ నూతన సర్పంచులలో కొందరి పరిస్థితి అయోమయం, అగమ్యగోచరంగా ఉంది. ఇక నిధుల సంగతి అలా వుంచితే అధికారాల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగాలేదు. చట్టంలో ఉంది కనుక ఇవ్వలేమని చెప్పలేరు. అలాని ఇవ్వరు. ఇప్పటివరకు రాజ్యాంగం కల్పించిన 29 అధికారాల్లో

## ఒక్క మాట

కేవలం పదమూడు మాత్రమే ఇచ్చినట్లు చెబుతున్నారు. ఈ పదమూడులో కూడా అధిక శాతం కాగితాలకే పరిమితం చేశారు. మరోపక్క విద్యాకమిటీలు అంటూ స్థానిక సంస్థలకు సమాంతరంగా వ్యవస్థలను ఏర్పాటు చేసి సర్పంచు పదవులను ఉత్సవ విగ్రహాలుగా తయారు చేశారు. స్థానిక సంస్థల ప్రతినిధుల ప్రమేయం లేకుండానే ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు, చివరకు లబ్ధిదారుల గుర్తింపులు కూడా జరిగిపోతున్నాయి. ఇది ఇప్పటికిప్పుడు ఆరంభం కాకపోయినా మూడు, నాలుగు దశాబ్దాలుగా ఒక వ్యూహం ప్రకారం స్థానిక సంస్థలను బలహీనపరిచే కార్యక్రమం జరుగుతున్నది. చివరకు చీపురు కట్టకొనడానికి కూడా స్వతంత్రంగా స్థానిక సంస్థలు వ్యవహరించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. మరొకపక్క గ్రామ అవసరాలు పెరిగిపోయాయి. అందుకు తగ్గట్టుగా ఆదాయం పెరగడం లేదు. ఆస్తిపన్ను తప్ప పెద్దగా ఆదాయ వనరులు లేకుండాపోయాయి. ఇక గ్రామంలో ఏ అభివృద్ధి చేయాలన్నా, అటు కేంద్రప్రభుత్వంవైపో, ఇటు రాష్ట్ర ప్రభుత్వం వైపో చేయిచాపి చూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఏ కోణం నుంచి చూసినా పంచాయతీ రాజ్ వ్యవస్థను అంతో ఇంతో నిర్వీర్యం చేయాలనిఅందరూ ప్రయత్నం చేసిన వారే. తమ అధికారులతో ప్రాబల్యానికి దెబ్బతగులుతుందనే భయమే ఇందుకు ప్రధాన కారణమనే చెప్పొచ్చు. ఈ పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారానే రాజకీయ ప్రవేశం చేసి ఉన్నతస్థాయికి చేరిన కొందరు నాయకులు కూడా పంచాయతీలను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించడం అత్యంత బాధాకరం. దేశంలో కానీ, రాష్ట్రంలో కానీ ఎంతో సమర్థవంతులుగా పేరు తెచ్చుకున్న నాయకుల్లో అధిక శాతం పంచాయతీ రాజ్ వ్యవస్థ నుండి వచ్చినవారే. సర్పంచులు, సమితి అధ్యక్షులు జిల్లా పరిషత్ అధ్యక్షులుగా పనిచేసినవారికి ప్రజాసమస్యలను ముఖ్యంగా గ్రామీణ సమస్యలపట్ల మంచి అవగాహన ఉంటుంది. ఏసమస్య వచ్చినా తమ తరుపున మాట్లాడటానికి తమ సర్పంచు ఉన్నాడనే ధైర్యం గ్రామప్రజల్లో అపారంగా ఉండేది. ఇలా ప్రజల హృదయాల్లో చోటు చేసుకున్నా గ్రామస్థాయి నాయకులు ఎందరో ఉన్నతస్థాయికి ఎదిగారు. అసలు భారత దేశంలో స్థానిక సంస్థలకు రెండువేల సంవత్సరాలకుపైగా చరిత్ర ఉంది. చంద్రగుప్తుడికంటే ముందునుంచే గ్రామాలు, గ్రామవ్యవస్థలు అమలులో ఉన్నట్లు చరిత్ర చెబుతున్నది. అప్పుడుకూడా గ్రామసభలు ఉండేవి. వాటి నిర్ణయాలకు ఆనాటి రాజరికపు వ్యవస్థ ఎంతో ప్రాముఖ్యత ఇచ్చేది. ప్రాచీన కాలం నుంచి గ్రామవ్యవస్థ ఏదోఒక రూపంలో మనదేశంలో కొనసాగుతూ వస్తూనే ఉంది. 1882లోఆనాటి బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి లార్డ్‌రిప్పన్ స్థానిక సంస్థలకు ఒక ప్రతిపత్తి కల్పించారు. స్వాతంత్ర్యానంతరం 1952లో మొదటి పంచవర్ష ప్రణాళికలోనే కేంద్రప్రభుత్వం కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇలా ఎన్నో మార్పులు, చేర్పులు జరిగాయి. దేశవ్యాప్తంగా ఒకే తరహా పంచాయతీరాజ్ వ్యవస్థ అమలులో ఉండాలనే ఉద్దేశ్యంతో 73వ రాజ్యాంగ సవరణబిల్లును పార్లమెంటు ఆమోదించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1994మే 30వ తేదీనుండి ఈ శాసనం అమలులోకి వచ్చింది. ఈ చట్టప్రకారమే ఐదంచెల విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇలా ముఖ్యమంత్రులు మారినప్పుడు, అధికారంలో పార్టీలు మారినప్పుడు ఎవరికి తోచిన విధంగా వారు ఈ పంచాయతీరాజ్ వ్యవస్థను మార్పులు, చేర్పులతో ముంచెత్తారు. అయితే ఎన్నిమార్పులు చేసినా, మరెన్ని కూర్పులు చేసినా చట్టప్రకారం అధికారాలుకల్పించినా అధికార వికేంద్రీకరణలో మాత్రం మొదటినుంచి అధికారంలో ఉన్న పెద్దలు జాగ్రత్తలు పడుతూనేఉన్నారు. తెలంగాణ ప్రభుత్వం పాత చట్టాన్ని రద్దుచేసి 2018ఏప్రిల్ నుంచి కొత్త చట్టాన్నితీసుకువచ్చింది. ఆ చట్టప్రకారం కొన్ని అధికారాలతోపాటు ఆదాయం పెంచుకునే మార్గాలకు అవకాశం ఇచ్చింది. ఇప్పుడు నూతనంగా ఎన్నికైన సర్పంచులు ఇటీవలనే కొలువుతీరారు. వారి ముందు అనేక సమస్యలున్నాయి. ఏళ్లతరబడి పేరుకుపోయాయి. ఫలితంగా ప్రగతికి మూలం కావాల్సిన పల్లెలు సమస్యల నిలయాలుగా ఉన్నాయి. గ్రామాభివృద్ధికి చేపడుతున్న పనులు పంచాయతీల పరిధిలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఏదిఏమైనా రాజ్యాంగపరంగా పంచాయతీలకు ఇవ్వాల్సిన అధికారాలు వాటికి ఇవ్వడంలో జాప్యం చేయడం ఏమాత్రం సమంజసం కాదు. రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కావాలని కేంద్రం ముందు గావుకేకలు పెడుతున్న రాష్ట్ర ప్రభుత్వాలు సర్పంచులకు రాజ్యాంగం కల్పించిన అధికారాలు ఇవ్వకపోవడం ఏమాత్రం సమంజసంకాదు. ●

# సూత్రధారులే మూలం

చట్టాలకు సామాన్యులు లోకువ. సమర్థులకు చట్టాలు లోకువ అంటారు. ఏ సందర్భంలో ఎవరిని ఉద్దేశించి అన్నారో కానీ మారిన కాలమాన పరిస్థితుల్లో ఇది అక్షరాల నిజం అనిపిస్తున్నది. ఆర్థిక, అంగ, అధికార రాజకీయ బలం ఉన్నవారు తప్పుచేస్తే చర్యల సంగతి అటుంచి వేలెత్తి చూపడానికి కూడా జంకే దురదృష్టపు పరిస్థితులు దాపురించాయి. మిగిలిన నేరాల విషయంలో ఎలా ఉన్నా మానవ జాతిని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల నియంత్రణలో అటు పాలకులు కానీ, ఇటు అధికారయంత్రాంగం కానీ సమర్థవంతంగా వ్యవహరించలేకపోతున్నారేమోననిపిస్తున్నది. దేశవ్యాప్తంగా ఎంతో పోలీసు సిబ్బందిఉంది. నిఘా వ్యవస్థలున్నాయి. ఏకంగా నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో ఉంది. ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర విభాగాలు ఉన్నాయి. నిత్యం నిఘా పెడుతున్నారు. అప్పుడప్పుడు తనిఖీల్లో పట్టుబడుతూనే ఉన్నాయి. కేసులు పెడుతున్నారు. జైళ్లకు పంపుతున్నారు. అయినా ఇవి ఆగడం లేదు. నిరాటంకంగా మాదకద్రవ్యాలు సరఫరా అవుతున్నాయి. ఇటీవల కాలంలో చెన్నై, ముంబయి, బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్ లాంటి నగరాల్లోని విమానాశ్రయాల్లో మాదకద్రవ్యాలు వేలాది కోట్ల రూపాయలు పట్టుబడ్డాయి. గతంలో కేరళ సమీపంలో అరేబియా సముద్రంలో నౌకాదళం స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాల విలువ అంతర్జాతీయ మార్కెట్లో దాదాపు ఐదారువేల కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని అధికార వర్గాలే అంచనా వేశాయి. ఇవన్నీ ఏదో ఒక వ్యూహం ప్రకారం పట్టుకున్నవి కావు. అధికారులు చేస్తున్న తనిఖీల్లో పట్టుబడినవే. ఇక విమానాల్లో రహస్యంగా తీసుకువస్తున్న మత్తుపదార్థాలు తక్కువేమీ కాదు. రకరకాల మార్గాల్లో వీటిని తరలిస్తున్నారు. మొన్న ఆ మధ్య ఇద్దరు మహిళలు రహస్యంగా సూట్‌కేసుల్లో వైర్‌బండిళ్ల మాటున మత్తుపదార్థాలను తరలిస్తుండగా కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. ఆహార సరఫరా ముసుగులో మత్తుపదార్థాలు పంపిణీ చేస్తున్న బాగోతం ఉత్తరభారతంలో తరచుగా బయటపడుతున్నది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, హర్యానా తదితర రాష్ట్రాల్లో మత్తుపదార్థాల వినియోగం అంతకంతకు పెరిగిపోతున్నట్లు అధికారులు కూడా అంగీకరిస్తున్నారు. ముంబాయి నగరం కొకైన్ కేంద్రంగా మారినట్లుకు మాదకద్రవ్యాల నియంత్రణ సంస్థే అంగీకరించక తప్పడంలేదు. ఇక గంజాయి సాగు దేశంలో అనేక రాష్ట్రాలతోపాటు తెలుగు రాష్ట్రాల్లో కూడా సాగు చేస్తున్నారు. అప్పుప్పుడు ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి గంజాయి పంటను ధ్వంసం చేస్తున్నా మళ్లీ రెండు, మూడు నెలల్లో యధావిధిగా సాగులోకి వస్తున్నాయి. అడవుల్లో ఉన్న ప్రభుత్వ భూముల్లో ఇది సాగు చేసే స్మగ్లర్లు పట్టుబడగానే సూత్రధారులు అదృశ్యమైపోతున్నారు. కేవలం ఆ ప్రాంతంలో అమాయక రైతులు, రైతు కూలీలు ఇరుక్కుపోతున్నారు. అంతేకాదు అత్యంత విలువైన మాదకద్రవ్యాల రవాణాలో పట్టుబడుతున్నది పాత్రధారులే. వారి వెనుకఉండే సూత్రధారులను పట్టుకోలేకపోతున్నారు. స్పష్టంగా తెలిసినా కూడా సరైన సాక్ష్యాలు లేకపోవడం వల్ల వారి జోలికి వెళ్లలేకపోతున్నారు. వెళ్లినా న్యాయస్థానాల ముందురుజువు చేయకపోవడంతో చర్యలు చేపట్టలేకపోతున్నారు. మాదకద్రవ్యాలు అఫ్గానిస్థాన్ నుండి ఆఫ్రికా మీదుగా భారత్‌కు చేరుకొని వివిధ మార్గాలద్వారా దేశంలోని అన్ని ప్రాంతాలకు సరఫరా అవుతున్నాయి. మరొకపక్క మయన్మార్‌లో జరిగిన సైనిక తిరుగుబాటు నుంచి మణిపూర్, మిజోరం వరకు భారీగా మాదకద్రవ్యాలు ప్రవేశిస్తున్నాయి. కొన్ని మాదకద్రవ్యాల ముఠాలు ఈశాన్యభారతంలోని కొన్ని తీవ్రవాద బృందాలకు నిధులు అందిస్తున్నాయి. ఇది దేశ భద్రతకు అత్యంత ప్రమాదకరంగా మారింది. ఆ మధ్య మయన్మార్ వలసదారుల నుంచి పద్దెనిమిది ఆయుధాలు డెబ్బైనాలుగు కోట్ల రూపాయల విలువైన అక్రమ రవాణా వస్తువులు, దాదాపు రెండువందల కోట్ల విలువైన మాదకద్రవ్యాలు పట్టుబడ్డాయి. సరఫరా ముఠాల కదలికలపై నిఘావేసి నియంత్రించాల్సిన నార్కోటిక్ కంట్రోల్‌బ్యూరో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, పోలీసులు తదితర శాఖల మధ్య సమన్వయం లేకపోవడం కూడా ఈ మత్తు పదార్థాల విస్తరణకు కారణం అవుతున్నది. తెలుగురాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ప్రస్తుతం అంతకంతకు పెరిగి సమాజాన్ని పట్టిపీడిస్తున్న మత్తుపదార్థాల వాడకం, వినియోగం ఆందోళన కలిగిస్తున్నది. ఈ మహమ్మారి దేశవ్యాప్తంగా ఆ మాటకొస్తే ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. చాపకింద నీరులా ఈ స్మగ్లర్లు తనసామ్రాజ్యాన్ని పెంచుకుంటూపోతున్నారు. యేటా కొకైన్, బ్రౌన్‌షుగర్ లాంటి మాదకద్రవ్యాలు వేలాది టన్నులకుపైగా ప్రపంచవ్యాప్తంగా సరఫరా అవుతున్నట్లు అనధికార అంచనాలనుబట్టి తెలుస్తున్నది. లక్షలాది కోట్లరూపాయల వ్యాపారం జరుగుతున్నది. ఈ జాడ్యం విస్తరించడం అత్యంత ప్రమాదకరం. మాదకద్రవ్యాలను నిరోధించే విషయంలో మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపించాల్సిన తరుణమిది. ముఖ్యంగా మాదకద్రవ్యాల సరఫరాలో పట్టుబడుతున్న పాత్రధారులను కాకుండా సూత్రధారులను బయటకుతీసి న్యాయ స్థానాల ముందు తిరుగులేని సాక్ష్యాలతో రుజువు చేసి పటిష్టమైన చర్యలుచేపట్టాలి. వినియోగం ఉత్పత్తి, నిల్వ, వ్యాపారానికి పాల్పడడం అత్యంత తీవ్రమైన నేరాలుగా కొన్నిదేశాలు పరిగణిస్తున్నాయి. ఆయాదేశాలు మరణ శిక్షలు కూడా విధిస్తున్నాయి. పాలకులు అలాంటిశిక్షలవైపు దృష్టిసారించాలి. పాత్రధారులతోపాటు సూత్రధారులను పట్టుకుంటే తప్ప ఇది ఆగే పరిస్థితి కన్పించడం లేదు. ఏమాత్రం జాప్యం చేసినా యువతపై తీవ్ర ప్రభావం చూపి అరాచకం ప్రబలే ప్రమాదం ఉంది.

మనం ఉన్నత లక్షణాలు కలిగి ఉంటే సరిపోదు. వాటిని నిలబెట్టుకోవడానికి తగిన సామర్థ్యం కూడా కలిగి ఉండాలి.



సెయింట్ థెరిస్సా

మాట ఇవ్వడానికి తొందరపడొద్దు. ఇచ్చిన మాట నెరవేర్చడానికి వెనుకాడవద్దు.



లియో టాల్‌స్టాయ్

# ప్రజావాక్కు



## చైనా మాంజా వాడొద్దు

సంక్రాతి పండుగ సీజన్ వచ్చిందంటే పిల్లలకు పతంగుల పండుగే. ఇదో సరదా. వాటికి కట్టే దారం చైనా తయారు చేసిన మంజాను గాజు రజనుతో తయారు చేస్తారు. ఇది అత్యంతప్రమాదకరం. ఈమంజాను వాడద్దనే ప్రభుత్వం చేసే ప్రచారానికి ఎవరూ ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ఇంకా పండుగ ప్రారంభం కానేలేదు. మంజా తగిలి కొంతమంది కుత్తులకు తగిలి ఆసుపత్రుల పాలయ్యారు. అలాగే పిట్ట గోడలు లేని డాబాలు, అపార్టమెంట్ల మీద పతంగులను ఎగురవేసే సమయంలో బహు జాగ్రత్తలు తీసుకోవాలని చేసేహెచ్చరికలను పాటించాలి. పండుగలు సరదాగా ఆనందంగా గడపాలి కాని నిర్లక్ష్యం వలన విషాదాలు కాకూడదు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలి

తెల్లరేషన్‌కార్డు వారికి బియ్యం ఒక్క రూపాయికి, మహిళలకు బస్సుప్రయాణం ఉచితం, కొంతమందికి 200 యూనిట్లు వరకు విద్యుత్ ఉచితం. కానీ బస్ స్టాండ్‌లలో పబ్లిక్ టాయిలెట్స్‌లు ఉపయోగిస్తే అందుకూ రూ. 5 చెల్లించాలి. విజయవాడ నగరం బస్టాండుకి ప్రతినిత్యం వేలాదిమంది ప్రయాణికులు వస్తుంటారు. రాష్ట్రంలోకెల్లా పేరున్న బస్టాండుగా ఉంది. ఆబస్టాండులో పనిచేసే స్టాఫ్ అంతా ప్రయాణికుల చార్జీలతోనే జీతాలు పొందుతున్నారు. స్టాఫ్‌కి టాయిలెట్లు ఉచితం. ప్రయాణికులు మాత్రం ఐదు రుపాయాలు చెల్లించాలి. పక్కరాష్ట్రం తెలంగాణలో బస్టాండులో పెద్దపెద్ద అక్షరాలతో ఉచిత టాయిలెట్ అని వ్రాసిఉంటుంది. ఇక్కడ కూడా ఉచిత టాయిలెట్లు ఏర్పాటుచెయ్యాలి.

- నార్నెవెంకట సుబ్బయ్య, ఒంగోలు

## సోషల్ మీడియా ప్రభావం

సోషల్ మీడియా మన దైనందిన జీవితంలో కీలక పాత్ర పోషిస్తోంది. సమాచారం త్వరగా చేరవేయడంలో ఇది ఎంతో సహాయపడుతుంది. అయితే దాని దుష్ప్రభావాలు కూడా గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నకిలీ వార్తలు వేగంగావ్యాప్తి చెందుతున్నాయి. అధిక వినియోగం వల్ల యువతలో ఏకాగ్రత లోపం, మానసిక ఒత్తిడి, నిద్రలేమి వంటిసమస్యలు పెరుగుతున్నాయి. సరైన అవగాహనతో సోషల్ మీడియాను ఉపయోగించాలి.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## కోట్ల కొద్దీ ఓట్ల గల్లంతు సబబేనా?

ఎన్నికల సంఘం రాష్ట్రాల వారీగా ఓటర్ల జాబితాల్ని సవరించే కార్యక్రమం స్పెషల్‌ఇంటెన్సివ్ రివిజన్ పేరిట మొదలుపెట్టింది. ఇప్పుడు నడుస్తున్న రెండవదశలో ఒక్కఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోనే రెండున్నర కోట్ల మంది పేర్లు ముసాయిదాజాబితా నుంచి మాయమయ్యాయి. ఇంకోనెలరోజుల పాటువాటిపై పునః పరిశీలన, అప్పీల్ జరిగి అసలు జాబితా తయారౌతుంది. ఇంతవరకూ రివిజన్ జరిగిన 12 రాష్ట్రాల్లో రద్దయిన ఓట్లు కోట్లలో ఉన్నాయి. అందులో సంఖ్య పరంగా చూస్తే ఉత్తరప్రదేశ్ మొదటి స్థానం, శాతాల పరంగా అయితే 18శాతంతో రెండోస్థానం. దొంగ ఓట్లను, అనర్హుల ఓట్లను జాబితా నుంచి తొలగించడం మంచిపనే కానీ ఈ స్థాయిలో తొలగింపుల్లో తప్పులు దొర్లవంటే నమ్మడం కష్టం. ముఖ్యంగా ఈ రివిజన్ ప్రక్రియకు కేటాయిస్తున్న టైమ్ తక్కువ. హడావిడిగా జరుగుతోంది. తొలగించబడిన అర్హులైన ఓటరు తన అర్హతను తానే నిరూపించుకుని ఓటు హక్కు పొందాల్సి ఉంటుంది. ఆ అవగాహన లేకపోయినా, సమయానికి అందుబాటులో లేకపోయినా ఆవ్యక్తి ఓటు హక్కు కోల్పోతాడు.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

## అదనపు రైళ్లు నడపాలి

సంక్రాంతి పండుగ సెలవు రోజుల్లో హైదరాబాద్లో ఉన్న తెలుగురాష్ట్రాల వారు స్వంత ఊళ్ళకు వెళ్ళడం ఆనవాయితీగా మారింది. ఆ రోజుల్లో హైద్రాబాద్‌రహదార్లాన్ని ఖాళీగా కనిపిస్తాయి. కాని రైళ్ళు, బస్సులు కిటికిటలాడిపోతాయి. ఎందులోను సీట్లు దొరక్క ప్రయివేటు ఆపరేటర్లను ఆశ్రయిస్తారు. ఇదే అదనుగా రేట్లను మాడు నాలుగు రెట్లు పెంచి వసూలు చేస్తున్నారు. కొంతమంది సామాన్యులు సొంత గ్రామాలకు వెళ్ళడం ధరలు భరించలేక మానుకుంటున్నారు. ప్రభుత్వం తగినన్ని అదనపు బస్సులు, రైళ్లు నడపాలి. అలాగే ఛార్జీలు తగ్గించాలి.

-డా. ఎన్.ఎస్. ఆర్. మూర్తి, సికింద్రాబాద్

## ఉల్లికి పెరిగిన గిరాకీ

మనదేశంలో పండే ఉల్లికి చాలా గిరాకీఉంది. తూర్పు ఆసియా ప్రాంతం, మధ్య ఆసియా ప్రాంతం, ఆఫ్రికా ప్రాంతాలలో మన ఉల్లికి చాలా గిరాకీ ఉంది. దానికి తోడు ఉల్లి పైన ఎగుమతి సుంకాలు తగ్గించడం కూడా ఎగుమతులు పెరగడానికి కారణమైంది. నాణ్యమైన ఉల్లి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక ప్రాంతాలలో పండుతాయి. ఆసియాన్ క్వాడ్ కూటమిలో భారత్ కీలకపాత్రపోషిస్తుండడంఎగుమతులుపెరగడానికి కారణమైంది.

-భారత అవినాష్, జనగామ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సభలు మాట్లాడితేనే ప్రజాస్వామ్యానికి బలం


తిప్పర్తి శ్రీనివాస్

ప్రజాస్వామ్యం అనేది కేవలం ఓటు హక్కుతో పరిమితమయ్యే వ్యవస్థ కాదు. ప్రజల ఆకాంక్షలు, అవసరాలు, సమస్యలు చర్చకు వచ్చి విధానాలుగా రూపాంతరం చెందే వేదికే నిజమైన ప్రజాస్వామ్యం. ఆ వేదికలే చట్టసభలు. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు, శాసనమండలులు ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రాణం లాంటివి. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధుల ద్వారా పాలన నడిచే ఈ వ్యవస్థలో చట్టసభల పాత్ర అత్యంత కీలకమైనది. అందుకే చట్టసభలు ప్రజాస్వామ్యానికి ప్రతీకలు" అనడం అతిశయోక్తి కాదు. చట్టసభల ప్రధాన బాధ్యత చట్టాలను తయారు చేయడం. కానీ ఆ పని కేవలం చట్ట రచనతో ముగియదు. ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, పాలనపై పర్యవేక్షణ చేయడం, విధానాలపై చర్చ జరిపి లోపాలను ఎత్తిచూపడం వంటి కీలక పాత్రలను కూడా చట్టసభలు నిర్వర్తిస్తాయి. ప్రజాస్వామ్యంలో అధికారాన్ని పరిమితం చేయడానికి, దుర్వినియోగాన్ని అడ్డుకోవడానికి చట్టసభలే ప్రధాన ఆయుధం. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా ఉందా లేదా అన్నది చట్టసభల చర్చల ద్వారానే వెలుగులోకి వస్తుంది. భారతదేశంలాంటి విభిన్న దేశంలో చట్టసభల ప్రాధాన్యం మరింత ఎక్కువ. భాషలు, సంస్కృతులు, మతాలు, ప్రాంతాలు భిన్నమైన ప్రజల అభిప్రాయాలు ఒక్క వేదికపై వ్యక్తమయ్యే అవకాశం చట్టసభల వల్లే సాధ్యమవుతోంది. గ్రామీణ ప్రాంతాల సమస్యల నుంచి పట్టణాల సవాళ్ల వరకు, రైతుల కష్టాల నుంచి యువత ఆశల వరకు అన్నింటినీ ప్రతినిధులు సభలోప్రస్తావించగలుగుతారు. ఈ విధంగా చట్టసభలు దేశానికిఅద్దంలా నిలుస్తాయి. అయితే ఇటీవలి కాలంలో చట్టసభల పనితీరుపై విమర్శలు కూడా పెరుగుతున్నాయి. సభలలో గందరగోళం, వాకౌట్లు, నినాదాలు, పరస్పర ఆరోపణలు ఎక్కువవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చర్చకు రావాల్సినకీలక అంశాలు పక్కకు నెట్టబడుతూ, సమయం వృథా అవుతోందన్న ఆవేదన ప్రజల్లో ఉంది. చట్టసభల స్థాయికి తగ్గట్టుగా సభ్యులు వ్యవహరించడం లేదన్న అభిప్రాయం బలపడుతోంది. ఇది ప్రజాస్వామ్యానికి శుభసూచకం కాదు. ప్రజలు ఓటు వేసి ఎన్నుకున్న ప్రతినిధులు చట్టసభలలో తమ గొంతును వినిపించాల్సిన బాధ్యత కలిగి ఉంటారు. సభ అనేది రాజకీయ పోరాటానికి మాత్రమే కాదు, నిర్మాణాత్మకచర్చకు వేదిక కావాలి. విభేదాలు ఉండటం సహజమే కానీ, అవి విధ్వంసానికి కాకుండా విధానపరమైన చర్చలకు దారి తీయాలి. ప్రతిపక్షం ప్రభుత్వాన్ని విమర్శించడమే కాదు, అవసరమైన సూచనలు చేయాలి. అధికార పక్షం విమర్శలను శత్రుత్వంగా కాకుండా ప్రజల గొంతుగా స్వీకరించాలి. అప్పుడే చట్టసభల గౌరవం నిలుస్తుంది. చట్టసభల గౌరవం అంటే కేవలం భవనం లేదా సంప్రదాయాలకే పరిమితం కాదు. సభ్యుల ప్రవర్తన, మాటతీరు, చర్చా స్థాయి, ప్రజా సమస్యలపై అవగాహన – ఇవన్నీ కలిసే ఆ గౌరవాన్ని నిర్ణయిస్తాయి. ప్రజల సమస్యలపై లోతైన అధ్యయనం చేసి సభలో మాట్లాడే ప్రతినిధులు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తారు. అలాంటివారు చట్టసభలను నిజమైన ప్రజాస్వామ్య ప్రతీకలుగా నిలబెడతారు. మీడియా పాత్ర కూడా ఈ సందర్భంలో కీలకం. చట్టసభలలో జరిగే చర్చలను ప్రజలకు చేరవేయడం, ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించడం మీడియా బాధ్యత. అదే సమయంలో కేవలం సంచలనాలకే ప్రాధాన్యం ఇవ్వకుండా, సారవంతమైన చర్చలను ప్రజల ముందుకు తీసుకురావాలి. అప్పుడు ప్రజల్లో కూడా చట్టసభలపై ఆసక్తి, గౌరవం పెరుగుతుంది. ప్రజాస్వామ్యంలోప్రజల పాత్ర కూడా తక్కువ కాదు. ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా, పాలనపై నిరంతరం దృష్టి పెట్టాలి. తమ ప్రతినిధులు చట్టసభలలోఎలా వ్యవహరిస్తున్నారో గమనించాలి. ప్రశ్నించాలి. అవసరమైతే ప్రజాభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేయాలి. ప్రజల చైతన్యమే చట్టసభలను సజీవంగా ఉంచుతుంది. చివరగా చెప్పాలంటే, చట్టసభలు ప్రజాస్వామ్యానికి కేవలం ప్రతీకలు మాత్రమే కాదు, దాని రక్షకులు కూడా. చట్టసభల గౌరవాన్ని కాపాడుకోవడం ప్రజా ప్రతినిధుల బాధ్యత మాత్రమే కాదు, ప్రజల బాధ్యతకూడా. నిర్మాణాత్మక చర్చలు, పరస్పర గౌరవం, ప్రజాహితంపై దృష్టి చట్టసభలను నిజమైన ప్రజాస్వామ్య ప్రతీకలుగా నిలబెడతాయి. ●

# వెనెజులాపై దాడి సామ్రాజ్యవాద సందేశమా?

బి.వీరభద్రం

అమెరికా ప్రత్యేక బలగాలు వెనిజులా రాజధాని కారకాస్ పైచేసిన సాహసోపేత దాడిలో అధ్యక్షుడు నికోలాస్ మదురో, భార్య సిలియా ఫ్లోర్స్ ఇద్దరినీ తీసుకెళ్ళి న్యూయార్క్ జైలులో బంధించడం ప్రపంచ రాజకీయాలను కుదిపేసింది. తొలుత వెనుజువెలాను తామే పాలిస్తామని ట్రంప్ ప్రకటించారు, తర్వాత వెనక్కి తగ్గారు. మూడు రోజుల తర్వాత కూడా ఈ మొత్తం ఘటన వెనుక ఉన్న ట్రంప్ ప్రభుత్వ రాజకీయ లక్ష్యం ఏమిటో అర్థం కాలేదు. వెనుజువెలా 303 బిలియన్ బ్యారెల్ల చమురు నిల్వలు స్వాధీనం చేసుకోవడం, మాదక ద్రవ్యాల వ్యాపారాన్ని అరికట్టడం, పెట్రో డాలర్ వ్యవస్థను కాపాడడం, మదురో ప్రభుత్వాన్ని అస్థిరపర్చి బొలివేరియన్ సోషలిజాన్ని కుప్పకూల్చడం కోసం వంటివాదనలు వినిపిస్తున్నాయి. మరికొందరు ఎప్స్టీన్ కేసు నుంచి దృష్టి మరల్చడానికి, 2026 నవంబర్‌లో జరగనున్న మధ్యంతర ఎన్నికలకు ట్రంప్ రాజకీయ ఎత్తుగడ అనే వాదనలు కూడా చర్చల్లో ఉన్నాయి. ఎప్స్టీన్ కేసుఅంటే అమెరికా రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించింది. ఇది రాజకీయంగా, న్యాయపరంగా, సామాజికంగా సంచలనం రేపిన ఒక లైంగిక దోపిడీ కేసు, బాలికల అక్రమ రవాణాపేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన చిన్నారి బాలికలు, యువతులకు ఉద్యోగం, మోడలింగ్, చదువు అవకాశాల పేరుతో ప్రలోభపెట్టి తన ఇళ్లకు తీసుకెళ్లేవాడన్న ఆరోపణల కేసు ఇది. ఎప్స్టీన్ అనే వ్యక్తికి అమెరికాలోని రెండు ప్రధాన రాజకీయ పార్టీల నేతలతో సంబంధాలున్నాయన్న వార్తలు, ఫొటోలు బయటకు రావడంతో డెమోక్రాట్లు, రిపబ్లికన్లు ఒకరినొకరు పరస్పరం ఆరోపించుకుంటున్నారు. ఎప్స్టీన్ కేసులోని ఫైల్స్‌ను పూర్తిగా బయట పెట్టే బిల్లుపై సంతకం చేయడం, ఆ ఫైల్స్‌లో ఎవరి పేర్లు ఉన్నాయనేది అమెరికా రాజకీయాల్లో పెద్ద చర్చగా మారింది. ఈ క్రమంలోఎప్స్టీన్ జైలులో ఊచల మధ్యనే మరణించడంతో వాతావరణం మరింత వేడెక్కింది. ట్రంప్ ప్రభుత్వాధినేతలతో ఎప్స్టీన్‌కు సంబంధాలున్నాయి అనే ఆరోపణలకు మరింత బలం చేకూరింది. తద్వారా ట్రంప్ ప్రభుత్వంపై వస్తున్న విమర్శల దృష్ట్యా ప్రజలు, విపక్షాల దృష్టి మరల్చడానికి ట్రంప్ ఈ చర్యలకు దిగాడన్న ఆరోపణలున్నాయి. వెనెజువెలా చమురు క్షేత్రాలపై అజమాయిషీ కోసం ప్రయత్నం చేయడాన్ని ట్రంప్ సమర్థించుకున్నాడు. అమెరికన్ కంపెనీలే తమ పెట్టబడులతో వెనెజువెలా చమురు రంగాన్ని నిర్మించాయని, సోషలిస్ట్ రాజ్యం జాతీయాకరణ చేసి చమురు కంపెనీలపై ఆధిపత్యం సాధించిందనీ, తిరిగి ప్రైవేట్ పరంచేసి వెనెజువెలా దేశ ప్రజలకు విద్యా, వైద్యం, ఉపాధి కల్పిస్తామనీ ట్రంప్ వాపోతున్నారు.



అయితే, చమురుపై ఆధిపత్యం కోసమే ఈ దుశ్చర్యకు దిగాడన్నది కొంతమేరకు నిజమైనా, నూటికి నూరు శాతం అదే కారణంగా చూపడానికి ఎటువంటి సహేతుకమైన ఆధారాలు లేవు. వెనుజువెలాకు ప్రపంచంలోనే అతిపెద్దచమురు నిల్వలు ఉన్నాయన్నది నిజం, కానీ వెనుజువెలా క్రూడ్‌లో వెనేడియం, నికెల్, ఐరన్, కాపర్ వంటి లోహాలు, సల్ఫర్ ఎక్కువగా ఉన్నటువంటి తక్కువ నాణ్యత గల చమురు. ప్రామాణికంగా 0.5 శాతం కన్నా ఎక్కువగా సల్ఫర్, ఇతర లోహాలు గల క్రూడ్‌ను సోర్‌క్రూడ్ అనీ, 0.5 శాతం కంటే తక్కువ సల్ఫర్, లోహాలు గల క్రూడ్‌ను స్వీట్ క్రూడ్ అని అంటారు. వెనిజులా క్రూడ్‌లో సల్ఫర్, ఇతర లోహాలసాంద్రత ఎక్కువగా ఉన్నందున పెట్రోల్, డీజిల్ వంటి ఉత్పత్తులుగా శుద్ధిచేయడం అంత సులువుకాదు, దీని సేకరణ, శుద్ధి చేయడం అమెరికా రిఫైనరీలకు పెద్ద సవాలు, ఖర్చుతో కూడినది. జామ్ నగర్ రిలయన్స్ క్రూడ్ రిఫైనరీల వంటి అత్యాధునిక రిఫైనరీలు (నెల్సన్ కాంప్లెక్సిటీ ఇండెక్స్ 20+ గలవి) మాత్రమే దీన్ని సమర్థవంతంగా శుద్ధిచేయగలవు. అమెరికాకు ఇప్పటికే 14 మిలియన్ బ్యారెల్ల డబ్ల్యూటీఐ(సల్ఫర్, లోహాల సాంద్రత తక్కువగా గల క్రూడ్), షేల్ ఆయిల్(రాతి పొరల నుండి సేకరించిన క్రూడ్) ఉత్పత్తి ఉంది. వెనుజువెలా చమురు పరిశ్రమలను తిరిగి పునరుద్ధరించడానికి సుమారు 30 బిలియన్ డాలర్లు అవసరం, పైగా 3 సంవత్సరాలు పడుతుంది. ఇప్పటికిప్పుడు వెనుజువెలా చమురు ఉత్పత్తి రెట్టింపైనా (900,000నుంచి 2మిలియన్ బ్యారెల్లు), ప్రపంచ మార్కెట్లో 13మాత్రమే తప్ప, దీని ప్రభావం పెద్దగా ఉండదు. వెనుజువెలా చమురు పరిశ్రమఉత్పత్తి పెరిగి, తక్కువ ధరకు ప్రపంచ మార్కెట్లో అమ్మాలని చూసినా, పెట్రోలియం ఎగుమతి చేసే పెట్రో ఆధారిత ఆర్థిక వ్యవస్థ గల అంతర్జాతీయ దేశాలు చమురు ధరలు తగ్గించి మార్కెట్ విస్తరణను అడ్డుంటాయి. ట్రంప్ చేసిన ఈ దాడి చమురు కోసమే కాదు, ఇదో రాజకీయ సందేశం, ట్రంప్ పాలనలో అంతర్జాతీయ చట్టాలు, దేశ సార్వభౌమత్వం పట్టించుకోకుండా దేశాధ్యక్షుడినే నిర్బంధించడంతో మరో మారు ట్రంప్ నియంతృత్వాన్ని, అమెరికా సామ్రాజ్యవాద పోకడలను ప్రపంచ దేశాలు తిట్టిపోస్తున్నాయి. ప్రపంచంలో వెనుజువెలా వంటి దేశాల పరిపాలనల్లో సమస్యలు ఉన్నా, ఇలాంటి హింసాత్మక చర్యలు ప్రపంచ శాంతిని దెబ్బతీస్తాయి. భారత్ వంటి దేశాలు చమురు ఆధారిత దేశాల (వెనుజువెలా, ఇరాన్, ఇరాక్, సౌదీ అరేబియా, కువైట్, అరబ్ ఎమిరేట్స్) ఆర్థిక వ్యవస్థలను కాపాడుకునేలా, సామ్రాజ్యవాద ఆధిపత్యానికి వ్యతిరేకంగా గట్టిగా నిలబడాలి. ఒక దేశం లేదా ప్రాంతం తన ఆర్థికవృద్ధి, పరిశ్రమలు, గృహాలు, రవాణా వ్యవస్థలకు అవసరమైన శక్తిని (చమురు, విద్యుత్, గ్యాస్) స్థిరంగా, సరసమైన ధరలపై పొందే దేశాలపై ఈ ఘటన తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. ట్రంప్ వ్యూహాత్మకంగా అది చమురు కోసమే చేసాడు అనేదానికంటే ఇదో రాజకీయ సందేశం, ఎత్తుగడ అన్న వాదనే బలమైనది. భారత్ దిగుమతి చేసుకుంటున్న ఎక్కువ మొత్తం క్రూడ్ రష్యాదే, అయితే చైనా, రష్యా, భారత్ క్రూడ్ కొనుగోలు, అమ్మకాలు యువాన్, రూబుల్, రూపాయలలో వ్యాపారం చేస్తున్నాయి, సౌదీ అరేబియా కూడా బ్రిక్స్ దేశాలతో చర్చలు జరుపుతుండటంతో, పెట్రోడాలర్ వ్యవస్థపై ప్రభావం పడి డాలర్ బలహీనమయ్యే పరిస్థితి ఏర్పడింది. ●



# ఇరాన్‌లో ఖమేనీ వ్యతిరేక నిరసనలు ఉధృతం

### పెహ్లవీ ప్రవాసంనుంచి రావాలని నిరసనకారుల నినాదాలు

### ఇంటర్నెట్ సేవలు బంద్ చేసిన సర్కార్

**టెహ్రాన్, జనవరి 9:** ఇరాన్ ప్రభుత్వంపై ఆ దేశ ప్రజలు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. పడిపోతున్న ఆర్థిక వ్యవస్థ, ఆకాశాన్ని తాకుతున్న ధరలు, నిరుద్యోగంతో విసిగిపోయిన ప్రజలు సర్వోన్నత నేత ఆయతొల్లా అలీ ఖమేనీ నాయకత్వంలోని ఇస్లామిక్ పాలనకు వ్యతిరేకంగా రోడ్లపైకి వచ్చారు. గత మూడు సంవత్సరాలలో ఎన్నడూ లేని విధంగా టెహ్రాన్ వీధులు నిరసనకారులతో కిక్కిరిసిపోయాయి. నిరసనలు ఉధృతం కావడంతో అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. ఆందోళనకారులు ఒకరికొకరు కనెక్ట్ కాకుండా ఉండేందుకు దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను పూర్తిగా నిలిపివేసింది. అంతర్జాతీయ టెలిఫోన్ కాల్స్, ల్యాండ్‌లైన్ సేవలు కూడా పనిచేయడం లేదు. గతంలో ఇలా ఇంటర్నెట్ ఆపివేసిన ప్రతిసారీ ప్రభుత్వం భారీ స్థాయిలో హింసాత్మక అణచివేతకు పాల్పడిందని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. ప్రవాసంలో ఉన్న యువరాజు రెజా పహ్లవీ ఇచ్చిన పిలుపుతో నిరసనలు మరింత ఊపందుకున్నాయి. టెహ్రాన్ లోని పలు ప్రాంతాల్లో ప్రజలు 'పహ్లవీ తిరిగి రావాలి ఇస్లామిక్ రిపబ్లిక్ నశించాలి'అంటూ నినాదాలు చేశారు. 1979 విప్లవానికి ముందున్న రాచరికాన్ని గుర్తు చేసుకుంటూ ప్రజలు నినదించడం ప్రభుత్వంపై ఉన్న తీవ్ర వ్యతిరేకతకు అద్దం పడుతోంది. ఇప్పటివరకు జరిగిన హింసలో 42 మంది మరణించగా, 2,270 మందికి పైగా నిరసనకారులను భద్రతా దళాలు అదుపులోకి తీసుకున్నాయి. శాంతియుత నిరసనకారులను చంపితే ఊరుకోబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించారు. నిరసనకారులను చంపితే ఇరాన్ నరకాన్ని చూడాల్సి ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై ఇరాన్ స్పందిస్తూ విదేశీ శక్తుల ప్రోద్బలంతోనే ఈ అల్లర్లు జరుగుతున్నాయని, శత్రువులకు సహకరించే వారిపై కనికరం చూపేది లేదని ఆ దేశ ప్రధాన న్యాయమూర్తి స్పష్టం చేశారు. మరోవైపు, డ్రోన్ల సహాయంతో నిరసనకారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరిస్తోంది.

# ముందు మీ దేశంపై దృష్టి పెట్టండి

### ట్రంప్ తీరుపై ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ

**టెహరాన్, జనవరి 9:** ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా చోటుచేసుకుంటున్న అల్లర్లపై ఆ దేశ సుప్రీం లీడర్ ఆయతొల్లా అలీ ఖమేనీ స్పందించారు. తమ దేశంలో ఆందోళనకారులను హెచ్చరించిన ఆయన.. విదేశీ శక్తుల చేతుల్లో కిరాయి సైనికుల్లా వ్యవహరించే వారిని సహించే ప్రసక్తే లేదన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఉద్దేశిస్తూ.. ఇతర దేశాలకు చెప్పే ముందు సొంత దేశంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇతర దేశాధ్యక్షుడిని సంతోష పెట్టేందుకు సొంత వీధులను నాశనం చేసుకుంటున్నారంటూ ఆందోళనకారులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రవాసంలో తలదాచుకున్న యువరాజు రెజా పహ్లవి (గతంలో అమెరికా మద్దతుతో దేశాన్ని పాలించిన 'షా' వారసుడు) ఇచ్చిన పిలుపు మేరకు ఇరాన్‌లో ఆందోళనకారులు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపట్టారు. గురువారం మొదలైన ఈ నిరసనలు శుక్రవారం ఉదయం వరకు కొనసాగాయి. ఇంటర్నెట్, టెలిఫోన్ సేవలను ప్రభుత్వం నిలిపివేసినప్పటికీ ఆందోళనకారులు పెద్ద ఎత్తున పాల్గొనడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే స్పందించిన సుప్రీం లీడర్.. యువత ఏకతాటిపై ఉండాలని, దేశం ఐకమత్యంగా ఉన్నప్పుడే ఎలాంటి శత్రువునైనా ఎదుర్కోవచ్చన్నారు.


# క్రిమినల్ సిండికేట్‌లా లాలూ కుటుంబం: ఢిల్లీ కోర్టు



**న్యూఢిల్లీ, జనవరి 9:** భూ కుంభకోణం కేసుపై విచారణ జరిపిన ఢిల్లీ కోర్టు ఆర్జేడీ నాయకుడు లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబంపై కీలక వ్యాఖ్యలు చేసింది. ఐఆర్‌సిటిసి ఐఆర్‌సిటిసి కుంభకోణంలో లాలూ కుటుంబం క్రిమినల్ సిండికేట్‌లా వ్యవహరించిందని పేర్కొంది. ఈ కేసులో తమను నిర్దోషులుగా విడుదల చేయాలని లాలూ కుటుంబం వేసిన పిటిషన్ ఆమోదయోగ్యం కాదని వెల్లడించింది. సిబిఐ అధికారులు దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను, సాక్ష్యాధారాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం లాలూ కుటుంబసభ్యులను, సహాయకులను కుట్రదారులుగా పేర్కొంది. లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన భార్య, బీహార్ మాజీ ముఖ్యమంత్రి రబ్రీదేవి, కుమారులు తేజస్వి యాదవ్, తేజ్ ప్రతాప్ యాదవ్, కుమార్తె మిసా భారతితో సహా ఆయన కుటుంబ సభ్యులు ఉద్యోగానికి బదులుగా భూమిని స్వాధీనం చేసుకున్నట్లు బలమైన ఆధారాలు ఉన్నాయని ఢిల్లీ కోర్టు పేర్కొంది. ల్యాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణంలో ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్‌తో పాటు ఇతరులపై అవినీతి నిరోధక చట్టం కింద అభియోగాలు నమోదు చేసింది. 2004-2009లో లాలూ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో ఉద్యోగాల కేటాయింపులో అవినీతి జరిగిందనే ఆరోపణలు వచ్చాయి.

ఆ సమయంలో భారతీయ రైల్వేలోని వివిధ జోన్లలో అనేక మందిని గ్రూప్ డి పోస్టుల్లో నియమించారు. దీనికి బదులుగా వారి భూములను లాలూ ప్రసాద్ కుటుంబసభ్యులతో పాటు ఓ ప్రైవేట్ కంపెనీకి బదిలీ చేశారని సిబిఐ ఆరోపించింది. దీంతో మోసం, కుట్ర, అవినీతి నిరోధక చట్టం కింద ట్రయల్ కోర్టు లాలూ కుటుంబంపై అభియోగాలు మోపింది. ట్రయల్ కోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ లాలూ ఢిల్లీ కోర్టును ఆశ్రయించారు.

# గుజరాత్‌ను 12సార్లు వణికించిన భూప్రకంపనలు



**అహ్మదాబాద్, జనవరి 9:** గుజరాత్ రాజ్‌కోట్‌ను వరుస భూకంపాలు వణికించాయి. కేవలం 24 గంటల వ్యవధిలోనే పదికిపైగా సార్లు భూమి కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత స్వల్ప స్థాయిలోనే నమోదైంది. వరుస ప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సౌరాష్ట్ర ప్రాంతంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకూ దాదాపు 12 సార్లు భూమి కంపించింది. భూకంపం తీవ్రత రిక్టరు స్కేలుపై 2.6 నుంచి 3.8 మధ్య నమోదైంది. రాజ్‌కోట్ జిల్లాలోని మూడు తాలూకాల్లో ఈ ప్రకంపనలు చోటు చేసుకున్నట్లు గాంధీనగర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిస్మోలాజికల్ రీసెర్చ్ తెలిపింది.

ఉప్లేటా, ధోరాజీ, జెట్‌పూర్ తాలూకాల్లో ప్రకంపనలు చోటు చేసుకున్నట్లు పేర్కొంది. ఉప్లేటాకు తూర్పు ఈశాన్య దిశలో 27 నుంచి 30 కి.మీ దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు వెల్లడించింది.

# ట్రేడ్ డీల్‌పై ఎడతెగని 'వార్'



- పరస్పర ప్రయోజనాలుండాలి: భారత్ - ట్రంప్‌కు మోడీ ఫోన్ చేస్తే ఓకే: యుఎస్
- గత యేడాది 8సార్లు ఫోన్ సంభాషణ - భారత్ విదేశాంగ శాఖ ఘాటుగా స్పందన - వెనిజులా చమురు భారత్‌కు సరఫరా - ట్రంప్ సర్కార్ తాజా యోచన
- అందుకే రష్యా చమురుపై ఆంక్షలు - 500శాతం సుంకాల హెచ్చరికలు

**న్యూఢిల్లీ/వాషింగ్టన్, జనవరి 9:** భారత్- అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందానికి సంబంధించి మాటల యుద్ధం మొదలైంది. భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఫోన్ చేయకపోవడంతోనే వాణిజ్య ఒప్పందం ఆలస్యానికి ప్రధాన కారణమని యుఎస్ వాణిజ్య శాఖ మంత్రి హొవార్డ్ లుట్నిక్ ఆరోపించారు. లుట్నిక్ ఆరోపణలను భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఖండించారు. గతేడాది మోడీ-ట్రంప్ 8 సార్లు ఫోన్‌లో మాట్లాడుకున్నారని ఆధారాలతో సహా బయటపెట్టారు. ఆ సంభాషణల్లో వాణిజ్య ఒప్పందంలోని పలు అంశాలు చర్చకు వచ్చాయని తెలిపారు. ద్వైపాక్షిక భాగస్వామ్యం బలోపేతంపైనా వారు చర్చించారన్నారు. ఇరు దేశాధినేతల మధ్య పరస్పర గౌరవంతో కూడిన స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని కూడా చెప్పారు.

పరస్పర ప్రయోజనకరంగా ఉండే వాణిజ్య ఒప్పందాన్ని అమెరికాతో కుదుర్చుకునేందుకు భారత్ సిద్ధమని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పునరుద్ఘాటించారు. దీనిపై గతేడాది ఫిబ్రవరి 13 నుంచి ఇరుదేశాలు చర్చలు జరుపుతున్నాయని, కొన్నిసార్లు ఒప్పందం ఖరారు దశ దాకా చేరామని ఆయన తెలిపారు. ఈ చర్చలకు తప్పుడు వ్యాఖ్యానాన్ని జోడిస్తూ దుష్ప్రచారం జరిగిందన్నారు. శుక్రవారం రోజు ఢిల్లీలో భారత విదేశాంగ శాఖ వారాంతపు మీడియా సమావేశంలో ఈ వివరాలను రణధీర్ జైస్వాల్ చెప్పారు. సమతూకంగా, పరస్పర ప్రయోజనకరంగా ఉండే వాణిజ్య ఒప్పందం కోసం గత ఏడాది కాలంగా వివిధ విడతల్లో అమెరికా, భారత్ సంప్రదింపులు జరుపుతున్నాయని ఆయన పేర్కొన్నారు. దీర్ఘకాలిక అనుబంధాన్ని కలిగిన భారత్, అమెరికా ఆర్థిక వ్యవస్థల మధ్య వీలైనంత త్వరగా ట్రేడ్ డీల్ జరగాలని కోరుకుంటున్నట్లు రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై అమెరికా అదనపు ఆంక్షలు విధించే బిల్లుపై తమకు అవగాహన ఉందని, ఈ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని తెలిపారు.

**మోడీ మౌనం వల్లే వాణిజ్య ఒప్పందం ఆలస్యం: లుట్నిక్**

భారత్-అమెరికా ట్రేడ్ డీల్ చర్చల వేళ అగ్రరాజ్య వాణిజ్య మంత్రి హొవార్డ్ లుట్నిక్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కార్యరూపం దాల్చకపోవడానికి విధానపరమైన అడ్డంకులు కారణం కాదన్నారు. తమ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని నరేంద్రమోడీ నేరుగా మాట్లాడేందుకు నిరాకరించడమే కారణమని వెల్లడించారు. 'మామూలుగా అయితే ఒప్పందం కొలిక్కి వచ్చింది. స్పష్టంగా చెప్పాలంటే.. ఇది ఆయన (ట్రంప్) ఒప్పందం. దానికి ముగింపు రావాలంటే.. ట్రంప్‌కు మోడీ కాల్ చేయాల్సి ఉంది. అయితే ఇది భారత ప్రభుత్వానికి రుచించలేదు. మోడీ చివరకు ఫోన్ చేయలేదు. మేము ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, వియత్నాంతో వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నాం. భారత్‌తో వాటికంటే ముందే ఒప్పందం జరుగుతుందని ఊహించాం. అలా జరగకపోవడంతో ఇంతకుముందు అంగీకరించిన వాణిజ్య ఒప్పందాన్ని అమెరికా వెనక్కి తీసుకుంది. దానిపై ఇప్పుడు మేం ఆలోచించడం లేదు. బ్రిటన్‌తో వాణిజ్య ఒప్పందం చర్చలు కొలిక్కి వస్తోన్న సమయంలో ఆ దేశ ప్రధాని కీర్‌స్టార్మర్ ట్రంప్‌నకు కాల్ చేశారు.

ఆ రోజే డీల్ ముగింపునకు వచ్చింది. తర్వాతి రోజు మీడియా సమావేశంలో దాని గురించి ఇరువురు నేతలు ప్రకటించారు' అంటూ భారత్, బ్రిటన్ మధ్య పోలిక తెచ్చారు.

మోడీ ఫోన్ చేయడానికి నిరాకరించినప్పటికీ.. ఇంకా ఫోన్ చేయడానికి అవకాశం ఉందని లుట్నిక్ ఓ ఇంటర్వ్యూలో వ్యాఖ్యలు చేయడం

## భారత్‌కు వెనిజులా చమురు!

రష్యా నుంచి చమురు కొనుగోలు తగ్గించుకోవాలని భారత్‌పై అమెరికా ఒత్తిడి తీసుకువస్తోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత్‌కు వెనిజులా చమురు విక్రయించడానికి ట్రంప్ యంత్రాంగం సిద్ధమవుతోన్నట్లు తెలుస్తోంది. అమెరికా నియంత్రణలో ఉన్న కొత్త చట్టం కింద భారత్‌కు చమురును విక్రయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వైట్‌హౌస్ అధికార వర్గాలు వెల్లడించాయి. వెనిజులా నుంచి అమెరికాకు 30-50 మిలియన్ బ్యారెళ్ల చమురును అప్పగించనున్న నేపథ్యంలో దానిని ప్రపంచ దేశాలకు విక్రయించాలని అమెరికా యోచిస్తోందని.. అందులోభాగంగా భారత్‌కు కూడా చమురును అమ్మడానికి సిద్ధంగా ఉందని తెలిపాయి. వెనిజులా చమురుపై యుఎస్ రిఫైనరీలే కాకుండా ప్రపంచ దేశాలు కూడా ఆసక్తి చూపిస్తున్నాయని పేర్కొన్నాయి. వెనిజులాలోని తాత్కాలిక అధికారులు అధిక నాణ్యత గత 30-50 మిలియన్ బ్యారెళ్ల చమురును యుఎస్‌కు అప్పగించనున్నట్లు ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఈ వార్తలు రావడం గమనార్హం. వెనిజులా నుంచి సేకరించిన చమురును మార్కెట్ ధరకే విక్రయిస్తామని.. ఆ డబ్బు తమ నియంత్రణలోనే ఉంటుందని ఆయన తెలిపారు. ఆ డబ్బును వెనిజులా, అమెరికా ప్రజల ప్రయోజనాల కోసం ఉపయోగిస్తామన్నారు. ఈ ప్రణాళికను తక్షణమే అమలు చేయాలని ఇంధన కార్యదర్శి క్రిస్ రైట్‌కు తాను ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. చమురు నిల్వలను నౌకల ద్వారా రవాణా చేసి.. నేరుగా అమెరికా ఓడరేవులలో దించనున్నట్లు వెల్లడించారు.

# 'ఐప్యాక్' ఆఫీస్‌లో ఇడి సోదాలు - సిఎం మమత మెగా ర్యాలీ

**కోల్‌కతా, జనవరి 9:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ శుక్రవారం భారీ స్థాయిలో ఆందోళనను చేపట్టారు. ఆమె నాయకత్వంలో జరిగిన ఈ మెగా ర్యాలీలో మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కోల్‌కతాలో ఐప్యాక్ చీఫ్ ప్రతీక్ జైన్ సహా ఆ సంస్థ కార్యాలయాలపై నిన్న ఇడి దాడులను నిరసిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా కార్యాలయం బయట తృణమూల్ ఎంపిలు ఇప్పటికే నిరసన చేపట్టిన సంగతి తెలిసిందే. కోల్‌కతాలోని సాల్ట్‌లేక్ ప్రాంతంలో ఉన్న ఐ ప్యాక్ కార్యాలయంలో ఢిల్లీ లోని నాలుగుచోట్ల ఇడి సోదాలు చేసింది. కొన్ని హవాలా లావాదేవీలు, నగదు వ్యవహారాలు ప్రతీక్ జైన్ ద్వారా జరిగినట్లు నిర్దిష్ట ఆధారాలు ఉన్నాయని ఇడి చెబుతోంది. బొగ్గు స్మగ్లింగ్ రాకెట్‌తో సంబంధం ఉన్న ఒక హవాలా ఆపరేటర్ ద్వారా ఐప్యాక్‌కు చెందిన ఇండియన్ పిఎసి కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ.కోట్లలో లావాదేవీలు జరిగాయని ఇడి వర్గాలు వెల్లడించాయి. సోదాల గురించి తెలిసిన వెంటనే జైన్ నివాసానికి మమత హుటాహుటిన చేరుకున్నారు. రాజకీయ దురుద్దేశంతోనే ఈ సోదాలు జరిగాయని, ఇవి రాజ్యాంగ విరుద్ధమని దీదీ మండిపడ్డారు. మా పార్టీ పత్రాలను, హార్డ్‌డిస్క్‌లను ఇడి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల సమాచారం కూడా ఉంది. అందుకే వాటిని నేను వెనక్కి తెచ్చేశాను అని మమత తెలిపారు. అయితే చట్టపరమైన దర్యాప్తును మమత అడ్డుకున్నారని, ఆమెతో కలిసి రాష్ట్ర పోలీసులు కీలక ఆధారాలను బలవంతంగా తీసుకుపోయారని ఢిల్లీలోని ఇడి కార్యాలయం ఆరోపించింది. ఈ పరిణామాలపై ఇరు వర్గాలు కోర్టును ఆశ్రయించాయి. ఈ వ్యవహారంలో తక్షణ విచారణ చేపట్టాలని కోల్‌కతా హైకోర్టును ఇడి కోరింది. అయితే దీనిపై న్యాయస్థానం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. చట్టబద్ధమైన పాలనకు బెంగాల్ అతీతమని మమత చూపించే ప్రయత్నం చేస్తున్నారని బిజెపి విమర్శించింది.



ప్రతి ఎన్నిక ముందు ఆమె ఇలాంటి డ్రామాలే చేస్తుంటారని ఎద్దేవా చేసింది. ఈ ర్యాలీని ముందే ఊహించామని పేర్కొంది.

# అమిత్‌షా ఆఫీసు ముందు టిఎంసి ఎంపిల ధర్నా



**న్యూఢిల్లీ, జనవరి 9:** కేంద్ర హోంమంత్రి అమిత్ షా కార్యాలయం ఎదుట తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు నిరసనకు దిగారు. మహువా మొయిత్రా, శతాబ్ది రాయ్, కీర్తి ఆజాద్, డెరెక్ ఓబ్రియన్ తదితరులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. కోల్‌కతాలోని ఐప్యాక్ కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నిర్వహించిన సోదాలకు వ్యతిరేకంగా ఈ నిరసన చేపట్టారు. రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈడీని ఆయుధంగా మారుస్తోందని తృణమూల్ నేతలు ఈ సందర్భంగా ఆరోపించారు. బెంగాల్‌లో ఓటమిని జీర్ణించుకోలేకే బీజేపీ ఇటువంటి సోదాలు చేయిస్తోందని విమర్శించారు. అమిత్ షా ఆదేశాల మేరకే ఈడీ పనిచేస్తోందని నినాదాలు చేశారు. నిరసన ఉధృతంగా మారడంతో పోలీసులు ఎంపీలను అక్కడి నుంచి బలవంతంగా తరలించారు. తాము పూర్తిగా శాంతియుతంగా ఆందోళన చేపట్టామని, అయినా పోలీసుల తీరు దురుసుగా ఉందని మహువా మొయిత్రా, డెరెక్ ఓబ్రియన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసనలకు కూడా చోటు లేకుండా చేస్తున్నారని వారు అన్నారు. ఈ పరిణామాలపై తృణమూల్ నేత అభిషేక్ బెనర్జీ ఎక్స్ వేదికగా స్పందించారు. నేరగాళ్లకు రివార్డులు, అత్యాచార నిందితులకు బెయిల్ ఇస్తూ, నిరసన వ్యక్తం చేసిన వారిని జైలుకు పంపే విధానం బీజేపీ పాలనలో కొనసాగుతోందని విమర్శించారు. దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుతూ ఎన్నికలను ప్రభావితం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విధానాలను బెంగాల్ ప్రజలు అంగీకరించరని, బీజేపీని ఓడించేందుకు తాము శక్తిమేర కృషి చేస్తామని ఆయన అన్నారు.

# వాతావరణ మార్పులతో వేడెక్కుతున్న మహాసముద్రాలు

**న్యూయార్కు, జనవరి 9:** వాతావరణ కాలుష్యంలో సంభవిస్తున్న పెను మార్పుల కారణంగా ప్రపంచదేశాల చుట్టూ ఉన్న మహాసముద్రాలు గత ఏడాది రికార్డు స్థాయిలో వేడెక్కాయి. ఆధునిక పద్ధతుల్లో రికార్డులను నమోదు చేయడం ప్రారంభించినప్పటి నుంచి ఇదే అత్యధికమని శుక్రవారం విడుదలైన ఒక అంతర్జాతీయ అధ్యయనం వెల్లడించింది. అడ్వాన్సెస్ ఇన్ అట్మాస్ఫియరిక్ సైన్సెస్ అనే జర్నల్‌లో ప్రచురితమైన ఈ నివేదిక, సముద్ర గర్భంలో పెరిగిన ఉష్ణం పెను ప్రమాదాలకు సంకేతమని హెచ్చరించింది. ప్రపంచవ్యాప్తంగా 31 పరిశోధనా సంస్థలకు చెందిన 50 మందికి పైగా శాస్త్రవేత్తలు ఈ అధ్యయనంలో పాల్గొన్నారు. వారి విశ్లేషణ ప్రకారం గతేడాది సముద్రాలు గ్రహించిన ఉష్ణం ఏకంగా 23 జెట్టా జౌల్స్‌గా నమోదైంది. 2023 వరకు 37 ఏళ్ల పాటు ప్రపంచం వినియోగించిన విద్యుచ్ఛక్తితో సమానం. సముద్ర ఉపరితలం నుంచి 2,000 మీటర్ల లోతు వరకు ఉష్ణోగ్రతలు చరిత్రలో ఎన్నడూ లేనంత గరిష్ఠ స్థాయికి చేరాయని పరిశోధకులు నిర్ధారించారు. ముఖ్యంగా అట్లాంటిక్, నార్త్ పసిఫిక్, దక్షిణ మహాసముద్ర ప్రాంతాల్లో ఈ వేడి అత్యంత వేగంగా పెరిగింది. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత 2025లో మూడో అత్యధికంగా నమోదైంది. ఈ అధిక ఉష్ణోగ్రతలు భూమిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. సముద్రపు నీరు ఎక్కువగా ఆవిరై, వాతావరణంలో తేమ పెరగడానికి ఇది కారణమవుతోంది. దీని ఫలితంగా ఆగ్నేయాసియా, మెక్సికోలలో భారీ వరదలు, మధ్యప్రాచ్యంలో తీవ్ర కరవు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయని శాస్త్రవేత్తలు తెలిపారు. సముద్రాలు ఇలా వేడెక్కడం వల్ల నీరు వ్యాకోచించి సముద్ర మట్టాలు పెరుగుతాయని, తుపానులు మరింత బలపడతాయని వారు హెచ్చరించారు. భూమిపై వేడి తగ్గేంత వరకు సముద్ర ఉష్ణోగ్రతలు ఇలాగే రికార్డులు సృష్టిస్తూనే ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు.

## సంక్షిప్తంగా..

### ఊగిసలాడుతోన్న విదేశాంగ విధానం : ఖర్గే



**న్యూఢిల్లీ, జనవరి 9:** ప్రధాని నరేంద్రమోడీ సర్కారు విదేశాంగ విధానం ఊగిసలాడుతోందని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. విదేశాంగ విధానంలో స్థిరత్వం లేకపోవడం వల్ల దేశ ప్రజలు మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తోందని ఆయన మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ కాంట్రాక్టుల కోసం చైనా కంపెనీలు బిడ్స్ దాఖలు చేయకుండా ఐదేళ్ల క్రితం అమలులోకి తెచ్చిన పరిమితులను తొలగించాలనే కేంద్రం యోచనను ఖర్గే తప్పుపట్టారు. ఈ మేరకు శుక్రవారం ఎక్స్ వేదికగా ఓ ట్వీట్ చేశారు. 'దేశాన్ని తలవంచనివ్వను' అని ప్రధాని మోడీ చెప్పగా, ప్రస్తుత పరిస్థితి అందుకు పూర్తిగా భిన్నంగా కనిపిస్తోందని మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. రెండు తాజా ఉదాహరణలను చూస్తే, చైనా కంపెనీలకు భారత ప్రభుత్వ కాంట్రాక్టుల కేటాయింపుపై ఐదేళ్లుగా ఉన్న నిషేధాన్ని ఎత్తివేసే యత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

### శబరిమల ఆలయ ప్రధాన పూజారి అరెస్టు



**తిరువనంతపురం, జనవరి 9:** శబరిమల బంగారం తాపడాల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. శబరిమల తంత్రి కందరారు రాజీవరును సిట్ అధికారులు అరెస్టు చేశారు. అధికారిక వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో సిట్ అధికారుల బృందం ఆయన్ను అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం అరెస్టు చేసినట్లు సమాచారం. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఉన్నికృష్ణన్‌పొట్టితో రాజీవరుకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు గుర్తించిన సిట్ అధికారులు బంగారు తాపడాల చోరీ కేసులో ఆయన పాత్ర కూడా ఉన్నట్లు విచారణలో తేలడంతో అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. ఉన్ని కృష్ణన్ పొట్టిని శబరిమలకు తీసుకువచ్చింది కూడా తంత్రి కందరారు రాజీవరేనని ఇతర నిందితులు తమ వాంగ్మూలంలో పేర్కొన్నట్లు అధికారులు వెల్లడించారు.

### బ్రిటన్ బయలుదేరిన విమానాలు దారిమళ్లింపు

**న్యూఢిల్లీ, జనవరి 9:** బ్రిటన్ బయలుదేరిన రెండు ఎయిర్ ఇండియా విమానాలు దారి మళ్లాయి. ప్రతికూల వాతావరణం కారణంగా బ్రిటన్‌లోని వేర్వేరు ఎయిర్‌పోర్టుల్లో అవి ల్యాండ్ అయ్యాయి. ఎయిర్ ఇండియా సంస్థ ఈ విషయాన్ని వెల్లడించింది. గతేడాది డిసెంబరు 8న ముంబై నుంచి లండన్‌లోని హీత్రూకు ఎయిర్ ఇండియా విమానం బయలుదేరింది. ప్రతికూల వాతావరణం కారణంగా హీత్రూ ఎయిర్‌పోర్ట్‌పై ఆ విమానం చక్కర్లు కొట్టింది. చివరకు ఆ విమానం దారి మళ్లింది. లండన్‌లోని గాట్విక్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయ్యింది. అదే రోజున పంజాబ్‌లోని అమృత్‌సర్ నుంచి బ్రిటన్‌లోని బర్మింగ్‌హామ్‌కు మరో ఎయిర్ ఇండియా విమానం బయలుదేరింది. అయితే ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా బర్మింగ్‌హామ్ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ కాలేకపోయింది. గాలిలో రౌండ్లు కొట్టిన ఆ విమానాన్ని చివరకు లండన్‌లోని హీత్రూకు మళ్లించారు. ఆ ఎయిర్‌పోర్ట్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల ఆ రెండు విమానాలు గమ్యస్థానాలు మారినట్లు ఎయిర్ ఇండియా పేర్కొంది.

### పశ్చిమ బెంగాల్ గవర్నర్‌కు బెదరింపులు



**కోల్‌కతా, జనవరి 9:** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రైడ్స్‌పై హై డ్రామా తర్వాత పశ్చిమ బెంగాల్ గవర్నవర్ సీవీ ఆనంద బోస్‌కు బెదిరింపు ఈమెయిల్ వచ్చింది. ఆయనను పేల్చివేస్తామని అందులో బెదిరించారు. దీంతో గవర్నర్ కార్యాలయం, అధికారిక నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. గవర్నర్ బోస్‌కు వచ్చిన బెదిరింపు ఈమెయిల్ గురించి కేంద్ర మంత్రి అమిత్ షా ఆధ్వర్యంలోని హోం మంత్రిత్వ శాఖకు సమాచారం అందించారు. బొగ్గు అక్రమ రవాణా కేసుకు సంబంధించి అధికార టీఎంసీ రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ ఐ ప్యాక్ కార్యాలయంపై ఈడీ అధికారులు గురువారం రైడ్ చేశారు. దీంతో టీఎంసీ కార్యకర్తలు వారిని అడ్డుకున్నారు. సీఎం మమతా బెనర్జీ వెంటనే అక్కడకు చేరుకున్నారు. ఆమె పార్టీకి సంబంధించిన కీలక ఫైల్‌ను తీసుకెళ్లారు. తమ రాజకీయ వ్యూహాలను కొల్లగొట్టేందుకు బీజేపీ ప్రయత్నించినట్లు మమతా బెనర్జీ ఆరోపించారు.

# నెహ్రూ అంటే ఎంతో గౌరవం..ఆయన విధానాలు పూర్తిగా ఏకీభవించలేను:కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్

**తిరువనంతపురం, జనవరి 9:** భారత తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ అంటే తనకు ఎంతో గౌరవం ఉందని, దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలంగా నాటారని చెప్పిన కాంగ్రెస్ సీనియర్‌నేత శశిథరూర్ ఆయన విధానాలని గుడ్డిగా సమర్థించనని వ్యాఖ్యానించారు. కేరళలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ థరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. నెహ్రూ తీసుకున్న నిర్ణయాలు ప్రశంసలకు అర్హమైనవని పేర్కొన్నారు. 1962లో చైనా విషయంలో ఆయన తీసుకున్న నిర్ణయాల్లో తప్పులు ఉన్నాయన్నారు. దాని సాకుగా బీజేపీ ప్రభుత్వం తమకు అనుకూలంగా ఆయన పేరును దుర్వినియోగం చేయడం సరికాదన్నారు. దేశంలోని సమస్యలన్నింటికీ ఆయనను మాత్రమే నిందించడం అన్యాయమని పేర్కొన్నారు. సమస్య ఏదైనా.. ప్రతిదానికీ నెహ్రూ పైనే విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. నేను నెహ్రూ అభిమానిని. ఆయన్ని ఆరాధిస్తాను. ఆయన పట్ల నాకు చాలా గౌరవం ఉంది. అలా అని ఆయన నమ్మకాలు, విధానాలన్నింటినీ నేను వంద శాతం సమర్థించను. నెహ్రూ తీసుకున్న నిర్ణయాలు ప్రశంసలకు అర్హమైనవే. ముఖ్యంగా భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని చాలా దృఢంగా నెలకొల్పారు. అలా అని వారు మోదీ ప్రభుత్వాన్ని ఉద్దేశించి ప్రజాస్వామ్య వ్యతిరేకులని నేను అనను. వారు ఖచ్చితంగా నెహ్రూ వ్యతిరేకులు. తమకు అను కూలంగా ఆయన పేరును దుర్వినియోగం చేస్తున్నారు.

# తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాలో రాజీ లేదు

## నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**కోదాడ, జనవరి 9, ప్రభాతవార్త:** తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాలో రాజీ పడేది లేదని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కోదాడ పట్టణం లో శుక్రవారం రూ.08 కోట్లతో నిర్మిస్తున్న ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ డివిజన్ కార్యాలయం,రూ 04 కోట్లతో నిర్మిస్తున్న కోర్టు భవనం, రూ 5.10 కోట్లతో నిర్మిస్తున్న ఇరిగేషన్ డివిజన్ కార్యాలయం పనుల పురోగతిని ఆయన స్థానిక ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి తో కలిసి పరిశీలించి పనులు నాణ్యత తో నిర్మిస్తూ, వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్




కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణా నది నీటి పంపకాల్లో గత ప్రభుత్వం తెలంగాణ కు 34 (299 టి ఎం సి లు ), ఆంధ్రకు 66 (512 టి ఎం సి లు) ఒప్పందం చేసుకోవటం వల్ల ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాలు నష్టపోయాయని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజు నుండి కృష్ణ జలాలో 71 తెలంగాణ కు దక్కేలా పోరాడుతున్నామని, గత ప్రభుత్వం 10 సంవత్సరాలలో 17 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్లో నీటి పారుదల రంగానికి 1.83 లక్షల కోట్ల కేటాయించినప్పటికి కృష్ణా నది పై తలపెట్టిన పాలమూరు రంగారెడ్డి, కల్వకుర్తి, భీమా, నెట్టెం పాడు, కొడంగల్ నారాయణపేట, డిండి, ఎస్ ఎల్ బి సి ప్రాజెక్ట్ లు పూర్తి చేయలేదని, కాంగ్రెస్ అధికారం లోకి వచ్చిన తర్వాత అన్ని ప్రాజెక్ట్ లు వేగవంతం గా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వచ్చే మూడు సంవత్సరాల్లో కృష్ణా నదిపై నిర్మాణం లో ఉన్న అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల నష్టపోయిన కృష్ణ, గోదావరి జలాల్లో తెలంగాణ కు దక్కాలసిన వాటా లో ఒక్క నీటి చుక్కను కూడా వదులుకోబోమని, వాటా కోసం సుప్రీం కోర్ట్, కేంద్ర ప్రభుత్వం, కేంద్ర జల సంఘం, నది ట్రెబ్యూనల్స్ ముందు బలమైన వాదనలు వినిపించి సాధిస్తామన్నారు. కోదాడ నియోజకవర్గం లో నిర్మిస్తున్న రెడ్ల కుంట లిఫ్ట్ ఇరిగేషన్, శాంతినగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ లు వేగవంతంగా పూర్తి చేయాలని, పాలేరు వాగుపై చెక్ డాం, పాలవరం లిఫ్ట్ ఇరిగేషన్ కు, నడిగూడెంలోని చౌదరి చెరువు వద్ద బ్రిడ్జి నిర్మాణం కొరకు ప్రతిపాదనలు పంపాలని, చిలుకూరు వద్ద ముత్యాల బ్రాంచ్ కెనాల్ పై డబుల్ బ్రిడ్జ్,పాలే అన్నారంలో బ్రిడ్జ్ పనులు త్వరగా ప్రారంభించి ఎండాకాలం చివరి నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# ఉన్నత విద్యలో అంతర్జాతీయ ప్రమాణాలే లక్ష్యం

### తెలంగాణ ఉన్నత విద్యామండలి 2026 డైరీ, క్యాలెండర్ విడుదల

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్నత విద్యలో అంతర్జాతీయ ప్రమాణాలే లక్ష్యంగా పనిచేయనున్నట్టు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి తెలిపారు. మార్కెట్‌లో ఉన్న అవసరాల మేరకు కొత్త సిలబస్‌ను రూపొందించి.. తెలంగాణ విద్యార్థులను అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా చేయనున్నట్టు తెలిపారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి రూపొందించిన 2026 సంవత్సరపు డైరీ, క్యాలెండర్‌ను ఆయన శుక్రవారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది సమక్షంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్-1 ప్రొఫెసర్ ఈ పురుషోత్తం, వైస్ ఛైర్మన్-2 ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్‌తోపాటు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. గత ఏడాది భారత రత్నాలు, ఈ ఏడాది విశ్వ విద్యావేత్తలను గౌరవించుకోవాలని భావించినట్టు తెలిపారు. గత సంవత్సరం (2025) క్యాలెండర్‌లో దేశానికి చెందిన మహనీయులైన సావిత్రీబాయి ఫూలే, డా. జాకిర్ హుస్సేన్, చాణక్యుడు, గౌతమ బుద్ధుడు, గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్, స్వామి వివేకానంద, సర్వేపల్లి రాధాకృష్ణన్, మదర్ థెరిస్సా, గిజుభాయ్ బధేకా, ఏపీజే అబ్దుల్ కలాం, పండిట్ మదన్ మోహన్ మాలవ్య, కైలాష్ సత్యార్థి వంటి ప్రముఖులను గౌరవించినట్లు తెలిపారు. ఈ ఏడాది విద్య వ్యాప్తి, శాస్త్రీయ దృక్పథం, మానవ హక్కులు, హేతువాదాన్ని పెంపొందించడంలో వారి కృషిని దృష్టిలో ఉంచుకుని ఆ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఈ ఏడాది ఉన్నత విద్యపై విస్తృత చర్చకు శ్రీకారం చుట్టనున్నట్టు తెలిపారు. అందులో భాగంగానే 2026 క్యాలెండర్ ఒక విభిన్నమైన లక్ష్యంతో రూపొందించబడిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా జ్ఞానం, సమాచారం యొక్క వ్యాప్తి, ప్రజాస్వామ్యీకరణలో అత్యంత ముఖ్యమైన పాత్ర పోషించిన మేధావులు, పండితులు, క్రియాశీలుల ద్వారా ..ఉన్నత విద్యపై చర్చను మరింత ముందుకు తీసుకుపోవాలని మండలి సంకల్పించిందన్నారు. ఈ మహనీయులు.. సామాజికనైతిక విలువలు, విమర్శనాత్మక ఆలోచన, మేధోపరమైన పరిశోధన, విద్యార్థుల పట్ల మానవీయత, నిరంతర అభ్యాసం, తరగతి గదిలో ప్రజాస్వామ్యం, సమస్య పరిష్కార పద్ధతులు, విద్యార్థికేంద్రీకృత విధానాలు, అనుభవపూర్వక అభ్యాసం, ఉపాధ్యాయ శిక్షణ, విభిన్నత (డైవర్సిటీ), సిలబస్‌లో ప్రపంచ దృక్పథాలను పొందుపరచడంలో విశేష సేవలందించారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో 2026 క్యాలెండర్‌లో ప్రముఖ విద్యావేత్తలు.. కన్ఫ్యూషియస్, సోక్రటీస్, క్వింటిలియన్, మిషెల్ డి మోంటైన్, జాన్ లాక్, మేరీ వోల్‌స్టోన్‌క్రాఫ్ట్, హోరేస్ మాన్, జాన్ డ్యూయీ, డైసాకు ఇకెడా, సేమోర్ ఆబ్రే పాపర్ట్, న్గూగీ వా తియోంగో, హోమీ కె భాభా సేవలను గుర్తుచేసుకోనున్నట్టు బాలకిష్టా రెడ్డి తెలిపారు.



డా.చిన్నారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేస్తున్న బాధిత డ్రైవర్ సాయికుమార్ భార్య శైలజ.

# సౌదీ జైలులోని నా భర్తను విడిపించండి

### సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి డా.చిన్నారెడ్డికి బాధితుడి భార్య వినతి

**హైదరాబాద్ (బేగంపేట) జనవరి 9, ప్రభాతవార్త:** సౌదీలో డ్రైవర్‌గా విధులు నిర్వ హిస్తున్న తన భర్త మంగలారం సాయికుమార్‌ను అక్కడి పోలీసులు అరెస్ట్ చేసి జైలులో బంధించారని, తన భర్తను విడిపించి స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన మంగ లారం శైలజ శుక్రవారం మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి డా.జి.చిన్నారెడ్డికి విజ్ఞప్తి చేసారు. స్పందించిన చిన్నారెడ్డి సౌదీలోని ఎంబసీ అధికారులతో మాట్లాడి సాయికుమార్ విడుదల కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ముఖ్యకార్యదర్శి శేషాద్రికి సూచించారు.

# మేకలు, గొర్రెల రక్తం మాఫియాపై ఎఫ్ఐఆర్ నమోదు

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన బతికివున్న మేకలు, గొర్రెల నుంచి రక్తం సేకరణ వ్యవహారంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించి కఠిన చర్యలకు ఆదేశించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో మేకలు, గొర్రెల నుం చి సేకరించిన రక్తాన్ని వ్యాపార నిమిత్తం కొనుగోలు చేసిన కాచిగూడలోని సిఎన్‌కె ఇంపోర్ట్స్, ఎక్స్‌పోర్ట్స్ అనే సంస్థను జప్తు చేసి వెయ్యి లీటర్ల మేక లు, గొర్రెల రక్తం ప్యాకెట్లను జప్తు చేయడం విదితమే. ఈ రక్తాన్ని హరియాణలోని పోలి మెడిక్యూర్ అనే ల్యాబ్‌కు పంపుతున్నట్లు తేలింది. ఈ ఘ టనలో ఇప్పటి వరకు కీసరలోని సోను మటన్ షాపు యజమాని సోను సుందర్‌తో పాటు నకిలీ వెటర్నరీ వైద్యుడు సంజయ్‌లను అరెస్టు చేశారు. సిఎన్‌కె ఇంపోర్ట్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీ నిర్వాహకుడు నికేష్ కోసం గాలిస్తున్నారు. తాజాగా ఇదే ఘటనపై సోను మటన్ షాపుపై బిఎన్ఎస్ 223 తో పాటు ప్రివెన్షన్ ఆఫ్ క్రూయాల్టీ ఆఫ్ ఎనిమల్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. కాగా మేరకలు, గొర్రెల రక్తాన్ని హరియాణాలోని ల్యాబ్‌లో ఏం చేస్తారనేదానిపై డ్రగ్స్ కంట్రోల్ విభాగంతో పాటు పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ ఘటనలో వీరితో పాటు ఇంకా ఎవరిదైనా పాత్ర వుం దా...? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

# దేశవ్యాప్తంగా టిజిసిఎస్‌బి దాడులు

### 34 మంది సైబర్, సిఎస్ఇఎం నేరగాళ్ల అరెస్టు

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) మరోమారు దేశ వ్యాప్తంగా దాడులు నిర్వహించి 34 మ ంది కరుడుగట్టిన సైబర్ నేరగాళ్లతో పాటు బాలలపై లైంగిక హింస కు సంబంధించిన పుస్తకాలు, వీడియోలు (సిఎస్ఈఎం) పంపిణీ చేస్తున్న నేర గాళ్లను అరెస్టు చేసింది. ఇందులో 24 మంది నేరగాళ్లు సిఎస్ఈఎంకు సంబంధించి పలుమార్లు అరెస్టయ్యారు. దీనికి సంబంధించిన వివరాలను టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ శుక్రవారం మీడియాకు తెలిపారు. వీరిని పట్టుకునేందు కు టిజిసిఎస్‌బి మొత్తం 18 బృందాలను ఆయా రాష్ట్రాల కు పంపి దాడులు నిర్వహించింది. సైబర్ నేరగా ళ్లలో మ్యూల్ ఖాతాలు అందించిన వారున్నారు. తెలంగాణలో బాలల రక్షణ విభాగం సిఎస్ఈఎం నేరాల పై ఉక్కుపాదం మోపుతోంది. బాలలపై లైంగిక హింస, దాడికి సంబంధించిన వీడియోలు, పుస్తకాలను కొందరు చాటుమాటుగా అమ్ముతుండడంపై ఈ విభాగం కఠినంగా వ్యవహరిస్తూ పదుల సంఖ్యలో నేరగా ళ్లను అరెస్టు చేసింది. ఈ తరహా ఘటనలపై ఇప్పటి వరకు 278 మందిని అరెస్టు చేయగా ఆరు వేలకు పైగా ఫిర్యాదులపై నిఘా వుంచింది. రెండు చోట్ల మైనర్ బాలికలను ఈ విభాగం కాపాడింది. ఈ ఘటనల్లో ఇద్దరు నే రగాళ్లను అరెస్టు చేసింది. ఇక సైబర్ నేరగాళ్లపై ఉక్కుపాదం మోపుతున్న టిజిసిఎస్‌బి గత ఏడాది 1689 మంది నేరగాళ్లను అరెస్టు చేసింది. స్పెషల్ ఆపరేషన్ల ద్వారా 167 మందిని అరెస్టు చేసింది. ఈ దాడులు నిర్వహించిన పోలీసు అధికారుల బృందాన్ని టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ అ భినందించారు. కాగా దేశ వ్యాప్తంగా కరుడుగట్టిన సైబర్ నేరగాళ్లతో పాటు సిఎస్ఈఎం నేరగాళ్లను అరెస్టు చేసిన టిజిసిఎస్‌బి విభాగం పోలీసుల ను డిజిపి శివధర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.



జెన్‌కో సిఎండికి వినతిపత్రం ఇస్తున్న సాయిబాబా, రత్నాకర్‌రావు, భూపాల్‌రెడ్డి, సదానందం, ఈశ్వర్‌గౌడ్ తదితరులు

# వైటిపిఎస్ ఆపరేషన్-మెయింటెనెన్స్ ప్రైవేట్‌పరం చేయొద్దు

### జెన్‌కోలోని ఇంజినీర్లు, కార్మికుల సేవలనే వినియోగించుకోవాలి

### సిఎండి హరీశ్‌కు తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జెఎసి వినతి

**హైదరాబాద్,జనవరి 9,ప్రభాతవార్త:** యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటిపిఎస్) ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌ను ప్రైవేట్ పరం చేయొద్దని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ టిజిజెన్‌కో సిఎండీ హరీష్‌ని కోరింది. ఈమేరకు శుక్రవారం జేఏసీ చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్ రావు, భూపాల్ రెడ్డి, తాజుద్దీన్ బాబాల ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం సిఎండిని కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (3800 ఎండబ్ల్యూ) స్టేజ్- 2ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ నీ ప్రైవేట్ కంపెనీకి అప్పగించాలని చూస్తున్నారని దీన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. తెలంగాణ జెన్‌కోలో అనభవం కలిగిన ఇంజనీర్లు, కార్మికులు ఎంతోమంది ఉన్నారని వారితోనే ప్లాంట్ నడపాలని కోరారు. గతంలో కెటిపిఎస్ స్టేజ్ 7ను సైతం నిర్ణీత సమయంలో 48నెలల్లో నిర్మించి నడిపించిన అనుభవం జెన్‌కో ఇంజినీర్లు, కార్మికులకు ఉందన్నారు. సదరు ప్రైవేట్ సంస్థకు డిజైన్, ఉత్పత్తి రంగంలో నైపుణ్యం ఉన్నా ఆపరేషన్ మెయింటెనెన్స్‌లో ఇంజినీర్లు లేరని తెలిపారు. సిఎండీని కలిసి వారిలో కలిసిన వారిలో ఈశ్వర్ గౌడ్, నెహ్రు, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు సదానందం, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి: జాజుల

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్‌సి, ఎస్టి, బిసి, మైనారిటీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలను విడుదల చేయకపోతే సంక్రాంతి పండుగ తరువాత సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. బిసి విద్యార్థి సంఘం జాతీయ కమిటీ రూపొందించిన 2026 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను శుక్రవారం హైదరాబాదులోని బిసి భవన్‌లో సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్ ఆధ్వర్యంలో శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థులకు పూర్తి ఫీజులు చెల్లిస్తున్న ప్రభుత్వం బిసి విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నదన్నారు. ఫీజుల రియంబర్స్‌మెంట్ బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకపోతే సంక్రాంతి పండుగ తర్వాత వేలాదిమంది విద్యార్థులతో సచివాలయాన్ని ముట్టడిస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు

# ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

### రాష్ట్రవ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకి ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) నుంచి మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఇప్పటికే ఆల్ ఇండియా జాక్టో ఏర్పడిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జిలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ (ఆల్ ఇండియా జాక్టో) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్‌కి మినహాయింపు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం, ఎన్‌సిటిఈ జోక్యం చేసుకుని సీనియర్ ఉపాధ్యా యుల ఉద్యోగాలకు రక్షణ కల్పించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, పాఠశాలల మూసివేత, విలీ నాన్ని నిలిపివేయాలని, జాతీయ విద్యా విధా నాన్ని (ఎన్ఈపి)ని సమీక్షించి ప్రభుత్వ విద్యకు నష్టం కలిగించే అంశాలను రద్దు చేయాలని శుక్రవారం రాష్ట్రంలో ఉపాధ్యాయులు.. సంఘాలకు అతీతంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

# తెలుగుభాషకు సొంతం అవధానం

### ప్రభుత్వ మాజీ సలహాదారు డా. కె.వి.రమణాచారి

### వైభవంగా ప్రారంభమైన రెండురోజుల ఉప్పలధడియం భరత్‌శర్మ శతావధానం




శతావధానాన్ని ప్రారంభించి ప్రసంగిస్తున్న రమణాచారి, రఘునాథశర్మ, దత్తాత్రేయశర్మ, శతావధానులు మురళి, అంజయ్య తదితరులు

**హైదరాబాద్ (నాంపల్లి), జనవరి 9, ప్రభాతవార్త :** తెలుగుజాతికి, తెలుగుభాషకు సొంపైన, సొంతమైనది అవధానం ప్రక్రియని తిరుమల తిరుపతి దేవస్థానం పూర్వ కార్యనిర్వహణాధికారి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. అవధానం అజరా మరం, అవధానాలతో శతావధానులు, సహస్రావధానులతో తెలుగునీల, తెలుగునేల జగత్ విదితం కావాలని, తెలుగునాట అవధాన ప్రక్రియ దినదిన ప్రవర్ధమానం కావాలని ఆయన ఆకాంక్షించారు. రవీంద్రభారతిలో 1995 ద్విశతావధానం కొత్తప్రక్రియను ఆనాటి ముఖ్యమంత్రి డా. నందమూరి తారక రామారావు ప్రారంభించారని, నాటినుండి అంచలంచలుగా శతావధానం, ద్విశతావధానం, సహస్రావధానం, ద్విసహస్రావధానం, పంచశాస్త్రావధానం ఒక దశాబ్దకాలం తెలుగునాట అవధానాలు నడిచాయని రమణాచారి గుర్తుచేశారు. శృంగేరి జగద్గురువుల దివ్యాశీసులతో వజ్రోత్సవ భారతి-శతావధాన సంక్రాంతి పేరున భారతీతీర్థ ప్రాంగణంగా నామకరణం చేసిన తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో దర్శనమ్ ఆధ్యాత్మిక మాసపత్రిక నిర్వహణలో శుక్రవారం ఉదయం 8గంటలకు రెండురోజులపాటు శతావధాని తిలక ఉప్పలధడియం భరత్‌శర్మ శతావధానం కన్నులపండువగా ప్రారంభమైంది. త్రిభాషా సహస్రావధాని బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ సంచాలకత్వంలో జరగనున్న ఈ శతావధానాన్ని ప్రభుత్వ మాజీ సలహాదారు డా. కె.వి. రమణా చారి, మహామహోపాధ్యాయ ఆచార్య శలాక రఘునాథశర్మ, అవధాన విద్యావికాస పరిషత్ నిర్వాహకడు మరుమాముల దత్తాత్రేయశర్మ, శతావధానులు ఆముదాల మురళి, ములగ అంజయ్య, దర్శనమ్ ఆధ్యాత్మిక మాసపత్రిక మరుమాముల వెంకటరమణశర్మ తదితరులు జ్యోతిప్రకాసనంచేసి శతావధానాన్ని ప్రారంభించి ప్రసంగించారు. శతావధానం అనేది ఒక మహా యజ్ఞం వంటిదని, దీనికి పూనుకున్న నిర్వాహ కులను ఎంతగానో అభినం దించారు. ఇలాంటి కార్యక్రమాల్లో యువత విధిగా పాల్గోవాలని సూచించారు. వీటికి ప్రభుత్వం తరఫున కావా ల్సిన సహకారం అందించడానికి వీలుగా తన శాయశక్తులా సంపూర్ణ ప్రయత్నం చేస్తానని హామీనిచ్చారు.

ఎం.వెంకటరమణశర్మ ప్రారంభోపన్యాసంలో ఉప్పలధడియం భరత్‌శర్మ 10వ తరగతి పూర్తికాగానే అవధానాలు చేయడం ఆరంభించి జగద్గురువుల అను గ్రహంతో ఉద్దండులకు సరితూగేస్థాయిలో నేడు శతావధానంతో రంజింప జేయనున్నట్లు తెలిపారు. సమస్య, దత్తపది, వర్ణన, ఆశువు అంశాలతో వంద మంది పృచ్ఛకులు వివిధ అంశాలపై సంధించిన ప్రశ్నలకు బ్రహ్మశ్రీ ఉప్పలధడియం భరత్‌శర్మ ఏకధాటిగా ఈ రెండురోజులపాటు సమాధానాలు చెప్పను న్నారని, రేపు సాయంత్రం శతావధాన విజయోత్సవ సభకు తిరుపతి శ్రీవేంకటేశ్వర వేదవిశ్వ విద్యాలయ డీన్ ఆచార్య గోలి వెంకట సుబ్రహ్మణ శర్మ, డా. కె.వి.రమణాచారి, శలాక రఘునాథశర్మ, ఉభయ తెలుగురాష్ట్రాల్లోని అష్టావ ధానులు, పండితులు, సాహితీవేత్తలు పాల్గొ నున్నారని పేర్కొన్నారు.

# బిఆర్ఎస్ హయాంలో పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి

### డిజిపి శివధర్‌రెడ్డికి సిపిఐ నాయకుల విజప్తి

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:** గత బిఆర్ఎస్ హయాంలో పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) తెలంగాణ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు డిజిపి శివధర్‌రెడ్డికి సిపిఐ నాయకులు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో చాడ వెంకటరెడ్డి, కోదండరాం, ఈటి నరసింహ, వామపక్ష పార్టీలు, ప్రజా సంఘం నాయకుల పైన పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిజిపి శివధర్ రెడ్డికి సిపిఐ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి నరసింహ, రాష్ట్ర సమితి సభ్యులు మారుపాక అనిల్ కుమార్ శుక్రవారం వినతి పత్రము సమర్పించారు. ఈ సందర్భంగా చాడా వెంకటరెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజాగొంతుకైన హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నాలు నిర్వహించవద్దని 2016లో హైదరాబాద్ శివారు బయట ప్రాంతాలలో నిరసనలు, ధర్నాలు చేపట్టాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఆ ఆదేశాలకు వ్యతిరేకంగా ఇందిరా పార్కు వద్దనే ధర్నాలు నిర్వహించుటకు, ధర్నాచౌక్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ధర్నాలు చేపట్టడం జరిగింది. చైర్మన్‌గా తాను, కో చైర్మన్‌గా పిఎల్. విశ్వేశ్వరరావు, కోదండరామ్, తమ్మినేని వీర భద్రం వంటి రాజకీయ ప్రముఖులు సభ్యులుగా ఉండి ఇందిరా పార్కు ధర్నాచౌక్ పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయంను వేదికగా ఏర్పాటు చేసుకొని సుమారు నెల రోజుల పాటు ఈ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నా చౌక్ పునరుద్ధరణ ధర్నాలు చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు.

అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు రోజువారీగా ధర్నాలు చేయడం జరిగిందని, ఇందిరాపార్కు ధర్నా చౌక్ పరిరక్షణ కమిటీ హైకోర్టులో ఇందిరాపార్కులో ధర్నాలు నిర్వహించుటకు అనుమతి ఇవ్వాలని తాను వేసిన పిటిషన్‌ను హైకోర్టు స్వీకరించిందని.. ధర్నాలు రిమోట్ ఏరియాలో ఎలా నిర్వహిస్తారు? ప్రజల గొంతును ప్రభుత్వానికి వినిపించేలా ఉండాలని, అది నగరం మధ్యలోనే ఉండాలని ఇందిరా పార్కులో ధర్నాలు చేపట్టాలని తీర్పునివ్వడం జరిగిందని తెలిపారు. కోర్టు తీర్పు అనంతరం ఇందిరాపార్కు అక్రమించడానికి అన్ని రాజకీయ పార్టీల మద్దతు అక్కూపై ధర్నా చౌక్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆనాటి ప్రభుత్వం తనతోపాటు, అనేక మందిపై కేసులు పెట్టడం జరిగిందన్నారు. అనంతర కాలంలో ఇదే ఇందిరాపార్కు వద్ద మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్, బిజెపి నాయకులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధర్నాలు కూడా నిర్వహించడం ప్రజాస్వామ్య విజయమన్నారు. కాబట్టి ఇందిరా పార్కు ధర్నా చౌక్ పునరుద్ధరణ ఉద్యమంలో పాల్గొన్న తనతో సహా వివిధ రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తల పైన నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరారు. డిజిపి శవధర్ రెడ్డి సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రితో చర్చించి అన్ని వామపక్ష ప్రజాసంఘ నాయకుల పైన ఉన్న కేసులను పరిశీలించి ఎత్తివేస్తామని తెలియజేశారని తెలిపారు.



# నియోజకవర్గ ఆడపడుచులకు ఎమ్మెల్యే సంక్రాంతి కానుక

### ఏడో యేడాది విజయవంతంగా చీరెల పంపిణీ

### ప్రజాసేవకే మా ప్రాధాన్యత: జిల్లా మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ

**నస్పూర్, జనవరి 9, ప్రభాతవార్త:** మంచిర్యాల నియోజకవర్గ ఆడబిడ్డలకు సంక్రాంతి పండుగ వేళ గొప్ప కానుక అందింది. కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆధ్వర్యంలో శుక్రవారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ కాలనీ ప్రగతి స్టేడియంలో చీరల పంపిణీ కార్యక్రమం వైభవంగా జరిగింది. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని శ్రీరాంపూర్ కాలనీ ప్రగతి స్టేడియం, కొత్త నాగార్జున కాలనీ ప్రాణహిత స్టేడియంలో స్థానిక మహిళలకు ఎమ్మెల్యే సతీమణి, జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఈ చీరలను అందజేశారు. ఈ సందర్భంగా కొక్కిరాల సురేఖ మాట్లాడుతూ.. 2018 సంవత్సరంలో ప్రారంభించిన ఈ చీరల పంపిణీ కార్యక్రమం ఈ ఏడాదితో విజయవంతంగా ఏడవ వసంతానికి చేరుకుందని తెలిపారు. గత బతుకమ్మ పండుగ సమయంలోనే ఈ చీరలను అందించాలని భావించినప్పటికీ, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అనారోగ్యానికి గురికావడంతో అది సాధ్యపడలేదని వివరించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం కుదుటపడటంతో, సంక్రాంతి పండుగ పురస్కరించుకుని తన అక్కచెల్లెళ్లకు ఈ కానుకలు అందజేయాలని ఆయన కోరినట్లు వెల్లడించారు. తాము అధికారంలో లేనప్పుడు కూడా ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని ఆమె గుర్తుచేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రేమ్ సాగర్ రావు కట్టుబడి ఉన్నారని, ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని సురేఖ పేర్కొన్నారు. ఇందులో భాగంగా మంచిర్యాల పట్టణంలో 320 కోట్ల రూపాయల వ్యయంతో 600 పడకల అత్యాధునిక ఆసుపత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. అలాగే లక్షెట్టిపేటలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల భవనాన్ని నిర్మించామని తెలిపారు. పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవాలనే తపనతోనే ప్రేమ్ సాగర్ రావు రాజకీయాల్లోకి వచ్చారని, ప్రజల సేవలో ఎప్పుడూ ముందుంటారని స్పష్టం చేశారు. ఆడబిడ్డలందరూ సంక్రాంతి వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని కోరుతూ అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా ప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రుణమాఫీ ఎగ్గొట్టిన ఘనత సిఎం రేవంత్‌రెడ్డిదే



విలేకరులతో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

### సిద్దిపేటకు వస్తే రైతులతో కలిసి నిలదీస్తాం
### అశోక్‌నగర్ సెంట్రల్ లైబ్రరీకి వెళ్లే దమ్ముందా?
### మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

**నంగునూర్, జనవరి 9, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తానని అన్ని దేవుళ్లపై ప్రమాణం చేసిన సిఎం రేవంత్‌రెడ్డి రైతులకు పూర్తిస్థాయిలో రుణ మాఫీ చేయకుండా మోసం చేశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మెటలోని అయిల్‌ఫామ్ ఫ్యాక్టరీని శుక్రవారం ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట నియోజక వర్గంలోనే 22వేల మంది రైతులకు రుణమాఫీ కాలేదని సిఎం రేవంత్‌రెడ్డి సిద్దిపేటకు వస్తే రైతులతో కలిసి ప్లకార్డులతో నిరసన తెలిపి నిలదీస్తామని హెచ్చరించారు. జిల్లాలో అయిల్‌ఫామ్ ఫ్యాక్టరీని నిర్మించడానికి 2021 మార్చిలో కేబినెట్ నిర్ణయం తీసుకుం దన్నారు. మాజీ సిఎం కెసిఆర్ కలలు నేడు నిజమైన సందర్భంగా సంతోషంగా ఉందన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలన వ్యవస్థ అస్తవ్యస్త మైందన్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు 12 గంటలు మించి రావడం లేదన్నారు.

**కత్తెర జేబులో పెట్టుకొని తిరుగుతున్న సిఎం**

సిఎం రేవంత్‌రెడ్డి కెసిఆర్ నిర్మించిన వాటిని కత్తెర జేబులో పెట్టుకొని తిరుగుతూ కత్తిరిస్తున్నాడే తప్ప కొత్తగా చేసిందేమిలేని హరీశ్‌రావు అన్నారు. సినిమా థియేటర్ ఓపెనింగ్ చేయడానికి సిఎం రేవంత్‌రెడ్డి అశోక్‌నగర్ వెళ్తున్నారని, అదే అశోక్ నగర్‌లోని సెంట్రల్ లైబ్రరీకి వెళ్లే దమ్ముందా అని ప్రశ్నించారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల మాట ఏమైందన్నారురు. సినిమా థియేటర్ ప్రారంభించడానికి వెళ్లడం కాదు అదే ఆశోక్‌నగర్ లైబ్రరీకి వెళ్లి నిరుద్యోగులతో మాట్లాడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీనాయకులు మాణిక్యరెడ్డి, కాముని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులెవరూ ఆందోళన చెందొద్దు

**త్వరలోనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం**

**నిరుద్యోగుల పట్ల బిఆర్ఎస్‌ది కపట ప్రేమ**

**రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 9:** నిరుద్యోగుల గురించి బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. పదేళ్ల కాలంలో వ్యవస్థలను నిర్వీర్యం చేసి, నిరుద్యోగుల జీవితాలను అంధకారం చేసిన మీరు.. ఇవాళ మొసలి కన్నీరు కారుస్తుంటే మిమ్మల్ని చూసి యావత్ తెలంగాణ సమాజం నవ్వుకుంటోందని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అశోక్ నగర్ లైబ్రరీ సాక్షి గా పదేళ్ల నిరుద్యోగులను వంచించిన చరిత్ర మీది కాదా...? నాడు నోటిఫికేషన్ల పేరుతో ఊరించి, పరీక్షల పేరుతో వేధించి, నిరుద్యోగుల యువతన్ని రోడ్ల పాలు చేసింది మీరు కాదా...? అని ప్రశ్నించారు. అధికారం పోగానే మీకు నిరుద్యోగులు గుర్తొచ్చారా...? రాజకీయం కోసం బురద చల్లడం మానేసి, మేము ఇచ్చిన అపాయింట్‌మెంట్ ఆర్డర్లను ఒకసారి లెక్కపెట్టుకోండి అని పేర్కొన్నారు. అప్పుడు తెలుస్తుంది దమ్ము ఎవరిదో.. మోసం ఎవరిదో! టీజీపీఎస్సీ క్వశ్చన్ పేపర్లను పప్పుబెల్లాల్లా బజార్లో పెట్టి అమ్ముతుంటే... కళ్ళు అప్పగించి చూసింది మీరు కాదా? లీకేజీలతో లక్షలాది మంది నిరుద్యోగుల ఉసురు పోసుకున్న పాపం మీది కాదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వోద్యోగాలు పొందిన వారిలో ఎక్కువ మంది బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే ఉన్నారని మంత్రి శ్రీధర్‌రావు చెప్పారు.గ్రూప్ 1,గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షల నిర్వహణ మీకు చేతకాక చేతులెత్తేస్తే, మేం విజయవంతంగా నిర్వహించాం.అది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు.

# గ్రీన్‌లాండ్‌పై పట్టుకు బిగ్ ఫైట్

■ అమెరికా సరికొత్త వ్యూహం ■ పౌరులకు నేరుగా డబ్బు ఆఫర్ ■ డెన్మార్క్ నుంచి విడిపోయేలా కుట్ర ■ సైనిక చర్యకు దిగితే తీవ్ర పరిణామాలు: గ్రీన్‌లాండ్ ■ముందు కాల్చిపడేసి.. ఆ తర్వాత మాట్లాడతాం:ట్రంప్‌కు నేరుగా డెన్మార్క్ హెచ్చరిక



**వాషింగ్టన్, జనవరి 9:** ఆర్కిటిక్ ప్రాంతంలోని వ్యూహాత్మక ద్వీపం గ్రీన్‌లాండ్‌ను తన నియంత్రణలోకి తీసుకోవడానికి తాజాగా అమెరికా ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. వెనిజులాపై సైనిక చర్యకు దిగి అధ్యక్షుడు నికోలస్ మదురోను అదుపులోకి తీసుకున్న తరువాత ఏదో ఒక రోజే గ్రీన్‌లాండ్‌ను త్వరలోనే అమెరికాలో విలీనం చేసుకుంటామని ట్రంప్ ప్రకటించారు. సైనిక చర్యకు దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని డెన్మార్క్ ప్రధాని మెట్టే ఫ్రెడెరిక్సెన్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అమెరికా సరికొత్త ప్రయత్నాలు మొదలెట్టినట్లు సమాచారం. అమెరికాలో చేరేందుకు సుముఖంగా లేని గ్రీన్‌లాండ్ ప్రజలు డెన్మార్క్ ఆధీనంలోని గ్రీన్‌లాండ్‌ను తమ దేశంలో విలీనం చేసుకునేందుకు అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం సరికొత్త ప్రణాళికను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. డెన్మార్క్ నుంచి విడిపోయి అమెరికాతో కలిసేలా అక్కడి ప్రజలను ఒప్పించేందుకు, ప్రతి పౌరుడికి నేరుగా నగదు చెల్లించే ప్రతిపాదనపై వైట్‌హౌస్‌లో చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. గ్రీన్‌లాండ్‌లోని 57,000 మంది పౌరులకు ఒక్కొక్కరికి 10,000 డాలర్ల నుంచి 1,00,000 డాలర్ల వరకు చెల్లించే ఆలోచనలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ లెక్కన మొత్తం దాదాపు 6 బిలియన్ డాలర్లు ఖర్చవుతుందని అంచనా. అయితే, గ్రీన్‌లాండ్‌ను అమ్మే ప్రసక్తే లేదని డెన్మార్క్, గ్రీన్‌లాండ్ ప్రభుత్వాలు ఇప్పటికే స్పష్టం చేశాయి. అంతేగాక ఆర్కిటిక్ ప్రాంతంలోని తమ భూభాగంలోకి ఎవరైనా అడుగుపెడితే, ఉన్నతాధికారుల ఆదేశాల కోసం ఎదురుచూడకుండా వెంటనే కాల్పులు జరపాలని తమ సైనికులకు ఆదేశాలున్నాయని డెన్మార్క్ హెచ్చరించడం ఉద్రిక్తతకు దారితీసింది.

**నాటో ఉనికికే ప్రమాదం**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రీన్‌లాండ్‌ను బలవంతంగా స్వాధీనం చేసుకోవాలని చూస్తే అది నాటో కూటమి ముగింపునకు దారితీస్తుందని డెన్మార్క్ ప్రధాని మెట్టే ఫ్రెడరిక్సెన్ హెచ్చరించారు. ఒక నాటో సభ్య దేశంపై మరొక సభ్య దేశం దాడి చేయడం రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన అంతర్జాతీయ భద్రతా వ్యవస్థకే ముప్పు అని ఆమె పేర్కొన్నారు. గ్రీన్‌లాండ్ కేవలం తన సొంత ప్రజలకు మాత్రమే చెందుతుందని, దాన్ని ఎవరూ కొనుగోలు చేయలేరని ఆమె తేల్చి చెప్పారు. జాతీయ భద్రత, వ్యూహాత్మక ప్రయోజనాలు, సైనిక అవసరాలకు ఉపయోగపడే అపారమైన ఖనిజ సంపద దృష్ట్యా గ్రీన్‌లాండ్ తమకు ఎంతో కీలకమని ట్రంప్ వాదిస్తున్నారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు నగదు చెల్లింపులతో పాటు సైనిక చర్య లేదా కాంపాక్ట్ ఆఫ్ ఫ్రీ అసోసియేషన్ ఒప్పందం వంటి ఇతర మార్గాలను కూడా ట్రంప్ యంత్రాంగం పరిశీలిస్తోంది. సీఓఎఫ్ఏ ఒప్పందం ప్రకారం అమెరికా రక్షణ కల్పిస్తుంది, కానీ ఆ దేశంలో వారి సైన్యం స్వేచ్ఛగా కార్యకలాపాలు నిర్వహిస్తుంది. అయితే, గ్రీన్‌లాండ్ ప్రజలు డెన్మార్క్ నుంచి స్వాతంత్ర్యం కోరుకుంటున్నప్పటికీ, అమెరికాలో విలీనం కావడానికి మాత్రం సుముఖంగా లేరని సర్వేలు చెబుతున్నాయి. "గ్రీన్‌లాండ్‌ను ఆక్రమించుకోవాలనే ఫాంటసీలను ఆపండి" అని ఆ దేశ ప్రధాని జెన్స్ ఫ్రెడెరిక్ నీల్సన్ ఇప్పటికే ట్రంప్‌ను హెచ్చరించారు.

**వైట్‌హౌస్‌లో రాయబారుల చర్చలు**

**ట్రంప్ పట్టుబట్టడానికి కారణం ఇదే**

గ్రీన్‌లాండ్ ప్రాంతంలో రష్యా, చైనా నౌకల సంచారం ఎక్కువగా ఉందని, ఇది అమెరికా జాతీయ భద్రతకు ముప్పు అని ట్రంప్ వాదిస్తున్నారు. కేవలం ఒప్పందాల ద్వారా కాకుండా, గ్రీన్‌లాండ్‌పై పూర్తి యాజమాన్య హక్కులు ఉండాలని ఆయన ఆకాంక్షిస్తున్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ సైతం డెన్మార్క్ రక్షణ చర్యలను విమర్శిస్తూ గ్రీన్‌లాండ్ భద్రత విషయంలో ఐరోపా దేశాలు విఫలమయ్యాయని ఆరోపించారు.

**దౌత్య ప్రయత్నాలు**

మరోవైపు, ఈ ఉద్రిక్తతలను తగ్గించేందుకు డెన్మార్క్, గ్రీన్ లాండ్ రాయబారులు వాషింగ్టన్‌లో శ్వేతసౌధం అధికారులతో చర్చలు జరుపుతున్నారు. వచ్చేవారం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో డెన్మార్క్ అధికారులతో భేటీ అయ్యే అవకాశం ఉంది. 1951 నాటి ఒప్పందం ప్రకారం గ్రీన్‌లాండ్‌లో సైనిక స్థావరాలను ఏర్పాటు చేసుకునే హక్కు ఇప్పటికే అమెరికాకు ఉన్నప్పటికీ, ట్రంప్ నిర్ణయం కలకలం రేపుతోంది.

## వర్సిటీల భూములపై కెటిఆర్‌తో చర్చకు సిద్ధం: ఎమ్మెల్సీ బల్మూరి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 9:** యూనివర్సిటీ భూములపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌తో కాకతీయ లేదా ఉస్మానియా యూనివర్సిటీలో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నానని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సవాల్ విసిరారు. మనూ యూనివర్సిటీ భూములపై అధికారులు, కలెక్టర్ స్పష్టత ఇచ్చారని ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో అన్నారు. అయినా కెటిఆర్ ప్రభుత్వంపై బురద చల్లేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికైనా కెటిఆర్ చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కెటిఆర్‌కు ధైర్యం ఉంటే యూనివర్సిటీల భూములపై బహిరంగ చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు.ఉద్యోగ నోటిఫికేషన్లు,జాబ్ క్యాలెండర్‌పై అసెంబ్లీలో ప్రభుత్వం స్పష్టంగా ప్రకటన చేసిందన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అరవై ఒక్క వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, త్వరలో మరన్ని నోటిఫికేషన్లు ఇస్తామని ఆయన తెలిపారు. బిసి రిజర్వేషన్లు, ఎస్‌సి వర్గీకరణ విషయంతోనే జాబ్ క్యాలెంటర్ ఆలస్యమైందని ఆయన చెప్పారు.

## బాల భరోసా, ప్రణామం కొత్త పథకాలకు శ్రీకారం

**12న ప్రారంభించనున్న సిఎం రేవంత్‌రెడ్డి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 9:** రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల అభ్యున్నతే లక్ష్యంగా మరో ముందడుగు వేస్తోంది. రాష్ట్రంలోని దివ్యాంగులు, వృద్ధులు, చిన్నారుల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన బాల భరోసా, ప్రణామం పథకాలను ఈ నెల 12న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. దివ్యాం గుల సాధికారత కోసం ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించింది. దీనిలో భాగంగా రూ.43.22 కోట్ల విలువైన సహాయక పరికరాలను 7 వేల. మంది అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. రెట్రోఫిటెడ్ మోటరైజ్డ్ వాహనాలు, బ్యాటరీతో నడిచే ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, ల్యాప్టాప్లు, వినికిడి యంత్రాలు, మొబైల్ ఫోన్లు అందించనున్నారు. దివ్యాంగుల సహకార సంస్థ ఏర్పాటైన తర్వాత ఒకే ఆర్థిక సంవత్సరంలో ఈ స్థాయిలో నిధులు కేటాయించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. వృద్ధుల మానసిక ఉల్లాసం, సంరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 37 ప్రణామం డే కేర్ సెంటర్లను ప్రభుత్వం మంజూరు చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, హన్మకొండ జిల్లాల్లో రెండేసి చొప్పున, మిగిలిన 29 జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున వీటిని ఏర్పాట్లు చేస్తున్నారు.

## సంక్రాంతి తర్వాత తెలంగాణ టిడిపి కమిటీ

**పార్టీ బలోపేతంపై దృష్టి సారించండి**

**కొత్త సర్పంచ్‌లను త్వరలో కలుస్తా**

**టిటిడిపి నేతలతో అధినేత చంద్రబాబు**

**విజయవాడ, జనవరి 9, ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగుదేశం పార్టీని హైదరాబాద్‌లోనే స్థాపించడం జరిగింది, 1983 జనవరి 9న తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి 43 సంవత్సరాలు పూర్తి చేసుకుందని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ ముఖ్య నాయకులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో సంస్థాగతంగా పార్టీ బలోపేతం పై దిశానిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని 17 పార్లమెంట్‌లలో 4 పార్లమెంట్‌లకు కలిపి ఒక జోన్‌ను ఏర్పాటు పై చర్చించి నాయకుల అభిప్రాయాలను తీసుకున్నారు. జోనల్‌కు ఒక అబ్జర్వర్‌ను నియమించి కోఆర్డినేట్ చేయాలని నిర్ణయించారు. నియోజకవర్గం, మండలం, క్లస్టర్, యూనిట్ స్థాయిలలో ముందు పార్టీ సంస్థగతంగా నిర్మాణం చేసుకున్న తర్వాత కార్యక్రమాలను తీసుకొని ప్రజలలోకి వెళ్లాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ తరపున గెలిచిన సర్పంచులను కలుస్తానని, వారిని పార్టీ సంస్థాగతంలో చోటు కల్పిద్దామని తెలిపారు. తెలంగాణ లో గత 20 సంవత్సరాలుగా పార్టీ అధికారం లో లేకున్నా, నాయకులు పార్టీ ని వీడి పోయినా స్వచ్ఛందగా లక్షా 80 వేల మంది పార్టీ సభ్యత్వం తీసుకోవడం జరిగిందని, మనస్ఫూర్తిగా అందరికీ అభినందనలను తెలియజేస్తున్నానని తెలిపారు. పార్టీ బలోపేతానికి సంక్రాంతి తర్వాత కమిటీ వేయనున్నామని అన్నారు. ఈ సమావేశంలో పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు, అరవింద్ కుమార్ గౌడ్, జాతీయ పార్టీ ఉపాధ్యక్షులు చిలువేరు కాశీనాథ్, జాతీయ క్రమ శిక్షణ కమిటీ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, జాతీయ పార్టీ అధికార ప్రతినిధులు నన్నూరి నర్సిరెడ్డి, టి. జ్యోత్స్న, రాష్ట్ర పార్టీ నాయకులు నందమూరి సుహాసిని, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొని మాట్లాడి తమ అభిప్రాయాలను తెలిపారు.

## కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోన్న బిట్స్ పిలానీ

**బిట్స్ గ్లోబల్ మీట్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 9:** బిట్స్ పిలానీకి చెందిన అంతర్జాతీయ పూర్వ విద్యార్థుల సమ్మేళనం, బిట్స్ గ్లోబల్ మీట్-2026 ఆరో ఎడిషన్ శుక్రవారం బిట్స్(బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) పిలానీ క్యాంపస్‌లో ఘనంగా ప్రారంభమైంది. తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఈ సదస్సును అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ బిట్స్ పిలానీ కేవలం విద్యా ప్రతిభతో మాత్రమే పరిమితం కాదని తరతరాలుగా నూతన ఆవిష్కరణలు, నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు, జిజ్ఞాసను పెంపొందిస్తూ వస్తోందని అన్నారు. నేడు విద్య ఒక కీలక మలుపుతో కృత్రిమ మేధస్సు (ఎఐ), డేటా సైన్స్, ఆటోమేషన్, డిజిటల్ మార్పులు విద్యా వ్యవస్థను మౌలికంగా మలుస్తున్నాయి. ఏఐ ఇక భవిష్యత్తు కల కాదని, ఇది ఇప్పటికే విద్య, పాలన, ఆరోగ్య రంగం, పరిశ్రమలు, మానవ జ్ఞానాన్ని ప్రభావితం చేస్తోందని, తద్వారా విద్య కేవలం ఉద్యోగాల కోసం కాకుండా, మార్పులకు అనుగుణంగా ఎదగగల సామర్థ్యం, జీవితాంతం నేర్చుకునే దృక్పథాన్ని యువత అలవరచుకోవాలన్నారు. ఏఐ డేటాను విశ్లేషించగలదు, నిర్ణయాలు తీసుకోగలదు, కానీ మానవ విచక్షణ, నైతికత, సృజనాత్మకత, కరుణకు అది ప్రత్యామ్నాయం కాదని, కాబట్టి విద్య లక్ష్యం యంత్రాలతో పోటీ పడడం కాకుండ సమాజ హితానికి సాంకేతికతను దారి చూపగల మానవ విలువలను బలోపేతం చేయడం ఎంతో అవసరమన్నారు. బిట్స్ పిలానీ ఈ ఆలోచనను విద్యా స్వయం ప్రతిపత్తి, అనువైన పాఠ్య ప్రణాళికలు, అంతర్జాతీయ అధ్యయనం, ప్రాయోగిక విద్య ద్వారా సాకారం చేస్తోందని శ్లాఘించారు. తెలంగాణ రాష్ట్ర సాంకేతిక వ్యవస్థతో అనుసంధానమై, ఆధునిక పదార్థాలు, బయోటెక్నాలజీ, వాతావరణ పరిష్కారాలు, రోబోటిక్స్, ఏఐవంటి రంగాల్లో విశిష్టంగా ఎదుగుతుందన్నారు. ఇలాంటి కేంద్రాలు భారతదేశాన్ని కేవలం సాంకేతిక వినియోగదారుడిగా కాకుండా, స్థానిక అవసరాలకు అనుగుణమైన ఆవిష్కరణల సృష్టికర్తగా నిలుపుతున్నాయన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ బిట్స్ పిలానీ పూర్వ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ బిట్స్ పిలానీ విశిష్ట పూర్వ విద్యార్థులకు నా అభినందనలు వారి విజయాలే సంస్థ వారసత్వానికి ప్రతీకలన్నారు. జాన్ ఎఫ్. కెన్నెడి చెప్పినట్లు విశ్వవిద్యాలయాలకు పూర్వవిద్యార్థుల సంఘాలే ప్రాణవాయువని, అవే జ్ఞాన జ్యోతిని తరతరాలకు అందిస్తాయన్నారు. వారి మార్గదర్శనం, దానధర్మాలు, సంబంధాలు సంస్థ అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్నాయన్నారు. మీ విజయాలు భారతీయ విలువలతో కూడిన ఆవిష్కరణలకు ప్రేరణగా నిలుస్తున్నాయని, వృత్తి నైపుణ్య శిక్షణ, స్వావలంబన పరిశ్రమలు, ప్రతిభ పెంపకంలో మీ సహకారం కోసం దేశం ఆశగా ఎదురు చూస్తోందని అన్నారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచి, సమాజాన్ని ఉద్ధరించి, జాతీయ స్వయం సమృద్ధిని ముందుకు నడిపించడడంలో మీ వంతు సహకారాన్ని అందించాలన్నారు. గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ మాట్లాడుతూ.. సాంకేతికత మరియు నాణ్యమైన విద్య ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. వర్క్‌ఫోర్స్ డెవలప్‌మెంట్, డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్, నిరంతర అభ్యాసంలో బిట్స్ వంటి సంస్థలు జాతీయ భాగస్వామిగా ఎలా సహకరిస్తున్నాయో ఆయన వివరించారు. బీజీఎం 2026 ఛైర్‌పర్సన్ అనిత సాకూరు మాట్లాడుతూ, ఈ సదస్సు వివిధ తరాల మధ్య సహకారానికి ఒక ఉత్ప్రేరకంగా పనిచేస్తుందని పేర్కొన్నారు.

## దావోస్ సదస్సులో తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌పై ఫోకస్

**దావోస్ పర్యటనలు, గ్లోబల్ సమ్మిట్-పెట్టుబడులపై సిఎం రేవంత్ సమీక్ష**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 9:** వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యుఈఎఫ్) దావోస్ 2026 సమావేశాల్లో తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను, అలాగే 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని సాధించేందుకు రూపొందించిన సియుఆర్ఈ(క్యూర్) పియుఆర్ఈ(ప్యూర్), ఆర్ఏఆర్ఈ (రేర్)ఫ్రేమ్ వర్క్‌ను రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం చాటి చెప్పాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. గత రెండేళ్ల దావోస్ పర్యటనల సందర్భంగా, ఇటీవల నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ 2025లో వచ్చిన పెట్టుబడులపై శుక్రవారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఏ స్పిరిట్ ఆఫ్ డైలాగ్ అనే థీమ్‌తో వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సమావేశాలు 2026 జనవరి 19 నుంచి 23 వరకు దావోస్‌లో జరగనున్నాయి. గతంలో వచ్చిన పెట్టుబడుల పురోగతిని సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న అంశాలు లేదా అడ్డంకులను తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరిచిన మూడుదిశల ఆర్థిక వృద్ధి వ్యూహాన్ని ప్రపంచ పెట్టుబడిదారులకు వివరించి, రాష్ట్ర అభివృద్ధి రోడ్ మ్యాప్‌ను తెలం గాణ రైజింగ్ ప్రతినిధి బృందం దావోస్ లో ప్రధానంగా ఫోకస్ చేయనుంది.

## పదేళ్ల కాలంలో వరి సాగులో 240 శాతం వృద్ధి

**కెసిఆర్ మార్క్ అభివృద్ధికి ఇదీ నిదర్శనం: మాజీమంత్రి కెటిఆర్ ట్వీట్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 9:** వ్యవసాయ రంగంలో తెలంగాణ సాధించిన అద్భుత పురోగతి కేసీఆర్ దూరదృష్టి, నాయకత్వానికి నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. 2014-15 నుంచి 2024-15 పదేళ్ల కాలంలో వరి సాగులో తెలంగాణ 240 శాతం వృద్ధి సాధించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇది కేసీఆర్ మార్క్ అభివృద్ధి అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా కేటీఆర్ స్పందించారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ తీసుకొచ్చిన రైతు బంధు, రైతు బీమా, మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టు, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా వంటి పథకాలే ఈ విజయంలో కీలక పాత్ర పోషించాయని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ వ్యవసాయం దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. వరి సాగు విస్తీర్ణంలో 2014-15 నుంచి 2024-25 పదేళ్ల కాలంలో ఇండియాలో వచ్చిన భారీ మార్పులను ది ఇండియన్ ఇండెక్స్ తాజాగా ప్రకటించింది. దీనిప్రకారం తెలంగాణలో అత్యధికంగా 240 శాతం వృద్ధి ఏర్పడిందని తెలిపింది. అలాగే మధ్యప్రదేశ్‌లో 80 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 25 శాతం, తమిళనాడులో 20 శాతం, పంజాబ్‌లో 12 శాతం వృద్ధి నమోదైందని పేర్కొంది. అదే ఆంధ్రప్రదేశ్‌లో వరి సాగు విస్తీర్ణం 13 శాతం పడిపోయిందని తెలిపింది.

## డిజిపి శివధర్‌రెడ్డికి హైకోర్టులో ఊరట

**నియామక ఉత్తర్వులను రద్దు చేయాలనే పిటిషన్ డిస్మిస్**

**4 వారాల్లో పూర్తిస్థాయి డిజిపి నియామక ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం**

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:** డిజిపి శివధర్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. ఆయన నియామకాన్ని రద్దు చేయాలనే పిటిషన్‌ను హైకోర్టు శుక్రవారం డిస్మిస్ చేసింది. ఇదే సమయంలో పూర్తిస్థాయి డిజిపి నియామక ప్రక్రియను నాలుగు వారాల్లో పూర్తి చేయాలని హైకోర్టు ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశించింది. రాష్ట్ర డిజిపి నియామకం విషయంలో హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నిబంధనలకు విరుద్ధంగా నియమితులైన శివధర్ రెడ్డిని వెంటనే తొలగి ంచాలని సామాజిక కార్యకర్త బ దాఖలు చేసిన పిటిషన్‌పై జరిగిన విచారణ సందర్భంగా హైకోర్టు జస్టిస్ పుల్ల కార్తిక్ ఈ వ్యాఖ్యలు చేశా రు. డిజిపిగా శివధర్ రెడ్డి నియామకాన్ని రద్దు చేయడంతో పాటు దీనిపై స్టే విధించేందుకు ధర్మాసనం నిరాకరించింది. దీనికి సంబంధించి గురువా రం జరిగిన వాదనల్లో ధన్‌గోపాల్‌రావు తరపు న్యాయవాది, ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి తమ తమ వాదనలు వినిపించారు.

ధన్‌గోపాల్‌రా వు తరపు న్యాయవాది మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయినప్పటి నుంచి డిజిపిల నియామకం ఎప్పుడూ సరిగ్గా జరగలేదని, ప్రభుత్వంలోని పెద్దల ఇష్టానుసారం జరిగిందని, సుప్రీం కోర్టు మార్గదర్శకాలను కాలరాశారని, దీనివల్ల సీనియారిటీతో పాటు అనుభవం, నిజాయితీ గల అధికారు లకు అన్యాయం జరిగిందని ఆయన వాదించారు. ఈ వాదనలను ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి ఖండించారు. నిబంధనల మేరకే అం తా జరిగిందని, సీనియారిటీ ప్రకారం యుపిఎస్‌సికి జాబితా పంపగా అక్కడ కొన్ని కారణాల చేత వెనక్కు పంపారని ఆయన తెలిపారు. ఈ క్రమంలో నిబంధనల మేరకు సీనియారిటీకి అనుగుణంగా శివధర్ రెడ్డిని డిజిపిగా నియమించడం జరిగిందని ఆయన తెలిపారు. దీనిపై గురువారం వాద నలు పూర్తవగా శుక్రవారం నాడు హైకోర్టు జస్టిస్ పుల్ల కార్తిక్ తీర్పు వెలువరిస్తూ డిజిపిగా శివధర్ రెడ్డిని తొలగించడం కుదరదని స్పష్టం చేశారు. దీ నిపై స్టే కూడా ఇవ్వలేమని ఆయన వెల్లడించారు.

## ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీకి చెక్

**75 బస్సులపై కేసులు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 9:** సంక్రాంతి పండుగ వేళ సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని నిబంధనలను అతిక్రమిస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల పట్ల తెలంగాణ రవాణ శాఖ అత్యంత కఠినంగా వ్యవహరిస్తోంది. జనవరి 7వ తేద నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలను ప్రారంభించిన అధికారులు,ఇప్పటి వరకు నిబంధనలు ఉల్లంఘించిన సుమారు 75 ప్రైవేట్ బస్సులపై కేసులు నమోదు చేశారు. ముఖ్యంగా ప్రయాణికుల భద్రతను విస్మరించి బస్సులో భారీగా సరుకు రావాణా చేయడం, ప్రయాణిస్తున్న వారి వివరాలతో కూడిన జాబితా నిర్వహించకపోవడం,కనీస అవసరమైన ఫస్ట్ ఎయిడ్ బాక్సులను అందుబాటులో ఉంచకపోవడం వంటి ఉల్లంఘనలపై రవాణా శాఖ ఈ చర్యలు చేపట్టింది. పండుగ సీజన్ ముగిసే వరకు ప్రైవేట్ ఆపరేటర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు నిరంతరాయంగా కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు. ప్రయాణీకుల రద్దీ అధికారికంగా ఉండే హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించిన రవాణ శాఖ, నిఘా పెంచేందుకు 8 ప్రత్యేక తనిఖీ బృందాలను రంగంలోకి దించింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల రవాణా అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం,ఎక్కడా ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించింది. పండుగ సమయంలో ప్రైవేట్ బస్సు యాజమా న్యాలు ఇష్టారాజ్యం అధిక ఛార్జీలు వసూలు చేయడంపై రవాణా శాఖ సీరియస్ హెచ్చరికలు జారీ చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వం నిర్ణయించిన పరిమితికి మించి ఛార్జీలు వసూలు చేయరాదని, ఒకవేళ ఏ ట్రావెల్స్ అయినా అధిక వసూళ్లకు పాల్పడితే వారిపై కఠిన చర్యలతో పాటు లైసెన్స్‌ల రద్దుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించింది.

## సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీ డైరెక్టర్‌గా కిరణ్

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త :** రాష్ట్రంలో పాలనాపరమైన వ్యవహారాలకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ఇందులో భాగంగా స్టేట్ సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీ (టిజిఎస్ఎస్‌సిఎ) డైరెక్టర్‌గా కిరణ్ కుమార్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు దీనికి సంబంధించి శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కిరణ్ కుమార్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన మరో ఏడాది కాలం పాటు డిప్యుటేషన్‌పై తెలంగాణ రాష్ట్ర సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీ డైరెక్టర్‌గా వ్యవహరించనున్నారు.



## మిర్యాలగూడలో రోడ్డుప్రమాదం

**సిమెంట్ ట్యాంకర్, డిసిఎం ఢీ**

**ముగ్గురు బీహార్ కూలీల మృతి, మరో ముగ్గురికి తీవ్రగాయాలు**

**మిర్యాలగూడ, జనవరి 9, ప్రభాతవార్త:** నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఈదుల గూడలో శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సిమెంట్ ట్యాంకర్ ని డీసీఎం లారీ ఢీకొట్టడంతో, డీసీఎం లో ఉన్న ముగ్గురు బీహార్ కూలీలు అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వన్ టౌన్ సీఐ నాగభూషణరావు తెలిపిన వివరాల ప్రకారం.....బీహార్ కి చెందిన సుజిత్ కుమార్, కిషన్, బీరు బాయ్, సంతోష్, సూరజ్ సికిందర్ లు శంషాబాద్ లోని ఓ టైల్స్ మార్ట్ లో కూలీ లు గా పని చేస్తున్నారు. వీరంతా టైల్స్ కొనుగోలు చేసిన చోట దిగుమతి చేస్తుంటారు. గురువారం శంషాబాద్ షాప్ నుంచి ఏపీ లోని వినుకొండ కి డి సీ ఎమ్ లారిలో టైల్స్ ని దిగుమతి చేసేందుకు వెళ్తున్నారు. లారీ శుక్రవారం తెల్లవారు జామున మిర్యాలగూడలోని ఈదుల గూడ కి చేరుకొంది. ఈ క్రమంలో లారీ డ్రైవర్ సలీమ్ అజాగ్రత్తగా అతి వేగంగా లారీ ని నడిపి ఎదురుగా వస్తున్న సిమెంట్ ట్యాంకర్ ని ఢీ కొట్టాడని బాధితుడు సంజయ్ కుమార్ పోలీస్ లకు ఫిర్యాదు చేశాడు. ఈ ప్రమాదం లో వీరు, సంతోష్, సూరజ్ సికిందర్ లు అక్కడికి అక్కడే మృతి చెందగా సుజిత్ కుమార్, కిషన్, సికిందర్ లు గాయపడ్డారు. సంఘటన స్థలాన్ని మిర్యాలగూడ డీ ఎస్పీ రాజశేఖర్ రాజు సందర్శించి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి క్షత గాత్రులను పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి కి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడు సంజయ్ కుమార్ పిర్యాదు మేరకు వన్ టౌన్ సీఐ నాగభూషణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థపై పెనుభారంగా విద్యుత్ డిస్కంలు

**మొత్తం నష్టాలు రూ.6.5 లక్షల కోట్లు**

**దేశ జిడిపిలో 2.4 శాతం నమోదు**

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త :** విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కామ్‌లు) రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై భారంగా తయారయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ పంపిణీ సంస్థలను తమ స్వప్రయోజనాలకు ఉపయోగించుకోవడంతో వాటి పరిస్థితి క్రమేపీ దిగజారుతోంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రాలకు చెందిన విద్యుత్ పంపిణీ సంస్థల మొత్తం పోగుపడిన నష్టాలు రూ.6.5 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇది దేశ జిడిపిలో 2.4 శాతంగా నమోదైంది. ఈ మేరకు వీటికి సంబంధించి భారతీయ రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసిన ఒక నివేదికలో పేర్కొంది. విద్యుత్ పంపిణీ సంస్థలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఒక డ్రాగ్‌గా కొనసాగుతున్నాయని ఆందళన వ్యక్తం చేసింది. వివిధ సంస్కరణల ప్రయత్నాలు ఉన్నప్పటికీ డిస్కమ్‌లు రాష్ట్రాలకు ఒక ముఖ్యమైన సవాలుగా ఉన్నాయని తెలిపింది. దీనిని పరిష్కరించడానికి, ఉత్పాదకతను మెరుగుపరచడం, ప్రసార మరియు పంపిణీ నష్టాలను తగ్గించడంతో పాటు, విద్యుత్ సరఫరా యొక్క వాస్తవ వ్యయంతో సుంకాలను సర్దుబాటు చేయడం వంటి చర్యల యొక్క ప్రాముఖ్యతను గూర్చి నొక్కి చెప్పింది. ఇతర సిఫార్సు దశల్లో విద్యుత్ సరఫరా పరిశ్రమను విడదీయడం మరియు విద్యుత్ ఉత్పత్తి మరియు పంపిణీని ప్రైవేటీకరించడం ఉన్నాయి.

తద్వారా రాష్ట్ర ఆర్థిక నాణ్యతను గణనీయంగా మెరుగుపరుస్తుంది వెల్లడించింది. డిస్కమ్‌లను ఆర్థిక బలోపేతం చేసే విధంగా పెంపొందించడం ద్వారా రాష్ట్ర ఆర్థిక మొత్తం నాణ్యతను మెరుగుపరచడానికి ఈ చర్యలు కీలకమైనవని వివరించింది.

అనేక ఆర్థిక పునర్నిర్మాణ ప్రయత్నాలు ఉన్నప్పటికీ, 2016-17 నుండి డిస్కమ్‌ల మొత్తం బకాయిలు సగటు వార్షిక రేటు 8.7 శాతం వద్ద వృద్ధి చెందాయని నివేదిక హైలైట్ చేసింది. పంపిణీ నష్టాలను తగ్గించడం, మీటరింగ్ వ్యవస్థలను మెరుగుపరచడం, సకాలంలో టారిఫ్ సవరణలను నిర్ధారించడం మరియు ప్రభుత్వ సబ్సిడీలపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించడానికి విద్యుత్ రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రాలు కార్యాచరణ సామర్థ్యాన్ని ప్రాధాన్యపరచాలని నివేదిక వివరించింది.

ఇది గత సంవత్సరాల నుండి మెరుగుదలని ప్రతిబింబిస్తుందని చెప్పింది. మరియు బాధ్యతాయుతమైన ఆర్థిక నిర్వహణకు నిబద్ధతను ప్రదర్శిస్తుందని తెలియచేసింది. అదనంగా, ఖర్చుల నాణ్యతను మెరుగుపరచడంలో రాష్ట్రాలు పురోగతి సాధించాయని నివేదిక పేర్కొంది. మరింత సానుకూల పరిస్థితుల నేపథ్యంలో ఆర్థిక క్రమశిక్షణను కొనసాగించడంలో రాష్ట్రాలు పురోగతి సాధించాయని పేర్కొంది. 2023-24లో రాష్ట్రాల స్థూల ఆర్థిక లోటు 2.91 శాతం వద్ద ఉంది, ఇది ఆర్థిక బాధ్యత చట్టం ద్వారా నిర్దేశించబడిన 3 శాతం పరిమితిలో బాగానే ఉంది.

ఇక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో పెట్టుబడి మరియు దీర్ఘకాలిక వృద్ధికి కీలక సూచిక అయిన మూలధన వ్యయం 2023-24లో బిదీశిలో 2.6 శాతానికి పెరిగింది, ఇది అంతకుముందు సంవత్సరంలో 2.2 శాతంగా ఉంది. 2024-25లో రాష్ట్రాలు ఆర్థిక క్రమశిక్షణను కొనసాగించాలని భావిస్తున్నాయని, ఈ నేపథ్యంలో 3.2 శాతంగా ఉంటుందని నివేదిక అంచనా వేసింది.



రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందచేస్తున్న సిఎం చంద్రబాబు

# రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు

**రైతుల భూములకు భరోసా ఇచ్చేందుకు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు**
**రీసర్వేలో తప్పులుంటే అధికారులపై చర్యలు తీసుకుంటాం**
**టెక్నాలజీతో ట్యాంపరింగ్ ఫ్రీ డాక్యుమెంట్లు**
**భూములను లాక్కోలేరు... రికార్డులు తారుమారు చేయలేరు**
**పాసుపుస్తకాల పంపిణీ సభలో సిఎం చంద్రబాబు**

**మండపేట(తూర్పు గోదావరి జిల్లా), జనవరి 9 ప్రభాతవార్త బ్యూరో:** మీ భూమిమీ హక్కు. ఇదీ రైతులకు, భూ యజమానులకు ప్రభుత్వం ఇచ్చే భరోసా అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రైతులకు వివాదాల్లేని క్లీన్ డాక్యుమెంట్లు ఇచ్చే దిశగా ప్రభుత్వం పని చేస్తోందని... ఆ దిశగానే భూముల రీసర్వే చేపడుతున్నామని సిఎం వెల్లడించారు. మండపేట నియోజకవర్గం, రాయవరంలో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు శుక్రవారం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన చంద్రబాబుకు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా రాయవరంలోని వ్యవసాయ క్షేత్రంలో రైతులతో సిఎం ముఖాముఖి మాట్లాడారు. క్యూఆర్ కోడ్, విశిష్ట సంఖ్య ఉన్న, మీ భూమి.. మీ హక్కు పేరిటి రైతులకు రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని స్వయంగా పరిశీలించారు. క్యూఆర్ కోడ్ ద్వారా తక్షణం భూమి వివరాలు తెలుసుకునేలా పట్టాదారు పాస్ పుస్తకాలను రెవెన్యూ శాఖ ముద్రించిందని రైతులకు సిఎం వివరించారు. రైతులు, భూ యజమానుల ఆస్తులకు భద్రత కల్పించేలా కొత్త టెక్నాలజీతో ట్యాంపరింగ్ చేసేందుకు వీల్లేకుండా పట్టాదారు పాస్ పుస్తకం తయారు చేసినట్టు చెప్పారు. రీసర్వే పూర్తైన 6688 గ్రామాల్లోని భూములకు సంబంధించి 22.33 లక్షల పాస్ పుస్తకాలు ముద్రించగా... ప్రస్తుతం వాటిని పంపిణీ చేస్తున్నట్టు రైతులతో సిఎం చెప్పారు. రైతులు, భూ యజమానులకు తప్పుల్లేని కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేసేలా అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధ పెట్టాలని సీఎం సూచించారు. అనంతరం మీ భూమి మీ హక్కు ప్రజావేదిక నుంచి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ... "పూర్వీకుల నుంచి సంక్రమించిన, స్వార్జితమైన భూమితో రైతులకు ఓ అనుబంధం ఉంది. కరోనా సమయంలో అంతా సెలవు తీసుకున్నారు. కానీ అందరికీ అన్నం పెట్టే రైతన్నకు సెలవే లేదు. అలాంటి రైతులకు చెందిన భూ పత్రాల విషయంలో గత పాలకులు పాస్ పుస్తకాల జారీకి సంబంధించి అక్రమాలు చేశారు. గత పాలకుల్ని, ప్రభుత్వాన్ని హెచ్చరించాను. కానీ వారి అహంకారం నెత్తికెక్కి మీ ఆస్తులపై ఆయన ఫోటో వేసుకున్నారు. పూర్వీకులు ఆర్జించిన భూమిపై నాటి పాలకుని ఫోటో ఏమిటి.? సరిహద్దు రాళ్లపై గత పాలకుని ముద్రలేమిటి? ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అంటూ ఓ చట్టాన్ని తెచ్చి వాళ్లకు నచ్చిన వాళ్ల ఆధీనంలోకి తీసుకువచ్చేలా చేశారు. దీనిని గతంలోనే తీవ్రంగా వ్యతిరేకించాను. మీ భూముల వివరాలన్నీ గత పాలకుల అనుచరులు అమెరికాలో పెట్టుకున్నారు. కూటమి అధికారంలోకి రాకపోతే ప్రజల భూములన్నీ కాజేసేందుకు కుట్రపన్నారు. నిన్నా మొన్నా రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తులు చాలా ప్రమాదకరమైన ఆలోచన చేశారు. రైతుల భుంలపై వేరేవాళ్ల ఫోటోలెందుకని ప్రశ్నించాను. ప్రభుత్వంలోకి వచ్చాం... రాజముద్ర వేసి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చాం. గత పాలకులు తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేస్తూ రెండో సంతకమే పెట్టాను. భూమి అనేది రైతుకు ఆస్తి మాత్రమే కాదు ఓ విశ్వాసం, కుటుంబంతో కలిసిపోయిన సెంటిమెంట్. గతంలో భూమి ఇవ్వకపోతే దానిని 22 ఏ రికార్డుల్లో పెట్టేశారు. అందుకే ప్రజలు ఆలోచించి సమయం వచ్చినప్పుడు చూద్దామని బ్యాలెట్ ద్వారా తగిన బుద్ధి చెప్పారు. ఎపి ప్రాంతంలో ఉన్న రికార్డులు అన్నీ పక్కాగా ఉన్నాయి. తెలంగాణా ప్రాంతంలో ఎక్కువ భూవివాదాలే. మున్సబు, కరణాల వ్యవస్థను రద్దు చేసి ఎన్టీఆర్ రైతులకు, భూ యజమానులకు మేలు చేశారు. ఈ వ్యవస్థ రద్దైనప్పుడు తెలంగాణాలో పండుగ చేసుకున్నారు. గత పాలకుల తీరు కారణంగా ఎక్కడకు వెళ్లినా భూ వివాదాలకు సంబంధించిన పిటిషన్లే వస్తున్నాయి. ఈ వివాదాలను పరిష్కరించేందుకు సంకల్పించి మీ వద్దకు వచ్చాను." అని సిఎం చెప్పారు. "తహసీల్దారు కార్యాలయంలో కాదు... గ్రామసభలు నిర్వహించి పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని ఆదేశించాను. ఎక్కడా మోసం జరక్కుండా, వివాదాలకు తావివ్వకుండా రాజముద్రతో మీ భూమి మీహక్కు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నాం. పద్దతి ప్రకారం రీసర్వే చేయించి.. రికార్డులు అన్నీ అత్యంత సురక్షి తంగా ట్యాంపర్ చేయలేని విధంగా భద్రపరుస్తున్నాం. భూ రికార్డులు ట్యాంపర్ చేయకుండా బ్లాక్ చెయిన్ టెక్నాలజిని వినియోగిస్తున్నాం. జారీ చేసిన పట్టాదారు పాస్ పుస్తకంపై క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చాలు మీ రికార్డు వచ్చేస్తుంది. ప్రభుత్వం ముద్రించిన పట్టాదారు పాస్ పుస్తకంతో మీ ఆస్తిపై మీకు పూర్తి భరోసా వస్తుంది. సర్వే చేసిన రికార్డులను మరోమారు తనిఖీ చేసి రైతులు చెప్పిన వివరాలు కూడా నమోదు చేసుకుంటున్నాం. ఈకేవైసీ పూర్తి అయ్యాకే పాస్ పుస్తకం ముద్రించి జారీ చేస్తాం. ఎక్కడా అవినీతి లేకుండా, పెత్తనం లేకుండా మీ భూమి మీ హక్కు పట్టాదారు పాస్ పుస్తకాలను గ్రామ సభ ద్వారా ఇస్తున్నాం. ఈ పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేసే విషయంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యత తీసుకోవాలి. క్షేత్రస్థాయి వరకూ రీసర్వే పూర్తైన గ్రామాల్లో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ జరగాలి అన్నారు.

# తిరుమల సమాచారం

## 15నుండి శ్రీవారికి యధావిధిగా సుప్రభాతసేవ

**తిరుమల,జనవరి 9ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతిరోజూ తెల్లవారుజామున 2.30గంటలకు దేవదేవుడిని నిద్రనుండి మేల్కొలిపేందుకు వైఖానస ఆగమోక్తంగా నిర్వహించే సుప్రభాతసేవ తిరిగి ఈనెల 15వతేదీ గురువారం నుండి పున:ప్రారంభంకానుంది. ధనుర్మాసం ఘడియలు 14వతేదీతో అర్ధరాత్రితో ముగియనున్నాయి. ఈ నేపధ్యంలో 15వతేదీ కనుమ పర్వదినంనుండి ఏడుకొండలస్వామికి "కౌసల్యా సుప్రజారామా పూర్వాసంధ్యాప్రవర్తితే"అనే నామం వినిపించనుంది. ప్రతి ఏడాది డిసెంబర్ 16వతేదీ నుండి ధనుర్మాసం ఆరంభంతో వెంకన్న ఆలయంలో సుప్రభాతసేవ రద్దయి ఆ స్థానంలో గోదాదేవి తిరుప్పావై పాశురాలు పారాయణం జరుగుతుంది. జనవరి 14వ తేదీతో ధనుర్మాసం ముగిస్తే యధాప్రకారం ఏడాదంతా సుప్రభాతసేవతోనే స్వామివారిని మేల్కొలుపుతారు. ఈ సేవకు తెల్లవారుజామున గృహస్థభక్తులను అనుమతినిస్తారు.

## శ్రీవారిమెట్టు దారిలో చిరుత కలకలం

**తిరుమల,జనవరి 9ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారిమెట్టు మార్గంలో 400వ మెట్టు సమీపంలో చిరుత సంచారం భక్తులలో కలకలం సృష్టించింది. శుక్రవారం ఉదయం మెట్టుమార్గంలో వెళుతున్న భక్తులు చిరుత కదలికలను గమనించి వెంటనే టిటిడి అధికారులకు సమాచారం అందించారు. భద్రత సిబ్బంది అక్కడికి చేరుకుని చిరుత సంచార ప్రాంతాన్ని అక్కడ పరిస్థితినే కాకుండా మొత్తం మార్గాన్ని జల్లెడపట్టారు. అయితే చిరుత కదలికలు లేవని నిర్ధారించుకుని భక్తులు అప్రమత్తంగా,ఒంటరిగా కాకుండా గుంపులుగా వెళ్ళాలని అధికారులు సూచించారు.

## మొదటి ఘాట్‌లో గజరాజు కదలికలు



**తిరుమల,జనవరి 9ప్రభాతవార్తప్రతినిధి:** వేసవికి ముందే శేషాచలం అడవుల్లో గజరాజులు దారితప్పి నడకమార్గంలో మొదటి ఘాట్‌లో సంచరిస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం తిరుమల నుండి తిరుపతికి దిగే ఘాట్‌లో అడవిలో నాలుగు ఏనుగులు కనిపించాయి. అడవిలో దారితప్పి రావడంతో ఆ సమయంలో వాహనదారులు అటుగా దిగుతుండటంలో భయపడ్డారు. చివరకు వాహనాల శబ్ధాలకు అవి మళ్ళీ అడవిలోకి వెళ్ళాయి. వాహనదారులు, భక్తులు అప్రమత్తంగా ఉండాలని అటవీ వర్గాలు హెచ్చరించారు.

## అద్దె బస్సుల యాజమానుల సమస్యల పరిష్కారానికి చర్యలు :మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



**విజయవాడ,జనవరి9,ప్రభాతవార్తప్రతినిధి:**అద్దె బస్సుల యాజమానుల సమస్యల పరిష్కారానికి అధికారులతో మాట్లాడి అన్ని చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హామీ ఇచ్చారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రిని అద్దె బస్సుల అసోసియేషన్ ప్రతినిధులు గురువారం కలిశారు. స్త్రీ శక్తి పథకం వల్ల పెరిగిన ప్రయాణికుల రద్దీకి సరిపడినన్ని ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డనరీ, అల్ట్రా పల్లె వెలుగు, పల్లె వెలుగు అద్దె బస్సులు లేకపోవడంతో కొన్నిచోట్ల ఓవర్ లోడింగ్ పరిస్థితులు ఏర్పడుతున్నాయని వారు మంత్రికి తెలిపారు. అందువల్ల ప్రమాదాలు జరిగే అవకాశం, బస్సులో ప్రయాణికుల మధ్య వివాదాలు, సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుండటం, తదితర విషయాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానాలు ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించినవేనని, వాటి అమలులో ఏర్పడే సమస్యలను సమీక్షి ంచి అవసరమైన నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. స్త్రీ శక్తి పథకంతో ప్రజా రవాణా వ్యవస్థపై ప్రభావం లేకుండా చూస్తామన్నారు. అద్దె బస్సుల యజమానుల సమస్యల పరిష్కారానికి అధికారులతో మాట్లాడి అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఎస్సీ కార్పొరేషన్ వాహనాల స్థితిపై కమిటీ

**విజయవాడ,జనవరి9,ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్సీ కార్పొరేషన్ జాతీయ సఫాయి కర్మచారి కార్పొరేషన్ నిధుల నుంచి 201819లో కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, పవర్ ఆటోల స్థితిని పరిశీలించేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేస్తూ సాంఘిక సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. అప్పట్లో 42 హెచ్‌పీ ట్రాక్టర్లను డ్రైన్ల క్లీనింగ్ కోసం కొనుగోలు చేసి జిల్లాల ఎస్సీ కార్పొరేషన్ల ఈడీలకు అప్పగించారు. వాటిని సరఫరా చేసేందుకు ఎన్నికల కమిషన్ అభ్యంతరం తెలపడంతో పలు వాహనాలను పంపిణీ చేయక అవి తుప్పుపట్టిపోయాయి. వాటిని ఏం చేయాలనే దానిపై పరిశీలించేందుకు ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్, ఎస్సీ గురుకులం సొసైటీ అడిషనల్ సెక్రటరీ సునీల్‌రాజ్‌కుమార్, సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ రంగలక్షి ్మ, ఆయా ఎస్సీ కార్పొరేషన్ ఈడీలు, ఆయా జిల్లాల రవాణాశాఖ ప్రతినిధులను సభ్యు లుగా కమిటీ ఏర్పాటు

# ఐదో రోజునా ఆరని మంటలు

## కోనసీమ గ్యాస్‌లీక్‌పై సిఎం చంద్రబాబు ఏరియల్ సర్వే



**రాజోలు,జనవరి9, (ప్రభాత వార్త)** కోనసీమ ఓఎన్జీసీ బావి వద్ద ఐదో రోజు మంటలు ఘటనాస్థలిని ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించిన సీఎం చంద్రబాబు కోనసీమ జిల్లా, ఇరుసుమండ గ్రామంలోని ఓఎన్జీసీ బావి వద్ద ఐదో రోజు కూడా మంటలు కొనసాగు తుండటంతో ముఖ్య మంత్రి చంద్రబాబు శుక్రవారం ఏరియల్ సర్వే నిర్వహించారు. గ్యాస్ బావి నుంచి ఎగిసిపడుతున్న మంటలను, పరిసర ప్రాంతాల్లోని పరిస్థితిని ఆయన గగనతలం నుంచి పరిశీలించారు. అనంతరం మండపేట నియోజకవర్గంలోని రాయవరంలో ఆయన ఓఎన్జీసీ అధికారులు, కోనసీమ జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్, ఎంపీ హరీశ్ బాలయోగి, ఎమ్మెల్యే వరప్రసాద్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీసుకుంటున్న చర్యల గురించి సీఎం ఆరా తీశారు. మంటల వల్ల దెబ్బతిన్న కొబ్బరి చెట్లకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు, బ్లోఅవుట్‌ను అదుపులోకి తెచ్చేందుకు ఆమోదించిన ప్రణాళిక ప్రకారం ముమ్మరంగా పనిచేస్తున్నామని ఓఎన్జీసీ ఒక ప్రకటనలో తెలిపింది. సంక్షోభ నిర్వహణ బృందం ఇప్పటికే బావి పరిసరాల్లోని శిథిలాలను చాలావరకు తొలగించి, బావి హెడ్ వద్దకు వెళ్లేందుకు మార్గం సుగమం చేసింది. బావిని క్యాపింగ్ చేసే దిశగా ఆపరేషన్ కొనసాగించేందుకు అడ్డంకిగా ఉన్న మాస్ట్, ఇతర పరికరాల భాగాలను తొలగించినట్లు పేర్కొంది.

బావి హెడ్ సమీపంలో సురక్షి తంగా పనిచేసేందుకు వీలుగా నిరంతరం నీటిని చల్లుతున్నామని వివరించింది. ప్రస్తుతం పరిస్థితి నిలకడగా ఉండటంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తమ సాధారణ కార్యకలాపాలను తిరిగి ప్రారంభించారు. కాగా, సోమవారం మధ్యాహ్నం మరమ్మతు పనులు చేస్తుండగా ఈ బావి నుంచి అకస్మాత్తుగా ముడిచమురుతో కూడిన గ్యాస్ భారీగా ఎగిసిపడిన విషయం తెలిసిందే. దీంతో ఇరుసుమండ, పరిసర గ్రామాల్లో దట్టమైన పొగ, గ్యాస్ వ్యాపించి ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.


జాతీయ రోడ్డు భద్రతా దినోత్సవాల దృశ్యం

## వాహనాలను నడిపేటప్పుడు డ్రైవర్లు వారి కుటుంబాలను జ్ఞాపకం తెచ్చుకోవాలి: ఆర్టీఓ ఎం. పద్మావతి

**విజయవాడ,జనవరి 9,ప్రభాతవార్తప్రతినిధి:**వాహనాలను నడిపేటప్పుడు డ్రైవర్లు వారి కుటుంబాలను జ్ఞాపకం తెచ్చుకోవాలని రోడ్డు రవాణా శాఖాధికారులు సూచించారు. వాహనాలను నడపడానికి సిద్ధమయ్యేటప్పటికే వాటి స్దితిని గమనించాలన్నారు. వేగ నియంత్రణ విషయంలో డ్రైవర్లు చాలా ఓర్పుతోను, సమయసూర్తితో వ్యవహరించాలన్నారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ ఆర్‌టీఓ కార్యాలయంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా విద్యాసంస్దల బస్సు డ్రైవర్లుకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో ఎం. పద్మావతి గారు మాట్లాడుతూ, స్కూల్ బస్సులు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తప్పనిసరిగా ఉండాలి, అలాగే డ్రైవర్ మరియు అటెండర్ యూనిఫాం ధరించాలి అని తెలిపారు. అదేవిధంగా, అత్యవసర ద్వారం సక్రమంగా ఉండేలా చూసుకోవాలి అని అన్నారు. తదుపరి మోటార్ వాహన తనిఖీ అధికారి ఎం. పూర్ణిమ మాట్లాడుతూ, స్కూల్ బస్సులో ఎటువంటి పరిస్థితుల్లోనూ పరిమితిని మించి విద్యార్థులను ఎక్కించరాదని స్పష్టం చేశారు. డ్రైవర్‌కు కనీసం 5 సంవత్సరాల డ్రైవింగ్ అనుభవం ఉండాలి అని పేర్కొన్నారు.

# సూర్యజయంతికి సప్తగిరులు సిద్ధం

## -24నుండి టైమ్‌స్లాట్ టోకెన్లు నిలుపుదల



**తిరుమల,జనవరి 9ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో ఈనెల 25వతేదీ ఆదివారం సూర్యజయంతి(రథసప్తమి) వేడుకలు అంగరంగవైభవంగా జరగనున్నాయి. ఉదయం 5.30గంటల నుండి రాత్రి 9గంటల వరకు ఒకేరోజు ఏడువాహనాలపై ఏడుకొండలదేవుడు భక్తులకు దర్శనమివ్వనున్నాడు. ఈ సందర్భంగా తిరుమల ఆలయంలో జరిగే అన్ని ఆర్జితసేవలు, ప్రత్యేకదర్శనాలతోబాటు సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు కూడా టిటిడి రద్దుచేస్తుంది. భక్తులను వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్ ద్వారా అనుమతించి దర్శనం కల్పించనున్నారు. ఆలయం ముందు, మాఢవీధుల్లో గ్యాలరీలు, జర్మన్‌షెడ్లను ఏర్పాటుచేశారు. ఉదయం నుండి రాత్రి వరకు నిరంతరాయంగా భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు. టీ,కాఫీ,పాలు అందించేలా శ్రీవారిసేవకులు, టిటిడి ఉద్యోగులను సమాయత్తం చేస్తున్నారు. తిరుమలలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. అదనపు పార్కింగ్ ప్రదేశాలకు సూచిక బోర్డులు ఏర్పాటుచేస్తున్నారు. 25వతేదీ పూర్తిగా భక్తులకు ఉదయం నుండిరాత్రి వరకు చలికి, ఎండకు ఇబ్బందులు కలగకుండా మాఢవీధుల్లో అవసరమైన ప్రాంతాల్లో కూల్‌పెయింటింగ్ ,ఆకట్టుకునేలా రంగవల్లులు తీర్చిదిద్దారు. 25వతేదీ ఆదివారం అన్ని ఆర్జితసేవలు, ఇతర ప్రత్యేక దర్శనాలు, సిఫార్సు దర్శనాలు,బ్రేక్ దర్శనాలు పూర్తిగా రద్దుచేశారు. ఆ రోజు ఉదయం ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులకు మాత్రమే బ్రేక్ దర్శనం ఉంటుంది. వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనాలు రద్దుచేశారు. 24నుండి 26వరకు ఆఫ్‌లైన్‌లో సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు రద్దు చేశారు. తిరుమలకు అశేష సంఖ్యలో విచ్చేసే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆఫ్‌లైన్‌లో సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు జారీని నిలుపుదలచేశారు. 25వతేదీ ఉదయం 5.30గంటలకు తొలివాహనంగా సూర్యప్రభవాహనం మొదలై ఉదయం 8గంటల వరకు మాఢవీధుల్లో ఊరేగనుంది. ఉదయం 9గంటల నుండి 10గంటల వరకు చిన్నశేషవాహనం, ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు గరుడవాహనం, మధ్యాహ్నం 1నుండి 2గంటల వరకు హనుమంతవాహనం, మధ్యాహ్నం 2గంటల నుండి 3గంటల వరకు చక్రస్నానమహోత్సవం, సాయంత్రం 4గంటల నుండి 5గంటల వరకు కల్పవృక్షవాహనం, సాయంత్రం 6గంటల నుండి 7గంటల వరకు సర్వభూపాల వాహనం, రాత్రి 8గంటల నుండి 9గంటల వరకు చంద్రప్రభవాహనసేవలు ఆలయ మాఢవీధుల్లో స్వామివారు అధిరోహించి ఊరేగనున్నారు.

## మంత్రి నారా లోకేష్ 'ఉద్యోగాల సృష్టికర్త' - 'ది వీక్' ప్రత్యేక కథనం



**విజయవాడ.జనవరి 9,ప్రభాత వార్తప్రతినిధి:** ఆంధ్రప్ర దేశ్ రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పాలన దక్షత, దార్శనికత జాతీయ స్థాయిలో విస్తృత గుర్తింపు పొందుతున్నాయి. ప్రతిష్ఠాత్మక జాతీయ వార పత్రిక "ది వీక్"తమ కొత్త సంచికలో లోకేశ్ ఫొటోను కవర్ పేజీపై ప్రచురించి, ఏపీకి చీఫ్ జాబ్ క్రియేటర్ (ఉద్యోగాల సృష్టికర్త) అని అభివర్ణించింది. ఉద్యోగాలు, నైపుణ్యాలు, పెట్టుబడిదారుల విశ్వాసంపై లోకేశ్ ప్రత్యేకంగా దృష్టి సారించారని, ఇది ఆర్థిక వృద్ధిని ప్రజల ఉపాధిగా మార్చాలనే ఆయన బలమైన నమ్మకాన్ని ప్రతిబింబిస్తుందని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఆంధ్రప్రదేశ్‌ను పరిశ్రమలకు అత్యంత ప్రాధాన్య గమ్యస్థానంగా మారుస్తున్నారని కొనియాడారు. పారిశ్రామిక వర్గాలు ప్రభుత్వంపై నమ్మకం ఉంచడం, రాష్ట్రం సరైన దిశలో పయనిస్తోందన్న విశ్వాసాన్ని బలపరుస్తోందని ఆమె పేర్కొన్నారు. కాగా, ది వీక్ మ్యాగజైన్ కూడా లోకేశ్ గురించి పలు ఆసక్తికర విషయాలను తన కవర్ పేజీపై హైలైట్ చేసింది. కేవలం మాటలు చెప్పడమే కాకుండా, చేతలతో వేగం చూపిస్తూ పెట్టుబడులను ఆకర్షించడమే లోకేశ్ లక్ష్యమని పేర్కొంది. స్టాన్‌ఫోర్డ్, కార్నెగీ మెలన్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలలో ఆయన పొందిన ఉన్నత విద్య, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఊతమిస్తోందని తెలిపింది.

## 19 నుండి 31వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు

### పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ టి. దామోదర్ నాయుడు

**విజయవాడ,జనవరి9,ప్రభాతవార్తప్రతినిధి:**రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఈ నెల19 నుండి 31 వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించనున్నట్లు పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ టి. దామోదర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పశువుల ఆరోగ్య రక్షణ, ఉత్పాదకత పెంపుదల, వ్యాధుల నియంత్రణ మరియు పశుపోషణ ఖర్చులను తగ్గించడం. పశు పోషణ పై అవగాహన కలిగించడానికి రాష్ట్రంలోని 13,257 గ్రామాలలో జన్మభూమి తరహాలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

## ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలోని తహసీల్దార్ కార్యాలయంలో భారీ అగ్నిప్రమాదం



**విజయవాడ,జనవరి 9,ప్రభాతవార్తప్రతినిధి:**ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కార్యాలయ భవనంలోని స్టోర్ రూమ్‌లో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. కార్యాలయం లోపలి నుంచి భారీగా పొగలు రావడం గమనించిన సిబ్బంది.. వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఫైర్ సిబ్బంది వేగంగా స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు. అగ్నిప్రమాదంలో స్టోర్ రూమ్‌లో భద్రపరిచిన పలు ప్రభుత్వ రికార్డులు కాలిపోయినట్లు ప్రాథమిక సమాచారం. అయితే ఏ రకమైన రికార్డులు, ఎంత నష్టం జరిగిందనే వివరాలు అధికారికంగా వెల్లడికాలేదు. ఈ అగ్నిప్రమాదం షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిందా? లేక మరే ఇతర కారణాలున్నాయా? అనే విషయాలపై అధికారులు విచారణ చేపట్టారు. పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం అసలు కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## డాక్టర్ సుధాకర్ కుటుంబానికి రూ.కోటి ఆర్థిక సాయం, కుమారుడికి పదోన్నతి

### - మంత్రి పార్థసారథి

**విజయవాడ.జనవరి9,ప్రభాతవార్తప్రతినిధి:**గత ప్రభుత్వ హయంలో కరోనా సమయంలో తీవ్ర మనస్తాపానికి గురై మృతి చెందిన ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ కుటుంబానికి రూ.కోటి ఆర్థిక సాయం చేయాలని నిర్ణయం తీసుకున్నటు మంత్రి కొలుసుపార్థసారథి తెలిపారు. ఈ విషయాన్ని మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ... ఇది డాక్టర్ సుధాకర్ కుటుంబానికి కేవలం డబ్బు సహాయం మాత్రమే కాదని, ఆయన కుటుంబానికి ఆర్థిక భద్రత, ఉద్యోగ స్థిరత్వం కల్పించే నిర్ణయమని అన్నారు.. ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన నిన్న జరిగిన కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నామన్నారు. వైసీపీహయాంలో వేధింపులకు గురై మరణించారన్నారు.

# నిర్బంధ చట్టాలకు వ్యతిరేకంగా 12న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు

## - రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు


వడ్డే శోభనాద్రీశ్వరరావు

**విజయవాడ,జనవరి9,ప్రభాతవార్తప్రతినిధి:**రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ నిర్బంధ చట్టాలకు వ్యతిరేకంగా ఈ నెల 12వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో రైతు సంఘాలు, ట్రేడ్ యూనియన్ల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. అనకాపల్లి జిల్లాలో రైతు సంఘం నాయకుడు అప్పలరాజుపై పిడి యాక్ట్ పెట్టడం ప్రజా సమస్యలపై చంద్రబాబు ప్రభుత్వం పనితీరుకు అద్దం పడుతుందన్నారు. అప్పలరాజుపై 19 కేసులు ప్రజా సమస్యలపై పనిచేసిన సమయంలో పెట్టినవేనన్నారు. అనకాపల్లిలో మిట్టల్ ఐరన్ కంపెనీ, బల్క్ డ్రగ్ కంపెనీకి రైతులు భూములు కట్టబెట్టడాన్ని తాను, అప్పలరాజు, పలు రైతు సంఘాలు వ్యతిరేకించాయని గుర్తు చేశారు. హోంమంత్రి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో ఆమెకు ఎదురైన నిరసన సెగ తట్టుకోలేక, కార్పొరేట్‌లకు రైతుల భూములు కట్టబెట్టేందుకు, వారి మెప్పు పొందేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతు సంఘం నాయకుడు అప్పలరాజుపై పిడి యాక్ట్ పెట్టారని విమర్శించారు. ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులపై రౌడి షీట్లు తెరిచారన్నారు.. ఈ కేసులతో పోరాటాలు, ఉద్యమాలు చేసే వారిని బెదిరించాలని ప్రభుత్వం చూస్తోందని తెలిపారు. ఈ నెల 16న దేశవ్యాప్తంగా ఆందోళనల్లో భాగంగా మండల కేంద్రాల్లో నిరసన తెలియజేయాలన్నారు. రైతు సంఘం సీనియర్ నాయకులు వై. కేశవరావు మాట్లాడుతూ.. విబి జి ఆర్ఎం జి చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ఛైర్మన్ కామన ప్రభాకరరావు మాట్లాడుతూ.. కార్పొరేట్ రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు అనుకూల చట్టాలను కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తుందని తెలిపారు. రైతులను విస్మరించిన ఏ ప్రభుత్వం మనుగడ సాగించలేదని చెప్పారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెవివి ప్రసాద్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం నిర్బంధానికి వ్యతిరేకంగా 12న అన్ని జిల్లా కేంద్రాల్లో పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించాలని కోరారు. 14నచట్టాల జీవోలను భోగి మంటల్లో దగ్ధం.

# తిరుప్పావై

## 26వ పాశురము



మాలే! మణివణ్ణా ! మార్గళి
నీరాడువాన్,
మేలైయార్ శెయ్‌వనకళ్ వేండువన
కేట్టియేల్, ఇలత్తైయెల్లామ్ నడుంగ
ముఱల్వన,
పాలన్నవణ్ణత్తుఉన్‌పాఞ్చశన్నియమే,
పోల్వనశంగమ్‌గళ్ పోయ్‌ప్పాడుడై
యనవే,
శాలప్పెరుమ్ పఱైయే
పల్లాండిశైప్పారే,
కోళవిళక్కే కొడియే వితానమే,
ఆలినిలైయాయ్! అరుళేలో
రెమ్బావాయ్.

**భావము:** ఆశ్రిత వ్యామోహమే స్వరూపముగా కలిగిన ఇంద్రనీలమణి వంటి శరీరముకలవాడా! ఓ వటపత్రశాయీ! మార్గశీర్ష మాస స్నానం చేయగా వచ్చాము. మా పూర్వులున్నూ యీ స్నాన వ్రతాన్ని ఆచరించియున్నారు. ఈ వ్రతానికవసరమగు పరికరములను నిన్నర్థింపగా వచ్చాము. దయచేసి ఆలకింపుము భూమండలమంతయు వణుకు కల్గించునట్లు ధ్వనించే పాలవంటి తెల్లనైన శఖంములు సరిగా నీ పాంచజన్యము వంటివి కావలెను. అతిపెద్దవైన పఱవంటి వాద్యములు కావలను.

# పొట్టి షార్ట్ ట్రెండ్!

ఫ్యాషన్ ఫ్యాషన్









అమ్మాయిలు ఎక్కువగా వెతికేది ట్రెండ్స్ గురించే! అయితే వాటిలో డైలీ వేర్‌కీ ప్రాధాన్యమెక్కువే అన్నట్లూ అలా ఈ ఏడాది హవా వేటిదో తెలుసా? షార్ట్ టాప్‌లదే అంటున్నారు ఫ్యాషనిస్టులు. అందుకూ కారణం లేకపోలేదు. ఈ తరం అమ్మాయిలు సంప్రదాయ దుస్తులపై మనసు పారేసుకుంటున్నారన్నది వాస్తవం. అయితే అది ఆధునికంగానూ, అనుకూలంగానూ కనిపించాలని కోరుకుంటున్నారు. అలా వాళ్లకి కనిపించినవి షార్ట్ టాప్ మరి! అందుకే తెగ మెచ్చేస్తున్నారు. కాబట్టే, ఈ ఏడాది పొట్టివాటిదే ట్రెండ్ జీన్స్, ఫిట్టెడ్, పలాజో, షరారా, కేప్స్, ధోతీ... ఎన్నింటి మీదకి ఇవి జత అవుతాయో! అంటే క్యాజువల్, కాంటెంపరరీ, ట్రెడిషనల్... సందర్భమేదైనా చక్కగా జత చేసుకోవచ్చు అన్నమాట. చూడటానికీ ఎంత ముచ్చటగా ఉన్నాయో కదా! ఇంకేం తెచ్చేసుకుందాం. వార్డ్రోబ్లోకి చోటిచ్చేద్దాం. అయితే పలాజో, ధోతీ, ఫిట్టెడ్ జోడీలనే ఎక్కువమంది మెచ్చుతున్నారట. ఇంతకీ వీటిని మీరు దేని మీదకి జత చేసుకుంటున్నారు. మరి?

# ఐరాస సదస్సులో మాతృభాషలో మాట్లాడా..



పేదరికం తగ్గాలి, భూమిని రక్షించుకోవాలి, ప్రపంచమంతా శాంతితో నిండి పోవాలి... ఇలాంటి 17 లక్ష్యాలను 2030 కల్లా సాధించే దిశగా పనిచేస్తోంది ఐక్యరాజ్య సమితి. దానికి సంబంధించి తాజాగా థాయ్ లాండ్‌లో 'యునైటెడ్ నేషన్స్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (యూఎన్ ఎస్డీజీఎస్)' ఓ సదస్సును నిర్వహించింది. దానికి హాజరు అయ్యేరు ఆర్. సునీత. ఆ విశేషాలను తెలుసుకుందాం..

మాది విశాఖపట్నం. సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఈసీఈ విభాగాధిపతిగా పని చేస్తున్నాను. నాకు మొదట్లో ప్రాజెక్టులు చేయడం, జర్నల్స్ రాయడం ఇష్టం. ఏయూలో కేన్సర్ చికిత్స గుర్తింపులో ఉపయోగించే బయోమెడికల్ యాంటినాల మీద పరిశోధన చేశా ఐరాస లక్ష్యాలను అనుసరించాలని, కేంద్ర ప్రభుత్వాలు గతంలో అన్ని సంస్థలకూ పిలుపునిచ్చాయి. వాటిల్లో మా కళాశాలకు కొన్ని సరిపోతాయనిపించి కొన్ని నెలలుగా జరిగే కార్యక్రమాలు, మల్టీడిసిప్లినరీ విభాగం, బోధన సిబ్బంది, విద్యార్థులతో ఒక కమిటీని ఏర్పాటుచేశాం. శిక్షణ, నైపుణ్యాల పెంపు వంటివాటితోపాటు... ఆరోగ్య సంరక్షణలో ఏఐ, ఐవోటీల అమలు, గ్రామాల్లో తడి, పొడి చెత్త నిర్వహణ, నీటి సమస్య, విద్యుదుత్పత్తి, ప్రభుత్వ పాఠశాలల్లో లింగ సమానత్వం, ఆర్థిక అసమానతలపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలనూ నిర్వహిస్తాం. విద్యా ర్థులు, వివిధ విభాగాల అధ్యాపకులనీ ఇందులో భాగస్వాములుగా చేశాం. అవగాహన కోసం వెబ్‌సైట్‌ని అనుసరించేదాన్ని. గత ఏడాది కాలుష్య ఏషియన్ కేటగిరీలో పదో స్థానంలో నిలవడమే కాదు, నిధులూ అందాయి. అవకాశం అలా... మా కళాశాలలో కార్యక్రమాలన్నింటిపై నివేదిక తయారు చేసి యూఎస్‌డిజిఎస్‌కి పంపా. అమలు తీరు, సదస్సుకి హాజరవ్వాలని ఆహ్వానం పంపారు. దీన్లో 108 దేశాల నుంచి ఉన్నారు. వాళ్లలో ఉపాధ్యా యులు, ప్రొఫెసర్లు, న్యాయ వాదులు, వివిధ విభాగాల అధికారులు, పారిశ్రామికవేత్తలు ఇలా ఎందరో ఉన్నారు. దేశం నుంచి ముగ్గురు ఎంపికవ్వగా తెలుగు రాష్ట్రాల నుంచి నేనొక్కదాన్నే. నాలుగు రోజులు జరిగిన ఈ కార్యక్రమంలో యూఎన్ 17 లక్ష్యాలపైనా చర్చ జరిగింది. ఇందులో నేను ప్రజాప్రయోజనాల కోణంలో ఏఐ ఉపయోగం మీద ప్రసంగిం చాను. కొత్త కొలువులు రావడం, పాతవి కనుమరుగవడం పరిణామం భాగమే. అందుకు భయ పడాల్సిన పనిలేదు. కొత్త నైపుణ్యాలను అందిస్తే సరి. అయితే నైతికత భద్రతా, విషయాలకీ ప్రాధాన్య మివ్వాలి. ఈ సమస్యలు ఏర్పడే సమస్యలను ఎలా అధిగ మించొచ్చో చెప్పి... హాజరైన వారి నుంచి ప్రశంసలు అందుకున్నారు, సదస్సు అనంతరం.... కార్యక్రమం పై పీడ్‌బ్యాక్ ఇవ్వమన్నారు. దాన్ని మాతృభాషలో చెప్పొచ్చన్నప్పుడు తెలుగులో మాట్లాడా. అది మరిచిపోలేని అనుభూతి, ◻

# రంగవల్లి



- భావన
కె. ఆర్. ఆర్. హిల్స్
హైద్రాబాద్



18 చుక్కలు వరుసలు ఇటు అటు వదిలి 4 వరకు

# చింతకాయ పులిహోర



**కావలసినవి:** బియ్యం అర కిలో, చింతకాయలు వంద గ్రాములు, ఎండుమిర్చి పచ్చిమిర్చి 8, కరివేపాకు 3 రెబ్బలు, పల్లీలు గుప్పెడు, ఉప్పు రుచికి సరిపడా చెంచాలు, అల్లం అంగుళం ముక్క, ఆవాలు, శనగపప్పు, మినపప్పు, పసుపు చెంచాఇంగువ

**తయారీ:** అల్లం పొట్టు తీసి సన్నగా తరగాలి. కడిగి, తుడిచిన చింతకాయలను గ్రైండ్ అన్నం కొంచెం పొడిపొడిలాడేలా వండి ఉంచాలి. కడాయిలో నూనె వేడయ్యాక.. ఆవా శనగపప్పు, మినపప్పు, పల్లీలను వేయించాలి. ఆవాలు చిటపటలాడుతున్నప్పుడు.. ఎం అల్లం ముక్కలు, కరివేపాకు, ఇంగువ, సాగానికి చీల్చిన పచ్చిమిర్చి, పసుపు జోడించాలి చింతకాయల పేస్టు, ఉప్పు కలపాలి. పచ్చివాసన పోయే వరకూ వేయించి దించే మిశ్రమాన్ని అన్నంలో కలిపితే.. వారెవా అనిపించే పులిహోర సిద్ధం.

# ముగ్గులకు ఆహ్వానం



**మా చిరునామా** ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80 Gmail: cheli@vaartha.com

కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు

# రుచి మొగ్గలు

ఆరోగ్య భాగ్యం

తీపి-సుక్రోజ్, గ్లూకోజ్, లాక్టోజ్, ఫ్రక్టోజ్‌లుగా కారం: ఇథనాల్, క్యాప్సెసిన్, ఉప్పు-సోడియం క్లోరైడ్, పొటాషియం, మెగ్నీషియం పులుపు-లాక్టిక్ ఆసిడ్, ఎసిటిక్, సిట్రిక్ ఆసిడ్ ఇన్ఫ్యూజ్ చేయబడినపుడు ఖనిజ లవణాల ద్వారా ఇవ్వబడుతుంది. ఉదా: సిట్రస్ పండ్లు. చేదు - ఇది సంక్లిష్టమైన రుచి మొక్కల సమ్మేళనాలు కెఫిన్. ఉదా: డార్క్ చాక్లెట్, కాఫీ, టీ .వగరు : గ్లూటామేట్ వల్ల రుచి ఏర్పడుతుంది. ఉదా: పుట్టగొడుగులు, చేప, సోయా,టమోటాలు గ్రీన్ టీ.

**లోపాలు :** ✦ అగేసియా- రుచిని పూర్తిగా కోల్పోవడం ✦ హైపోగ్యూసియా- రుచి తగిన భావం. 3. డిస్గూసియా- రుచిలో మార్పు, రుచిలో వక్రీకరణ ✦. హైపర్ గ్యూసియా- అసాధారణంగా/ఎక్కువైన రుచి భావం. ఆహార రుచిని ప్రభావితం చేసే ఇతర పరిస్థితులు: బాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్స్, అంటువ్యాధులు, చిగురు వాపు, నోటిలో గొంతులో ఇన్ఫెక్షన్స్, విటమిన్ బి12 ట్యూటరీలోపల జింక్ లోపం, ఆసిడ్ రిఫ్లెక్స్, మద్యం, పొగాకు, కిళ్ళీ, గుట్కా అలవాట్లు, ఎండిన నోరు, సిగరెట్స్, బీడీలు త్రాగడం, ఫంగల్ ఇన్ఫెక్షన్స్, కాలిన నాలుక అడిషన్స్ డిసీజ్ డయాబెటిస్, హైపోథైరాయిడిజమ్, జలుబు, జ్వరాలు, సిస్టక్‌ఫైబ్రోసిస్, మందుల వాడకం, వేడి, గట్టి ఆహారాన్ని తిన్నప్పుడు రుచి మొగ్గలు పని చేయవు. మనం తినే ఆహారం, వాసన దృష్టి, ధ్వని ద్వారా రుచి ప్రభావితం అవుతుంది. **చికిత్స :** రుచిమొగ్గలు గర్భాశయంలో 10-13 వారాల గర్భధారణ నాటికి ఏర్పడతాయి. కాబట్టి పుట్టిన తర్వాత నోటి, నాలుక పరిశుభ్రత అవసరం. మౌత్‌వాష్ లేదా ఉప్పునీటితో కడగడం, సరైన ఉష్ణోగ్రతల వద్ద ఆహారాన్ని తీసుకోవాలి. అధికవేడి/ అధిక చల్లదనం ఉన్న ఆహారాన్ని తీసుకోరాదు. ✦. వక్క, తాంబూలం, పొగాకు నమలడం మానవేయాలి. మసాలాలు, కారంగా ఉండే ఆహారాన్ని తీసుకోరాదు. 3. ఇంట్లో విశ్రాంతి, వైరల్, బాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్‌కి ఆంటి బయాటిక్స్ వాడడం వల్ల, దీర్ఘకాలిక వ్యాధుల్లో నరాలు దెబ్బతినడం వల్ల రుచిలో మార్పు వస్తుంది. ✦ జ్వరం, వ్యాధులు వచ్చినపుడు చల్లగా/వేడి పదార్థాలు తిన్నా, త్రాగినా రుచి మొగ్గలు క్రియా రహితంగా/రిలాక్స్‌గా మారడం వల్ల రుచిని గ్రహించలేము. ✦ ఆహారాన్ని బాగా నమిలి తినాలి. ✦ నీరు పుష్కలంగా తీసుకోవాలి. ✦ నోరు ఎండుకుపోతుంటే చూయింగ్ గమ్ నమలడం, అల్లం, పుదీనా, చెక్క తీసుకో వచ్చు. లాలాజల గ్రంథులు తగినంత లాలాజలాన్ని ఉత్పత్తి చేయలేకపోయిన, కాఫీ, టీలు ఎక్కువగా త్రాగిన, ఆక్సిడైజింగ్ మౌతవాష్‌లు ఎక్కువగా వాడిన, ఇన్ఫెక్షన్స్, రేడియేషన్, కడుపునొప్పి, మలబద్ధకం, బి.పి. షుగర్ మందులు, ఆంటి డిప్రెసెంట్స్, ఆంటిబయాటిక్స్, స్టీరాయిడ్స్ ఆల్జీమర్ డిసీజ్, పార్కిన్‌సన్ డిసీ.: కేన్సర్, స్టీరాయిడ్స్ దంతాల అమరిక సరిగా లేకపోయిన, నాలుక గాయం, రసాయనాలకి గురికావడం, ఆహారం అలవాట్లని బట్టి రుచి మొగ్గలు మారుతాయి. ◻



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

# తెర

# 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' 13న విడుదల

## డింపుల్ హాయతి, ఆషిక రంగనాథ్




మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్‌ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. డింపుల్ హాయతి, ఆషిక రంగనాథ్ కథా నాయికలుగా నటించిన ఈ చిత్రం, ఇప్పటికే టీజర్, ట్రైలర్, పాటలతో హ్యూజ్ బజ్‌ను సృష్టించింది. ఈ సినిమా జనవరి 13న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ డింపుల్ హాయతి, ఆషికా రంగనాథ్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు. ఆషిక రంగనాథ్ మాట్లాడుతూ, డైరెక్టర్ కిషోర్ తిరుమలతో ముందు ఒక ప్రాజెక్ట్ చేయాలని అనుకున్నాం. కానీ కొన్నికారణాల వలన ఇది కుదరలేదు. తర్వాత 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' కథ చెప్పారు. కథ విన్నప్పుడే ఇందులో మోడ్రన్ గర్ల్ పాత్ర చేయాలని అనుకున్నాను. ఆయన కూడా అదే పాత్రకి అనుకున్నానని చెప్పారు. నా సామిరంగతో పోల్చుకుంటే ఇది కంప్లీట్ గా డిఫరెంట్ క్యారెక్టర్. ఖచ్చితంగా నా కెరీర్‌లో చాలా కొత్తగా వుంటుంది. ఇందులో నా పాత్ర పేరు మానస శెట్టి. ఇప్పుడున్న అమ్మాయిలు రిలేట్ అయ్యే క్యారెక్టర్.రవితేజ ఎనర్జీని మ్యాచ్ చేయడం చాలా కష్టం. అందులోనూ నాకు తెలుగు అంతగా రాదు. అయితే డైరెక్టర్ చాలా సపోర్ట్ చేశారు.

# ఓం శాంతి శాంతి శాంతిః నుండి సాంగ్ రిలీజ్



ట్యాలెంటెడ్ ఫిల్మ్ మేకర్స్ తరుణ్ భాస్కర్ తన అద్భుతమైన నటనతో కూడా అలరిస్తున్నారు. ఆయన లీడ్ రోల్ లో నటిస్తున్న చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః'. ఈషా రెబ్బా హీరోయిన్ గా నటిస్తున్నారు. ఎఆర్ సజీవ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రం, సహజమైన హాస్యం, ఆకట్టుకునే డ్రామాతో కూడిన వినోదభరితమైన విలేజ్ కామెడీ.ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ బ్యానర్స్ పై సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్ , నవీన్ సనివరపు ఈ వెంచర్‌ను నిర్మిస్తుండగా, కిషోర్ జాలాది, బాల సౌమిత్రి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ మంచి బజ్ క్రియేట్ చేసింది. ఫస్ట్ సింగిల్ సిన్నారి కోన సాంగ్ అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.ఈ రోజు సెకండ్ సింగిల్ ఓం శాంతి శాంతి శాంతిః థీమ్ సాంగ్ రిలీజ్ చేశారు. ప్రతి మహిళకు అంకితంగా నిలిచే ఈ పాటని జయ్ కృష్ణ హార్ట్ టచ్చింగ్ గా కంపోజ్ చేశారు. అభయ్ జోధ్‌పుర్కర్ వోకల్స్ మరింత ఎమోషన్ ని యాడ్ చేశాయి. భరద్వాజ్ గాలి రాసిన సాహిత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రతి పదం మనసుని హత్తుకొని సినిమా ఎసెన్స్ ని ప్రజెంట్ చేశాయి. మళ్ళీ మళ్ళీ వినాలనిపించే ఈ పాట మెమరబుల్ ఎక్స్ పీరియన్స్ ని ఇస్తోంది. ఈ చిత్రానికి దీపక్ డీవోపీగా పని చేస్తున్నారు. నంద కిషోర్ ఈమాని డైలాగ్స్ రాస్తున్నారు.ఓం శాంతి శాంతి శాంతిః జనవరి 23న వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ కానుంది.

# 'నేను రెడీ' టీజర్ ఎక్స్‌క్లూజివ్ రిలీజ్



హవిష్, త్రినాధ రావు నక్కిన, నిఖిల కొనేరు, హర్నిక్స్ ఇండియా ఎల్‌ఎల్‌బి 'నువ్విలా', 'జీనియస్', 'రామ్ లీల', 'సెవెన్' వంటి చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో హవిష్, దర్శకుడు త్రినాధరావు నక్కినతో జతకట్టారు. 'సినిమా చూపిస్తా మామ', 'నేను లోకల్', 'ధమాకా', 'మజాకా' వంటి విజయవంతమైన చిత్రాలను అందించిన త్రినాధరావు నక్కిన 'నేను రెడీ' చిత్రాన్ని పూర్తిస్థాయి కమర్షియల్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. హర్నిక్స్ ఇండియా ఎల్‌ఎల్‌బి బ్యానర్‌పై నిఖిల కొనేరు ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కావ్య థాపర్ కథానాయికగా నటిస్తోంది.టీజర్ పోస్టర్‌లో హవిష్ ఇంటెన్స్ అవతార్‌లో కనిపిస్తున్నారు. కళ్లజోడు ఆయన లుక్కు ఇంటెలెక్ట్యువల్ టచ్‌తో పాటు ఫెరోషియస్ ఎడ్జ్‌ను యాడ్ చేస్తోంది.దర్శకుడు త్రినాధ రావు నక్కిన, హవిష్‌ను చాలా యూనిక్‌గా ప్రజెంట్ చేస్తున్నారు. ఇది హవిష్ గత చిత్రాల కంటే చాలా డిఫరెంట్‌గా వుంటుంది.చిత్ర నిర్మాణం వేగంగా జరుగుతుండగా, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏకకాలంలో జరుగుతున్నాయి.బ్రహ్మానందం, శ్రీలక్ష్మి ్మ, వెన్నెల కిషోర్, మురళీశర్మ, విటివి గణేష్ ఈ చిత్రంలో ప్రముఖ పాత్రలు పోషిస్తున్నారు.

# పవర్‌ఫుల్ 'రాయ' క్యారెక్టర్ టీజర్ రిలీజ్

రాకింగ్ స్టార్ యశ్ పుట్టినరోజును సందర్భంగా ఆయన హీరోగా నటిస్తోన్న లేటెస్ట్ పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్' ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్ అప్స్ నుంచి ఆయన సినిమాలో చేస్తోన్న క్యారెక్టర్ ఇంట్రో టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ టీజర్‌తో యష్ నటించిన రాయ పాత్ర పవర్‌ఫుల్‌గా, బోల్డ్‌గా ఉంది. ఫస్ట్ ఫ్రేమ్ నుంచే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించేలా ఈ టీజర్‌ను రూపొందించారు.

అభిమానులు, సినీ వర్గాలు భారీ అంచనాలతో ఈ సినిమా కోసం వెయిట్ చేస్తోన్న నేపథ్యంలో రాయ పాత్రకు సంబంధించిన క్యారెక్టర్ ఇంట్రో సెలబ్రేషన్స్‌లా కాకుండా ఓ స్టేట్‌మెంట్‌లా ఉంది.టాక్సిక్ సినిమాలో తొలి ఫ్రేమ్ నుంచే ఓ చీకటి రాజ్యాన్ని, రాజీ పడని స్వభావాన్ని తెలియజేస్తోంది. కంఫర్ట్‌గా ఉంటే చాలనుకునేలా కాకుండా ధైర్యం, విస్తృతి, దృష్టితో రాజీపడని దానికి స్వాగతం పలుకుతుంది. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసే సినిమా ఇది. ఇప్పుడు వచ్చిన టీజర్ చూస్తుంటే రాయ సాధారణమైన వ్యక్తి కాదు.టాక్సిక్ సాధారణమైన సినిమా కాదనే విషయం తెలుస్తుంది .యశ్, గీతూ మోహన్‌దాస్ రాసిన ఈ కథకు గీతూ మోహన్‌దాస్ డైరెక్ట్ చేస్తోన్న 'టాక్సిక్' : ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్ అప్స్ సినిమాను అంతర్జాతీయంగా ప్రేక్షకులకును మెప్పించేలా ఒకేసారి కన్నడ, ఇంగ్లిష్ భాషల్లో షూట్ చేస్తున్నారు. హిందీ, తెలుగు, తమిళం, మలయాళం సహా ఇతర భాషల్లో డబ్బింగ్ ద్వారా విడుదల చేస్తున్నారు. 'టాక్సిక్' ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్' సినిమాను కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై వెంకట్ కె.నారాయణ, యశ్ నిర్మిస్తున్నారు. సినిమా 2026 మార్చి 19న ఈద్, ఉగాది, గుడి పడ్వా పండుగలు కలిసి వచ్చే లాంగ్ వీకెండ్ సమయంలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు



# కామికల్ సెలబ్రేషన్ దేఖో సాంగ్ రిలీజ్

కామికల్ సెలబ్రేషన్ దేఖో
కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు 'విష్ణు విన్యాసం' అనే యూనిక్ ప్రాజెక్ట్‌తో అలరించబోతున్నారు. నూతన దర్శకుడు యదునాథ్ మారుతి రావు ఈ చిత్రానికి దర్శకత్వం. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మించిన ఈ చిత్రాన్ని హేమ, షాలిని సమర్పిస్తున్నారు, సుబ్రహ్మణ్యం నాయుడు జి, రామచారి ఎం సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌కు మంచి స్పందన లభించింది.నయన సారిక కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సత్య, బ్రహ్మాజీ, ప్రవీణ్, మురళి శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, సత్యం రాజేష్, శ్రీనివాస్ వడ్లమాని, గోపరాజు రమణ కీలక పాత్రలు పోషిస్తున్నారు.ఈ చిత్రానికి సాయి శ్రీరామ్ సినిమాటోగ్రఫీని అందించగా, ఎ. రమణాంజనేయులు ఆర్ట్ డైరెక్టర్, కార్తికేయన్ రోహిణి ఎడిటర్ చిత్ర నిర్మాణం దాదాపు పూర్తి కావస్తుండగా, పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఏకకాలంలో జరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని ఫిబ్రవరిలో థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



# అందరూ ఎంజాయ్ చేస్తారు : డైరెక్టర్ రామ్ అబ్బరాజు



చార్మింగ్ స్టార్ శర్వా, రామ్ అబ్బరాజు దర్శకత్వంలో నటిస్తున్న హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'నారి నారి నడుమ మురారి'. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రై. లిమిటెడ్‌తో కలిసి అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రంలో సంయుక్త, సాక్షి వైద్య కథానాయికలుగా నటిస్తున్నారు. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్ క్రియేట్ చేసింది. జనవరి 14న ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ రామ్ అబ్బరాజు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**సంక్రాంతి కోసమే తీసిన సినిమానా ఇది?**

ఇది పండగ లాంటి సినిమానే. కాకపోతే శర్వాబైకర్ సినిమా విడుదల కావాల్సింది. అయితే కొన్ని కారణాలవల్ల అది వాయిదా పడింది. దీంతో మాకు సంక్రాంతికి వచ్చే మంచి అవకాశం దొరికింది.

**శర్వాఇందులో చాలాయంగ్ అండ్ స్లీక్ లుక్‌లో కనిపిస్తున్నారు కదా?**

- శర్వా బైకర్ సినిమా చేశారు. ఆ సినిమా కోసం చాలా కొత్తగా మేకోవర్ అయ్యారు. అది మాకు కలిసి వచ్చింది. మేము ఫస్ట్ ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్,తర్వాత ప్రెసెంట్ సీన్స్ చేశాం. ఆ రెండిటికీ పర్ఫెక్ట్ గా లుక్ సెట్ అయింది.శర్వా ఎంటర్టైన్మెంట్ సినిమాలు అదరగొట్టేస్తారు.

**నరేష్ మీకు లక్కీనా?**

నరేష్ అద్భుతమైన యాక్టర్. ఆయన అన్ని రకాల పాత్రలు చేస్తూ అలరిస్తున్నారు. నా సినిమాల్లో ఫాదర్ క్యారెక్టర్స్‌కి అయిన పర్ఫెక్ట్ గా షూట్ అయ్యారు. ఈ సినిమాలు కూడా చాలా అద్భుతంగా ఆయన పాత్ర ఉండబోతుంది.

**సంక్రాంతి సీజన్ మీకు కలిసి వస్తుందని భావిస్తున్నారా?**

సంక్రాంతి అడ్వాంటేజ్ ఉంటుంది. అయితే థియేటర్‌కి వచ్చిన ఆడియన్స్ సినిమా బాగుందని బయటికి వెళ్తే దానితో వచ్చే మౌత్ టాకు సినిమాని బలంగా నిలబెడుతుంది. సామజవరగమన అలానే విజయవంతమైయింది.

**హీరోయిన్స్ గురించి?**

సంయుక్త, వైద్య ఇద్దరికీ కూడా మంచి ప్రాధాన్యత ఉన్న పాత్రలు వున్నాయి. చాలా మంచి పర్ఫార్మెన్స్ ఇచ్చారు.

**బాలకృష్ణ క్లాసిక్ టైటిల్‌ని వాడుకున్నారు కదా. ఆ సినిమాకి ఈ సినిమాకి ఏదైనా పోలిక ఉందా?**

టైటిల్ తప్పా మరో పోలిక లేదు. టైటిల్ కూడా బాలకృష్ణ చేతుల మీద గానే లాంచ్ చేసాం.




## మలేసియా ఓపెన్‌లో
# సెమీఫైనల్లోకి సింధు

**న్యూఢిల్లీ:** మలేషియా ఓపెన్ 2026, సూపర్ 1000లో భారత స్టార్ షట్లర్ పివి సింధు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. కౌలాలంపూర్‌లో శుక్రవారం జరిగిన ఈ టోర్నీలో జపాన్ ప్రత్యర్థి ప్రపంచ 3వ ర్యాంకర్ అకానె యమగుచి కేవలం 12 నిమిషాల ఆట తర్వాత ఓడించడంతో సింధు మొదటి గేమ్‌ను 21-11తో గెలుచుకుంది. 2021లో ఇండోనేషియా ఓపెన్ తర్వాత, ఐదు సంవత్సరాలలో సూపర్ 1000 ఈవెంట్‌లో ఆమె సెమీఫైనల్‌కు చేరుకోవడం ఇదే మొదటిసారి. పాద గాయం కారణంగా అక్టోబర్‌లో 2025 బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సీజన్ నుండి వైదొలిగిన తర్వాత సింధు తన మొదటి టోర్నమెంట్‌లో పోటీ పడుతోంది. ఇక పురుషుల డబుల్స్ జోడీ రాంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్-శెట్టి చిరాగ్ క్వార్టర్ ఫైనల్లో ఇండోనేషియా జంట ఫజర్ అల్ఫియన్-ముహమ్మద్ షోహిబుల్ ఫిక్రితో తలపడతారు. ఇప్పటికే లక్ష్య సేన్-ఆయుష్ శెట్టి రెండో రౌండ్ దాటడంలో విఫలమవగా, సింధు, సాత్విక్-చిరాగ్ జోడీ మాత్రమే ఈ టోర్నీలో ఉన్నారు. లక్ష్య 53 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో లీ చెయుక్ యియు చేతిలో 20-22, 15-21 తేడాతో ఓడిపోగా, ఆయుష్ శెట్టి 1 గంట 10 నిమిషాల పాటు జరిగిన హోరాహోరీ పోరులో టాప్ సీడ్ యు క్వి షి చేతిలో 18-21, 21-18, 12-21 తేడాతో ఓడిపోయాడు.



# క్వార్టర్ ఫైనల్లోకి సహాజ
## థాయ్‌లాండ్ అన్చిసాపై గెలుపు

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య డబ్ల్యూ75 టోర్నమెంట్‌లో భారత్ మహిళల టెన్నిస్ నంబర్‌వన్, భారత్ యువతార, తెలంగాణ ప్లేయర్ యామలపల్లి సహజ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. థాయ్‌లాండ్‌లో జరిగిన ఈ టోర్నీలో సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 378వ ర్యాంకర్ సహజ 6-3, 7-5తో థాయ్‌లాండ్‌కు చెందిన అన్చిసా చాంటాపై గెలుపొందింది. ఒక గంటా 54 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ మూడు ఏస్‌లు సంధించి, ఒక డబుల్ ఫాల్ట్ చేసింది. తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. తొలి సర్వీస్‌లో 23 పాయింట్లు గెలిచిన ఈమె రెండో సర్వీస్‌లో 18 పాయింట్లు సొంతం చేసుకుంది. ఇక క్వార్టర్ ఫైనల్లో ఇటలీకి చెందిన లీసా పిగాటాతో సహజ సహజ తలపడనుంది. మరోపక్క ఇదే టోర్నీ డబుల్స్ విభాగం క్వార్టర్ ఫైనల్లో భారత్ ప్లేయర్ రుతుజా భోస్లే-చైనాకు చెందిన వుషువాంగ్ జెంగ్ జోడీ 6-3, 6-3తో క్యోకా ఒకమురా (జపాన్)-పింగ్‌టార్న్ ప్లిపుయెచ్ (థాయ్‌లాండ్) ద్వయంపై గెలిచింది.

## ఖేలో ఇండియాలో హర్యానా మహిళలు, ఢిల్లీ పురుషులు సెపక్‌తక్రా స్వర్ణం

**న్యూఢిల్లీ:** ఖేలో ఇండియా గేమ్స్-2026 ఫైనల్స్‌లో హర్యానా మహిళలు, ఢిల్లీ పురుషులు విభిన్న విజయాలు నమోదు చేయడం ద్వారా సెపక్‌తక్రాలో బంగారు పతకాలు సాధించారు. మహిళల సెపక్‌టక్రా ఫైనల్లో, హర్యానా జట్టు గంటా 15 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో బీహార్‌ను 2-1 తేడాతో ఓడించింది. అలాగే ఢిల్లీ పురుషులు బీహార్‌ను 2-0 తేడాతో ఓడించారు. బీచ్ సాకర్‌లో, డిఫెండింగ్ ఛాంపియన్స్ ఒడిశా 7-0 తేడాతో ఆరంగేట్రం చేసిన హిమాచల్‌ప్రదేశ్‌పై ఆధిపత్యం చెలాయించి మహిళల ఫైనల్‌కు చేరుకుంది. విజేతల తరపున శ్రీజన తమంగ్, సత్యబతి ఖాడియా, ఖుండోంగ్‌బామ్ అంబాలిక తలా రెండు గోల్స్ చేశారు. మహిళల విభాగంలో జరిగిన రెండవ సెమీఫైనల్లో, గుజరాత్ తొలి క్వార్టర్‌లో 4 గోల్స్ చేయడంతో అరుణాచల్‌ప్రదేశ్‌పై 6-3 తేడాతో విజయం సాధించింది. ఓడిపోయిన జట్టు తరపున కెప్టెన్ గియాని రాంచింగ్ మారా మూడు క్వార్టర్లలో ఒక్కో గోల్ చేసింది. కానీ గుజరాత్ గోల్ ముందు ఇతరుల నుండి పెద్దగా మద్దతు లభించలేదు. ఇక బీచ్ వాలీబాల్‌లో తమిళనాడు పురుషులు, మహిళల విభాగాల్లో బంగారు పతకాలు గెలుచుకునే అవకాశం ఉంది. దీపిక, పవిత్రలతో కూడిన తమిళనాడు మహిళల జట్టు మొదటి సెమీఫైనల్లో 19-21, 21-12, 15-6 తేడాతో స్వాతి-దర్శినిలను ఓడించి, బంగారు పతక పోరుకు అర్హత సాధించింది.




## మహిళల హాకీ లీగ్‌లో..
# రాంచీ రాయల్స్ విక్టరీ
### 5-2 తేడాతో ఎస్‌జి పైపర్స్ ఓటమి

**న్యూఢిల్లీ:** మహిళల హాకీ ఇండియా లీగ్ (హెచ్‌ఐఎల్) 2025-26లో జరిగిన చివరి మ్యాచ్‌లో రాంచీ రాయల్స్ జట్టు ఎస్‌జి పైపర్స్‌ను 5-2 తేడాతో ఓడించి ఆధిపత్య ఆల్ రౌండ్ ప్రదర్శనను కనబరిచింది. నాల్గవ త్రైమాసికంలో క్లినికల్ ప్రదర్శనతో ఆతిథ్య జట్టు టోర్నమెంట్‌లో మూడవ స్థానంలో నిలిచింది. రాయల్స్ తరఫున లూసినా వాన్ డెర్ హేడే (2వ నిముషం,47), సంగీత కుమారి (24), హన్నా కాటర్ (55, 60) గోల్స్ చేయగా, టోర్నమెంట్ ఫైనల్‌కు ఇప్పటికే అర్హత సాధించిన పైపర్స్ తరఫున నవనీత్ కౌర్ (10, 58) డబుల్ గోల్స్ చేసింది. డ్రాగ్‌ఫ్లిక్ స్పెషలిస్ట్ లూసినా వాన్ డెర్ హేడ్ 2వ నిమిషంలోనే గోల్‌గా మార్చడం ద్వారా రాయల్స్‌కు తొలి ఆధిక్యాన్ని అందించాడు. కెప్టెన్ నవనీత్ కౌర్ (10) ద్వారా పైపర్స్ తిరిగి గోల్ చేసింది. రెండు జట్లు గోల్స్ చేయడంతో, తొలి క్వార్టర్ 1-1తో సమానంగా ముగిసింది. రెండో క్వార్టర్ ఎండ్‌టుఎండ్ శైలిలో సాగింది. రాంచీ ప్లేయర్ సంగీతా కుమారి (24) గోల్ చేసింది. దీంతో రాయల్స్ అర్ధభాగం చివరి దశలో 2-1తో ఆధిక్యంలోకి వెళ్లేలా చూసుకుంది. మూడోక్వార్టర్‌లో ఇరుజట్లుపట్టుదలతో ఒకరిపై ఒకరు నియంత్రించుకోవడంతో గోల్ లేకుండా ముగిసింది. నాల్గవ క్వార్టర్‌లో లూసినా వాన్ డెర్ హేడ్ (47) పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ చేసి ఆతిథ్య జట్టు ఆధిక్యాన్ని పెంచింది. హన్నా కాటర్ వరుసగా రెండు చివరి గోల్స్ (55, 60) జోడించి పైపర్స్ పునరాగమనం ఆశలకు తెరదించింది. ఈలోగా పైపర్స్ కెప్టెన్ నవనీత్ కౌర్ (58) ద్వారా ఒక గోల్ సాధించినా రాయల్స్ 5-2 తేడాతో అద్భుతమైన విజయంతో ముగించింది.

# ఐపిఎల్ ప్లేయర్లకు జాక్‌పాట్
## టీమిండియాలోకి ఎంట్రీ.. నలుగురికి దక్కనున్న ఛాన్స్











**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఆడుతున్న యుత్ ప్లేయర్లకు జాక్‌పాట్ తగిలింది. నలుగురు ప్లేయర్లు టీమిండియాలోకి ఎంట్రీ ఇవ్వబోతున్నారు. ఐపీఎల్‌లో అద్భుతమైన ప్రదర్శనలు, దేశీయ క్రికెట్‌లో అద్భుతమైన రికార్డులు చాలా మంది యువ ఆటగాళ్లను వెలుగులోకి తెచ్చాయి. గత సీజన్‌లో తమ అద్భుత ప్రదర్శనతో సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించిన నలుగురు యువ ఆటగాళ్లు త్వరలోనే టీమిండియా జెర్సీ ధరించబోతున్నారు. వైభవ్ సూర్యవంశీ నుంచి అకీబ్ నబీ వంటి పేస్ బౌలర్ వరకు టీమిండియాలో చోటు దక్కించుకోనున్నారు. సెలెక్టర్లు ఇప్పుడు పేరు గుర్తింపు కంటే ఫాం కే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో కొంతమంది కొత్త ముఖాలు టీమిండియా క్యాప్‌లను దక్కించుకునే ఛాన్స్ తగలనుంది. అటువంటి వారిలో చెన్నై సూపర్ కింగ్స్ కనుగొన్న మరో ఆణిముత్యం ఆయుష్ మ్హాత్రే. మూడు ఫార్మాట్లలో సెంచరీ చేసిన అతి పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. టీమిండియా అండర్19 జట్టుకు కెప్టెన్‌గా ఉన్న ఇతనిని సీనియర్ జట్టులోకి తీసుకునేందుకు సెలక్టర్లు ఆలోచన చేస్తున్నారు. ధోనీ శిష్యరికంలో రాటుదేలుతున్న ఆయుష్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. జమ్మూ కాశ్మీర్ నుంచి వచ్చిన స్పీడ్ గన్ అకీబ్ నబీ ప్రస్తుత దేశవాళీ క్రికెట్‌లో హాట్ టాపిక్‌గా మారాడు. రంజీ ట్రోఫీలో కేవలం 5 మ్యాచ్‌ల్లోనే 29 వికెట్లు తీసి తన సత్తా చాటాడు. ఢిల్లీ క్యాపిటల్స్ ఇతనిని రూ.8.40 కోట్లకు కొనుగోలు చేయడం ఇతని డిమాండ్‌ను తెలియజేస్తోంది. టీమిండియాలో ఫాస్ట్ బౌలర్ల రొటేషన్ పాలసీ ప్రకారం అకీబ్ కు త్వరలోనే అవకాశం దక్కవచ్చు. ఇక రాజస్థాన్ రాయల్స్ తరపున ఐపీఎల్ అరంగేట్రం చేసిన పిన్న వయస్కుడు వైభవ్ సూర్యవంశీ సత్తా చాటుతున్నాడు. గుజరాత్ టైటాన్స్‌పై కేవలం 35 బంతుల్లోనే సెంచరీ బాది, ఐపీఎల్ చరిత్రలో రెండో వేగవంతమైన శతకాన్ని నమోదు చేశాడు. 206 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసే అతనికి త్వరలోనే భారత టీ20 జట్టులో ఓపెనర్‌గా కనిపించే అవకాశం ఉంది. భారత జట్టుకు ప్రస్తుతం స్పిన్ బౌలింగ్ ఆల్ రౌండర్ల అవసరం ఉంది. ఆ లోటును భర్తీ చేసే సత్తా విప్రజ్ నిగమ్‌కు ఉంది. 21 ఏళ్ల ఈ యువకుడు ఐపీఎల్ 2025లో 11 వికెట్లు తీయడమే కాకుండా, 180 స్ట్రైక్ రేట్‌తో విలువైన పరుగులు చేశాడు. నంబర్ 8లో బ్యాటింగ్‌కు వచ్చి ఫినిషర్ పాత్ర పోషించగల ఇతను సెలెక్టర్ల రాడార్‌లో ఉన్నాడు. ఈ నలుగురు ఆటగాళ్లు కేవలం ఐపీఎల్ ప్రదర్శనపైనే కాకుండా, దేశవాళీ క్రికెట్‌లోనూ నిలకడగా రాణిస్తున్నారు. టీ20 వరల్డ్ కప్ 2026 తర్వాత భారత జట్టులో పెను మార్పులు జరగనున్న నేపథ్యంలో టీమిండియాలోకి ఈ యువ రక్తం ఎంట్రీకి మార్గం సుగమంకానుంది.

# వారాంతంలో మార్కెట్లకు తప్పని నష్టాలు
## సెన్సెక్స్, నిఫ్టీలు భారీ పతనం




**వాణిజ్యం**

**ముంబయి, జనవరి 9:** వారాంతంలో స్టాక్ సూచీలు భారీ పతనం చవిచూసాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఐదో సెషన్‌లోనూ భారీ నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ వంటి కారణాలతో శుక్రవారం ట్రేడింగ్‌లో సూచీలు కుప్పకూలాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 605 పాయింట్లు నష్టపోయి 83,576 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 193.5 పాయింట్లు క్షీణించి 25,683 వద్ద ముగిసింది. దీంతో సూచీలు రెండు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. నిఫ్టీ కీలకమైన 25,700 స్థాయికి దిగువన ముగియడం మార్కెట్ బలహీనతను సూచిస్తోంది. ఉదయం నిఫ్టీ 25,840 వద్ద ప్రారంభమై, ఒక దశలో 25,940 గరిష్ఠ స్థాయిని తాకింది. అయితే, లాభాల స్వీకరణ వెల్లువెత్తడంతో 25,648 కనిష్ఠ స్థాయికి పడిపోయింది. భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందంపై నెలకొన్న గందరగోళం, కొత్త టారిఫ్ ఆందోళనలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీనికి తోడు రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై 500 శాతం సుంకాలు విధించే బిల్లుకు అమెరికా అధ్యక్షుడు ఆమోదం తెలపడం కూడా మార్కెట్లపై ప్రభావం చూపింది. విభిన్నరంగాల సూచీల్లో ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్, ఆయిల్ అండ్ గ్యాస్ మినహా మిగిలినవన్నీ నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ రియల్టీ సూచీ 2.12 శాతం పతనంతో అత్యధికంగా నష్టపోయింది. ఆటో, ఎఫ్ఎంసీజీ రంగాలు కూడా 1 శాతానికి పైగా నష్టపోయాయి. మరోవైపు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 22 పైసలు క్షీణించి 90.11 వద్ద ముగిసింది. మార్కెట్లు కొంతకాలం ఒడిదొడుకులకు లోనయ్యే అవకాశం ఉందని, అయితే, దేశీయ జీడీపీ వృద్ధి, మూడో త్రైమాసిక ఫలితాలు సానుకూలంగా ఉంటే మార్కెట్ తిరిగి పుంజుకోవచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# రిలయన్స్ జియో ఐపిఒ
## 400 కోట్ల డాలర్ల నిధుల సమీకరణ టార్గెట్





**న్యూఢిల్లీ, జనవరి 9:** రిలయన్స్ జియో ప్లాట్ ఫామ్‌పై భారీ ఐపిఒ వచ్చేస్తోంది. కంపెనీలో ఉన్న 2.5శాతం వాటాలను ఐపిఒలో విక్రయించి 400 కోట్ల డాలర్లనిధులను సమీకరించాలని నిర్ణయించింది. ముకేష్ అంబాని ఆధ్వర్యంలోని ఈ కంపెనీ దేశంలోనే అతిపెద్ద టెలికాం కంపెనీ జియోఆపరేటర్‌నడుస్తోంది. సుమారు 50 కోట్లమందికిపైగా కస్టమర్లతో ఉన్న కంపెనీ ఇపుడు ఐపిఒకు వస్తున్నది. గత నవంబరులోనే ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు జెఫరీస్ జియో విలువలను 180 బిలియన్ డాలర్లక అంచనావేసింది. ఈ విలువలవద్ద 2.5శాతం వాటా విక్రయంతో 4.5 బిలియన్ డాలర్లు సమీకరించవచ్చని అంచనావేస్తోంది. హుండై మోటార్ ఇండియా కూడా 2024 ఐపిఒలో 3.3 బిలియన్ డాలర్లు సమీకరించిన సంగతి తెలిసిందూ గడచిన ఆరేళ్లలో జియో కృత్రిమమేధ వైపు మళ్లింది. కెకెఆర్, జనరల్ అట్లాంటిక్, సిల్వర్‌లేక్, అబుధాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీలనుంచి నిదులను కూడా ఈ విభాగానికి సమీకరించింది. ఇపుడు ఐపిఒలో రిలయన్స్ కేవలం 2.5శాతం జియో వాటాలను మాత్రమే లిస్టింగ్‌చేయాలని చూస్తోంది. సెబీ కూడా భారీ కంపెనీలు ఐపిఒలకు వస్తే 2.5నుంచి ఐదుశాతానికి మాత్రమే వెళ్లాలని సూచించిన సంగతి తెలిసిందే. ఈ కోణంనుంచి చూస్తే ఇపుడు జియో ఐపిఒ 2.5శాతం వాటాలకే పరిమితం అవుతోంది. సంస్థ బిజినెస్ విలువలు 200 నుంచి 240 బిలియన్ డాలర్లు మాత్రమే ఉంటాయని బ్యాంకర్లు చెపుతున్నారు. ప్రైమరీ ఈక్విటీ ఇష్యూమార్కెట్‌లో జియో ప్రపంచంలోనే నంబర్2గా నిలిచింది. గత డిసెంబరు 18వ తేదీ నాటికి ప్రైమరీ ఇష్యూఎన్స్ మార్కెట్‌ద్వారా మొత్తం 21.6 బిలియన్ డాలర్ల నిధులు సమీకరణజరిగిన సంగతి తెలిసిందే. ముకేష్ అంబాని జియో లిస్టింగ్‌ను మార్కెట్‌కు వచ్చిన ఐదేళ్లకే చేయాలని భావించారు. ఓపక్క ఎలాన్ మస్క్‌స్టార్‌లింక్ ఇంటర్నెట్‌సేవలు ప్రారంభిస్తున్న తరుణంలో జియో కూడా ఎఐ సేవలను ఎన్విడియా కంపెనీతో జతకట్టి భారీ ఎత్తున అమలుకు సిద్ధం అవుతోంది. మోర్గాన్ స్టాన్లీ, భారత్‌కు చెందిన కోటక్ ఏజెన్సీలు రెండూ కూడా రిలయన్స్‌కోసం ఐపిఒ ముసాయిదాలు రూపొందిస్తున్నాయి.

# 10 బిలియన్ డాలర్లు క్షీణించిన ఫోరెక్స్ నిల్వలు



**న్యూఢిల్లీ, జనవరి 9:** భారత ఫోరెక్స్ నిల్వలు గతవారం చివరినాటికి 10 బిలియన్ డాలర్లమేర తగ్గాయి. గతవారంలో మార్కెట్‌లో నెలకొన్న పసిడిధరల్లో మార్పులే ఇందుకు కారణమని ఆర్బీఐ వాదిస్తోంది. దీనికితోడు భారత్‌రూపాయి కూడా వారాంతంలో క్షీణించింది. డాలరుతో రూపాయి మారకం విలువలు 90.16 రూపాయలుగా నడిచింది. ఆర్‌బిఐ నివేదికప్రకారం విదేశీ కరెన్సీ నిల్వలు 9.809 బిలియన్ డాలర్లు తగ్గి 686.801 బిలియన్ డాలర్లకు చేరాయి. స్థానిక స్టాక్స్‌లో నెలకొన్న బలహీనత కూడా రూపాయిపై భారం వేసింది. సెన్సెక్స్, నిఫ్టీలు రెండూ కూడా వారాంతంలో నష్టపోయాయి. గడచిన ఐదు రోజుల్లో సూచీలు 2.5శాతం నష్టపోయాయి. దీనికితోడు దేశీయ ఈక్విటీల్లో విదేశీ ఇన్వెస్టర్లు సుమారు వందకోట్ల డాలర్లమేర స్టాక్స్ విక్రయించారు. గత ఏడాది మొత్తంగా 19 బిలియన్ డాలర్లు విత్‌డ్రా అయిపోయాయి. కరెన్సీ ఆస్తులపరంగాచూస్తే 7.622 బిలియన్ డాలర్లు క్షీణించి 551.99 బిలియన్ డాలర్లకు చేరాయి. అలాగే బంగారం విలువలు కూడా తగ్గాయి. 2.058 బిలియన్ డాలర్లు తగ్గినట్లు ఆర్బీఐ నివేదికలు సూచిస్తున్నాయి. అలాగే స్పెషల్‌డ్రాయింగ్‌రైట్స్ కూడా 25 మిలియన్ డాలర్లు క్షీణించి 18.778 బిలియన్ డాలర్లకు చేరినట్లు సెంట్రల్ బ్యాంకువ ఎల్లడించింది. ఐఎంఎఫ్‌వద్ద భారత రిజర్వుస్థాయికూడా 105 మిలియన్ డాలర్లు క్షీణించి 4.771 బిలియన్ డాలర్లకు చేరింది.

## ఐదు కంపెనీల ఐపిఒలకు సెబీ గ్రీన్‌సిగ్నల్
### వచ్చేవారం ఆరు ఐపిఒలు మార్కెట్లలోకి...



**న్యూఢిల్లీ, జనవరి 9:** జియోతోపాటే మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ మరో ఐదు కంపెనీలకు ఐపిఒలను ఆమోదించింది. ఇండోఎంఐఎం, కుసుమ్‌గార్; ఆన్‌ఇఎంఐ టెక్నాలజీ సొల్యూషన్, ఆల్కోబ్రూ డిస్టిలరీస్ ఇండియా, ఆస్థా స్పింటెక్స్ సంస్థల ఐపిఒల దరఖాస్తులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గత ఏడాది డిసెంబరు 29వ తేదీనుంచి జనరవ తొమ్మిది తేదీల మధ్యలో ఈ కంపెనీలకు పరిశీలన లేఖలు అందచేసింది. ఇఎంఐ టెక్నాలజీ కిష్త్ అనే డిజిటల్ లెండింగ్‌ప్లాట్ ఫామ్ నిర్వహిస్తోంది. రూ.1000 కోట్లు నిధులు సమీకరించాలని నిర్ణయించింది. ప్రస్తుత ఇన్వెస్టర్లనుంచి ఆఫర్‌ఫర్‌సేల్ విధానంలో నిధులు సేకరిస్తోంది. బెంగళూరు కేంద్రంగా ఉన్న ఇండో ఎంఐఎం కూడా ఐపిఒకు వస్తోంది. రూ.1000కోట్లు నిధులు సమీకరణ ఒఎఫ్ఎస్ రూటులో 12.97కోట్ల ఈక్విటీ షేర్లను ప్రస్తుత ఇన్వెస్టర్లు ఆఫ్‌లోడ్‌చేస్తున్నారు. ఆల్కోబ్రూ డిస్టిలరీస్ ఇండియా ఐపిఒ కూడా రూ.258.26కోట్ల మేర ఒఎఫ్ఎస్ రూటులో 1.8 కోట్లు షేర్లు ప్రమోటర్లు లిక్విడేట్‌చేస్తున్నారు. ఇక కుసుమ్‌గార్ ఐపిఒ కూడా ఆఫర్‌ఫర్‌సేల్‌రూటులో ప్రమోటర్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. స్టాక్ ఎక్స్ఛేంజిల్లో మార్కెట్ బ్రోకర్లకు కొంత వెసులుబాటు కల్పిస్తూ సెబీ సవరణలు తెచ్చినతర్వాత ట్రేడింగ్ మరింత సులభతరం అవుతుందని చెపుతున్నారు. ఇవికాకుండా మరో ఆరుఐపిఒలు వచ్చేవారంలో మార్కెట్లకు వస్తున్నాయి. అమేగీమీ డియా లాబ్స్ 1788.62 కోట్లకు ఐపిఒ తెస్తోంది. భారత్‌కోకింగ్‌కోల్ కూడా ఈనెల 16న ఐపిఒకు వస్తోంది. ఎస్ఎంఇ సెగ్మెంట్‌లో కూడా కొన్ని కొత్త ఇష్యూలున్నాయి. ఐదుఇష్యూలు జనవరి 12నుంచి 14తేదీల్లో వస్తున్నాయి. అవానా ఎలక్ట్రోసిస్టమ్స్, నరమదేశ్‌బ్రాస్‌ఇండస్ట్రీస్, ఇండోఎస్ఎంసి గ్రేరెన్యూఎనర్ టెక్, ఆర్మర్‌సెక్యూరిటీ ఇండియా కంపెనీలపైనాఇన్వెస్టర్లు ఫోకస్ పెంచారు.

## ఒక్కనెలలో సిప్ పెట్టుబడులు రూ.31వేల కోట్లు




**న్యూఢిల్లీ, జనవరి 9:** ఈక్విటీ మూచువల్‌ఫండ్స్‌లో సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్ (సిప్)లరూపంలో రికార్డుస్థాయి పెట్టుబ డులు వచ్చాయి. ఫండ్స్ అసోసియేషన్ డేటా ప్రకారం డిసెం బరులో సిప్ పెట్టుబడులు రూ.31,002 కోట్లకు చేరినట్లు తెలుస్తోంది. మొత్తం ఆల్‌టైమ్ రికార్డుకు నమోద యింది. నవంబరులో 29,445కోట్లు కాగా డిసెంబరులో ఈమొత్తం 31 వేలకోట్లు దాటేసింది. చిన్న పెట్టుబడిదారులకు కూడా సిప్‌లపై విశ్వాసం పెరుగుతున్నదని ఈ పెట్టుబడుల తీరు తెలుస్తోంది. డిసెంబరులో గోల్‌నడ ఈటిఎఫ్ ఫండ్స్‌లో పెట్టుబడులు రూ.11,647కి చేరాయి. నవంబరులో కేవలం 3742కోట్లుమాత్రమే ఉంటే డిసెంబరులో మూడురెట్లు పెరిగినట్లు తెలుస్తోంది. అయితే నిరకంగా డిసెంబరులో విత్‌డ్రాలు కూడా పెరిగాయి. మొత్తం 66,591 కోట్లు పెట్టుబడులు ఉపసంహరించుకుంది. వంబరులో 32,755 కోట్లు ఉపసహరించుకున్నట్లు అంచనా. అయినప్పటికీ కూడా ఫండ్స్, ఈక్విటీల్లోను, సిప్‌ల్లోకూడా భారీ వృద్ధి నమోదవుతోంది. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌లలో పెట్టుబడులు నవంబరులో 8135 కోట్లతోపోలిస్తే డిసెంబరులో 10,019 కోట్లకు చేరాయి. లార్జ్‌క్యాప్ పెట్టుబడుల పరంగా నవంబరులో 164 కోట్లురాగా డిసెంబరులో 1567 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. ఇక మిడ్‌క్యాప్‌ల్లో 4487కోట్లు తాగ్గాయి. స్మాల్‌క్యాప్‌ఫండ్స్‌లో మాత్రం గతనెలలో 3824 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. థీమ్ ఆధారిత ఫండ్‌లలో పెట్టుబడులు 49శాతం తగ్గాయి. ఈ కేటగిరీల్లో పెట్టుబడులు డిసెంబరులో 946 కోట్లురాగా డెట్ మూచువల్‌ఫండ్స్‌లో డిసెంబరులో 1.32 లక్షలకోట్లు, డిసెంబరులో ఓవర్‌నైట్‌ఫండ్స్ 254.25 కోట్లు బయటికి వెళ్లిపోయాయి. సిప్‌లలో ఎక్కువగా జెన్‌జడ్ తరంతోపాటు మహిళలు, గృహిణులు, చిన్న నగరాలు, పట్టణాలనుంచి ఎక్కువ స్తున్నట్లు తేలింది. నవంబరువరకూ సిప్‌ప్లాన్‌లలో ఇన్వెస్టర్లు మూడు లక్షలకోట్లు నిధులు కుమ్మరించారు. ఈ నిధులతో మూచువల్‌ఫండ్స్ నిర్వహణ ఆస్తులు 2035 నాటికి 300 లక్షలకోట్లకు పెరుగుతాయన్న అంచనాలున్నాయి.

## ఉద్యోగులకు టిసిఎస్ హుకుం: ఆఫీసుకు రాకుంటే ప్రమోషన్లు కట్

**న్యూఢిల్లీ, జనవరి 9:** ప్రముఖ ఐటీ దిగ్గజం టీసీఎస్ కీలక నిర్ణయం తీసుకుంది. వర్క్ ఫ్రమ్ హోమ్ కు పూర్తిగా స్వస్తి పలకాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే కఠిన నిర్ణయాలను అమలు చేస్తోంది. వర్క్‌ఫ్రమ్‌ఆఫీస్ విధానాన్ని మరింత కఠినతరం చేసింది. ఇకపై ఉద్యోగులు కచ్చితంగా ఆఫీస్‌కు రావాల్సిందేనని స్పష్టం చేసింది. లేనిపక్షంలో వారి యాన్యువల్ ఇంక్రిమెంట్స్, ప్రమోషన్స్ వంటివి నిలిపివేస్తామని హెచ్చరించింది. ప్రస్తుతం టీసీఎస్ ఉద్యోగులు రోజుకు 9 గంటలు ఆఫీసులో గడపాలి. దేశంలోని ఇతర ఐటీ కంపెనీలు వారానికి రెండు లేదా మూడు రోజులు ఆఫీస్‌కు వస్తే చాలని చెబుతున్నారు. కానీ టీసీఎస్ మాత్రం ఐదు రోజులు కచ్చితంగా రావాలని నిబంధన పెట్టింది. అంతేకాకుండా వేరియబుల్ పే ను కూడా అటెండెన్స్‌తో లింక్ చేసింది. కంపెనీ నిర్ణయంతో సంస్థలోని ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. ఈ నిర్ణయంపై ఉద్యోగులు పలు విధాలుగా స్పందిస్తున్నారు. పెరిగే జీతం కంటే ఆఫీసుకు వెళ్లేందుకు అయ్యే ఖర్చే ఎక్కువ అని వాపోతున్నారు. పెరుగుతున్న అద్దెలు, రవాణా, భోజన ఇతర ఖర్చులను సాకుగా చూపుతూ చాలా మంది వర్క్‌ఫ్రమ్ హోమ్‌కే మొగ్గు చూపుతున్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.